# సుడిగుండాలు

## (రాయలసీమ ముఠాకక్షల కథ)

- సూర్య





# సుడిగుండాలు

## (రాయలసీమ ముఠాకక్షల కథ)

– సూర్య

**మాజీ శాసనసభ్యులు శ్రీ నర్రెడ్డి శివరామిరెడ్డి గారి**

**ముందుమాట తో**

నా తల్లితండ్రుల జ్ఞాపకార్థం

రచన మరియు ప్రచురణ

సూర్య

కవర్ పేజ్ డిజైన్

యస్. గంగిరెడ్డి,
&
పి. ప్రేమ్ కుమార్

Copy Rights @ Reserved

# ముందుమాట

## సుభిక్ష ప్రశాంత రాయలసీమకు దారిచూపిన కథ!

నా ముఖ్య అభిమానుల్లో ఒకరైన మల్లారెడ్డి, సూర్య అనే కలం పేరుతో, రాయలసీమ కక్షలు కార్పణ్యాలను గురించి ఈ చిన్న పుస్తకంలో ఒక చక్కని కథ రాశాడు.

ఇందులోని కొత్తపల్లె. పెద్దపల్లెలలోని కక్షలు ఎంతమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నాయో పాఠకుని మనస్సు చలించేటట్లు చూపించాడు. పగ, ప్రతీకారం అను సుడిగుండంలో చిక్కిన ఈ పల్లెలు రెండూ తుదకు ఎలా బయటపడ్డాయో, కథ సుఖాంతం అయిన తీరు తెలుపుతుంది. కథానాయకుడు రాము పాత్రను మలచిన తీరు ఈ కథకు ప్రాణం. రాయలసీమ కక్షల గురించి సంపూర్ణ అవగాహనవున్న మల్లారెడ్డి ఈ కథలోని పాత్రలను, సందర్భాలను సజీవంగా వుండునట్లు జాగ్రత్తపడ్డాడు. ఈ కారణం వల్లనూ, భాష సరళంగా వుండటంవల్లనూ, పాఠకుని, తుదివరకు ఏకబిగిన చదివేటట్లు ఈ కథ కట్టివేస్తుంది. ఒక సందర్భంలో కథానాయకుడైన రాము కక్షల పర్యావసానాలతో విసుగుచెంది తన న్యాయవాదవృత్తికి స్వస్తి చెప్పగా, ఆయనగారి సతీమణి నీరజ, సమయస్ఫూర్తిని, పరిణతిని ప్రదర్శించి, దాన్ని ఉపసంహరింపజేసిన తీరు కథకు హైలెట్‌గా చెప్పవచ్చు. కక్షలు సద్దుమణగిన తర్వాత కొత్తగా నిర్మించిన మైలవరం రిజర్వాయరు పెద్దపల్లె ప్రజల్లో గొప్ప మార్పు తెచ్చింది. ఆ నీళ్ళతో పెద్దపల్లె రైతులు రెండు కార్లు పండించుకొంటూ సుఖమయజీవితానికి అలవాటు పడ్డారు. వారు తిరిగి కక్షల జోలికి పోరుగాక పోరు.

కక్షలు, కార్పణ్యాలు ఫ్యూడల్ సంస్కృతిలో ఒక భాగం. ఇప్పుడు ఆ సంస్కృతి కనుమరుగైంది. కక్షలకు నాయకులైన వారి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్య, ఉన్నత ఉద్యోగాల వేటలో పరుగులు తీస్తున్నారు. భారీ సంఖ్యలో రాయలసీమ నుండి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక నూతన సంస్కృతి చోటు చేసుకోవటం స్వాగతించదగిన పరిణామం.

వ్యవసాయంలో వచ్చిన సాంకేతికపరమైన మార్పుల వల్ల నీరుంటే ఏమైనా సాధించవచ్చన్న ఆలోచన నూతనతరం విద్యావంతులైన యువతలో మొగ్గతొడిగింది. కరువులు, అప్పులు, ఆత్మహత్యల నుండి రాయలసీమ విముక్తి చెందాలంటే, కృష్ణ నికరజలాలు సాధించుకోవటం

ఒక్కటే ఏకైక మార్గం. 1937 నాటి శ్రీ భాగ్ ఒడంబడిక సారాంశం ఇదే. కోస్తా జిల్లాలలోని కొత్తతరం నాయకులు శ్రీ భాగ్ ప్యాక్ట్‌ను విస్మరిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కృష్ణ నీటి వినియోగంలో రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడానికి నాటి కోస్తానాయకులు అంగీకరించిన ఒడంబడిక అది.

దుర్భిక్షం లేని రాయలసీమ పట్ల నిబద్ధత వున్న నాయకుడు కావటం వల్ల వై.యస్. రాజశేఖర రెడ్డి హైదరాబాద్‌లోని తన ఇంటికి 'శ్రీ భాగ్' పేరు పెట్టుకున్నారు. బాబు తొమ్మిదేండ్ల పాలనలో పడకవేసిన రాయలసీమ ప్రాజెక్టులను తన హయంలో వై.యస్. వేలకోట్లు ఖర్చు చేసి వాటిని పరుగులు తీయించాడు, వై.యస్ అకాల మరణం సీమకు శాపంగా మారింది. వై.యస్. అనంతరం సీమ ప్రాజెక్టులన్ని ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు నిల్చిపోయాయి. పోలవరం అన్ని ప్రాంతాలకు వరం లాంటిది. తన హయంలో పోలవరం కాల్వల నిర్మాణానికి, పునరావాసానికి 4,000 కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు పోలవరం అనాథలాగా మారుతోంది. రాయలసీమకు ప్రాణప్రదమైన, పోతిరెడ్డిపాడు కొత్త రెగ్యులేటర్ వై.యస్ హయాంలో పూర్తి చేశారు. అలాగే గండికోట రిజర్వాయరు కూడా వై.యస్ పూర్తి చేశాడు. కాని, వై.యస్ అనంతరము పాలకులు గండికోట ఎగువన వున్న కీలకమైన కొన్ని పనులు పూర్తి చేయనందువల్ల కృష్ణ నదీజలాలను ఉపయోగించుకోలేకుండా వున్నాము. గాలేరు నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనులు 80 శాతం వై.యస్ హయాంలో పూర్తయితే మిగిలిన 20 శాతం పనులు కేటాయింపులు లేక మూలపడ్డాయి. పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ఇవి మాన్యుమెంట్స్‌గా మిగిలిపోకుండా వుండాలంటే, ఈ ప్రాజెక్టులు, పోలవరం ఒకే కాలంలో సత్వరం పూర్తగునట్లు వత్తిడి చేయాలి.

సీమ ప్రజలకు ఎప్పటికైనా మిగులు జలాలే గతి అనడం అన్యాయం. వారు చేసిన త్యాగానికి అది శిక్ష అవుతుంది. కోస్తా వారికి నష్టం లేకుండా సీమకు నికరజలాలు యివ్వచ్చు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు, నాగార్జున సాగర్ ఆయకట్టుకు మళ్ళించడం ద్వారానూ, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజి క్రింద కాల్వలను స్లూయిజ్‌లను ఆధునీకరించడం ద్వారానూ

శ్రీ వరి సాగు పద్ధతిని ప్రవేశ పెట్టడం ద్వారానూ, చాలా, చాలా కృష్ణ నీటిని మిగిలించి సీమకు నికర జలాలను సులభంగా అందివ్వవచ్చు. 'మనసుంటే మార్గముంటుంది' అన్న లోకోక్తిని పాటించి సీమకు న్యాయం చేయాలి. కోస్తా నాయకుల మీద చరిత్ర విధించిన కర్తవ్యం అది.

పై ప్రాజెక్టులన్ని అమలు జరిగినా సీమలో ఇంకా అధిక భాగం మెట్టగానే ఉంటుంది. సీమలోని చెరువులన్నింటిని పై ప్రాజెక్టులతో అనుసంధానము చేసి, ప్రస్తుతం తెలంగాణాలో అమలు అవుతున్న కాకతీయ మిషన్ లాగా పునరుద్ధరించాలి. రాయలసీమలో పడే పరిమితమైన వర్షపు నీరును కూడా భూగర్భ జలవృద్ధికి ఉపయోగపెట్టాలి. అందుకుగాను ఇటీవల పెద్దలు కొంతమంది కనుగొన్న పద్ధతి, రైతుల పొలాలకు ఎగువన వాలు చూసి కందకాలు త్రవ్వే పద్ధతి. వేలాదిగా వున్న వంకలు, వాగులు, చిన్న చిన్న నదులకు మరిన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. భూగర్భజలాల వినియోగాన్ని నియంత్రించటానికి ఒక పాలసీ, ఒక పథకం రూపొందించాలి.

ఇటీవలి కొన్ని పరిణామాలు రాయలసీమకు శాపంగా మారాయి. రాష్ట్రాల పునర్విభజన వల్ల బళ్ళారి లోని అధిక భాగం కర్ణాటకకు వెళ్ళింది. తుంగభద్ర రిజర్వాయరు ప్రాంతం కూడా కర్ణాటకకు వెళ్ళింది. దీనివల్ల సీమకోసం ప్రధానంగా నిర్మించిన తుంగభద్ర రిజర్వాయరు ఎగువ, దిగువ కాల్వల సామర్థ్యం తగ్గి సీమకు చాలా నష్టం కలుగుతోంది. బచావత్ కమిటీ కేటాయింపుల్లో కె.సి.కెనాల్‌కు తుంగభద్ర రిజర్వాయర్ లో కేటాయింపులు లేకుండా, దాని దిగువన పడే వర్షపు నీటిని మాత్రమే కె.సి.కెనాల్ కు కేటాయించడం వల్ల కర్నూలు, కడప జిల్లాలలో 3 లక్షల ఎకరాల ఆయకట్టు తరచు నీటిఎద్దడికి గురి అవుతూ అది బీడుగా మారిపోతోంది. ఉద్యమకారులు ఈ దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికి పూనుకొనేటట్లు ప్రభుత్వంపై వత్తిడి చేయాలి.

కరువులనుండి, ఆత్మహత్యలనుండి సీమ విముక్తి కావాలంటే వ్యవసాయకంగాను మరియు పారిశ్రామికంగానూ, అభివృద్ధి చెందడానికి ఒక సమగ్ర పథకం రూపొందించుకొని ముందడుగు వేయాలి. జిల్లాకు ఒక భారీ పరిశ్రమ స్థాపించుట ద్వారా వేలాదిమందికి రాయలసీమలోని ప్రతి

జిల్లాలో ఉపాధి లభిస్తుంది. మల్లారెడ్డి పుస్తకంలో రాయలసీమ మేధావుల సమావేశంలో రాము ఇచ్చిన ఉపన్యాసములోని సారాంశం ఇదే.

మల్లారెడ్డికి ఇది రెండవ ప్రచురణ. "ఒక మానసిక వ్యాధిగ్రస్తుని ఆత్మకథ" పేరుతో నాలుగేండ్ల క్రిందటనే మొదట ఇంగ్లీషులో తర్వాత తెలుగులో ఒక పుస్తకం వెలువరించారు. రచనావ్యాసంగంలో ఒక చేయితిరిగిన రచయితగా తెరమీదకి వస్తున్నాడు. ఆయన కలం నుండి మరిన్ని రచనలు జాలువారగలవని ఆశిద్దాం. మల్లారెడ్డికి నా అభినంధనలు, శుభాకాంక్షలు.

నర్రెడ్డి శివరామిరెడ్డి,
మాజీ శాసనసభ్యులు

# కృతజ్ఞతలు

నాకు గురుతుల్యులు, పితృసమానులు అయిన శ్రీ నర్రెడ్డి శివరామిరెడ్డి అన్నగారు, అడిగిన వెంటనే ఈ పుస్తకానికి 'ముందుమాట' వ్రాయుటకు ఒప్పుకొని, వెంటనే ఇందులో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల గురించి మరియు సాగునీటి ఆవశ్యకత గురించి, ఒక సందేశాత్మక వివరణ యిచ్చారు. వారి ముందుమాట ఈ పుస్తకానికి ఒక కలికితురాయి. ఇందుకు నేను సదా వారికి కృతజ్ఞున్ని.

ఇంకా ఈ పుస్తకము తయారుచేయుటలో నాకు సహకరించిన శ్రీమతి కోటిరెడ్డి రమ్యస్మిత గార్కి యింకా యితర మిత్రులకు నా ధన్యవాదాలు.

– సూర్య.

# ఉపోద్ఘాతము

అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని మూడు తెలుగు ప్రాంతాలలో రాయలసీమ ఒక ప్రాంతము. రాయలసీమ మొదట హిరణ్యక రాష్ట్రము అని పిలువబడేది. శ్రీ కృష్ణదేవరాయల కాలము నందు ఈ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యము కొరకు ఒక మండలము (యూనిట్) గా ఏర్పరచారు. ఈ మండలము నందే అలనాటి రాయల ముఖ్యపట్టణము విజయనగరము ఉన్నందున, ఈ ప్రాంతాన్ని రాయలేలిన 'సీమ' అని, రాయలసీమగా వ్యవహరించారు. తర్వాతి కాలములో ఈ ప్రాంతము నిజాము నవాబుల ఏలుబడిలోనికి వచ్చింది. క్రీస్తుశకం 1800 సం॥లో బ్రిటీషు పాలకులకు, నైజాం నవాబుకు కుదిరిన ఒక ఒప్పందము ప్రకారం అప్పటి రాయలసీమ ప్రాంతమైన బళ్ళారి, కడప, కర్నూలు, అనంతపురము మరియు చిత్తూరు ప్రాంతాల్ని నైజాం నవాబు బ్రిటీషు పాలకులకు దత్తత ఇచ్చారు. అప్పటి నుండి భారతదేశం స్వాతంత్ర్యము సముపార్జించేంత వరకు, వీటిని మద్రాసు ప్రెసిడెన్సీలోని సీడెడ్ డిస్ట్రిక్ట్స్‌గా బ్రిటీష్ పాలకులు వ్యవహరిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యానంతరము, మద్రాసు రాష్ట్రము, ఆంధ్ర రాష్ట్రము విడిపోయిన సందర్భములో, 1953వ సం॥ బళ్ళారి కర్ణాటక రాష్ట్రంలో కలుపబడింది. మిగిలిన కడప, కర్నూలు, అనంతపురము మరియు చిత్తూరు జిల్లాలను రాయలసీమగా వ్యవహరించడము స్థిరపడి పోయింది.

రాయలకాలములో రాయలసీమ ఎంతో ప్రఖ్యాతి గాంచినదని చరిత్రకారులు చెప్పియున్నారు. వారు, ఆనాడు రాయలసీమలో రత్నాలు రాసులుగా పోసి, వీధులలో వర్తకులు విక్రయించేవారని చెప్పారు. మొత్తముమీద ఆనాడు రాయలసీమకు ఒక సువర్ణయుగము. రాయలకాలములో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలము చేయుట కొరకు అనేక చెరువులు త్రవ్వినారు. ఇంకా, వారు అనేక గుళ్ళు, గోపురాలు కట్టించారు. నేటికి రాయలసీమ ప్రాంతంలో ఇవన్నీ మనకు దర్శనమిస్తాయి. కానీ, నేడు రాయలసీమ ఒక ఎడారి ప్రాంతాన్ని తలపించే కరువుకాటకాలతో, దేశంలోనే అతి తక్కువ వర్షపాతము నమోదయ్యే ప్రాంతాలలో ఒకటిగా పేర్కొనవచ్చును. ఇవి చాలవన్నట్లు ఇక్కడ భయంకరమైన గ్రామ కక్షల వల్ల ఎన్నో కన్నీటి గాథలు, వ్యథలు మిగిలాయి. ముందుగానే కరువు ప్రాంతము, దానికి తోడు ఈ ముఠా తగాదాల వల్ల

రాయలసీమ అభివృద్ధిలో బాగా వెనుకబడింది.

ఈ గ్రామకక్షలు ముఖ్యంగా ఈ జిల్లాల్లోని నల్లరేగడి భూములు ఉన్న ప్రాంతాలలోనే ఎక్కువగా కనిపిస్తాయి. నల్లరేగడి నేలలు లేని ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో, ఈ గ్రామకక్షలు తక్కువేనని చెప్పవచ్చు. గ్రామకక్షలకు, నల్లరేగడి నేలలకు ఉన్న సంబంధంలో మనకు శాస్త్రీయ నిర్వచనమేమీ దొరకకున్ననూ, ఈ నేలల్లోని పంటలు చాలా మటుకు వర్షాధారితమై ఉంటాయి. ఇక్కడ వర్షాభావ పరిస్థితులు మెండుగా ఉన్నందున, ఎప్పుడూ వరుస కరువు కాటకాలతో, ప్రజలు చాలా పేదరికంతో అనేక కష్టాలు అనుభవిస్తూ ఉంటారు. ఇంకా సంవత్సరములో చాలా భాగము ప్రజలు ఏ పని లేకుండా వ్యర్థముగా కాలము గడుపుచూ వుంటారు. ఇట్టి పరిస్థితులలో వారిలోని నిగూఢమైన శక్తి దుర్వినియోగ పరచడం జరుగుతూ ఉంటుంది. చిన్న–చిన్న విషయాలకు తగాదాపడుతూ ఉంటారు. పైన పేర్కొన్న కారణాల వల్ల వీరు తరుచూ దురుసుగా ప్రవర్తించడం కూడా జరుగుతూవుంటుంది. దీనికి తోడు ఈ ప్రాంతంలోని ధనవంతులైన భూస్వాములు వారి స్వలాభం కొరకు ముఠాకక్షలను పెంచి పోషిస్తూ వుంటారు.

పోలీసులలో నెలకొన్న అవినీతి, ఇంకా కోర్టుల్లో కేసులు తొందరగా తేలకపోవడము మూలంగా కూడా ఇక్కడి ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తూవుంటారు. అందుకే ప్రతీకారదాడులు కూడా జరుగుతూ ఉంటాయి.

ఈ మధ్యకాలంలో రాయలసీమ ముఠా తగాదాలను నేపథ్యంగా తీసుకొని చాలా సినిమాలు తీశారు. అవి చాలా వరకు విజయవంతంగానే ప్రదర్శింపబడ్డాయి. సినిమాలలో చూచుటకు ఈ సంఘటనలు చాలా ఉద్వేగభరితంగా ఉంటాయి. కానీ, నిజ జీవితంలో ఈ గ్రామకక్షల బారిన పడిన ప్రజలకు నరకమంటే ఏమిటో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఊరిలో ఒకరు హత్య గావింపబడినచో, వారి కుటుంబ సభ్యులు, బంధువులు అవమానభారంతో కృంగిపోతారు. దీనితో బాధితులలో ప్రతీకారేచ్ఛ రగులుతుంది. దాడులు, ప్రతీకారదాడులు మామూలైపోతాయి. ఎవరికీ ప్రశాంతత అనేది ఉండదు. తమ ప్రత్యర్థిని మట్టుపెట్టడమే లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ ప్రాంతములో పనిచేసే పోలీసులు వీరిని నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తారు. ఇరువర్గాల వారు పోలీసుల చుట్టూ,

కోర్టుల చుట్టూ తిరుగుతూ, తాము కష్టపడి సంపాదించిన ధనమంతా మంచి నీటిలా ఖర్చు పెడతారు. సినిమాల్లో చూపినట్లు వీరి జీవితాలు ఏ మాత్రం ఉద్వేగభరితంగా ఉండవు. ఎప్పుడూ ప్రాణ భయంతో ఒక క్షణం కూడా మనశ్శాంతి లేకుండా జీవచ్ఛవాల్లా బ్రతుకు వెళ్ళదీస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే, 'ఈ గ్రామ కక్షలు ఒక చావు బ్రతుకుల "పైశాచిక క్రీడ" అని చెప్పవచ్చు.

అయితే, ఇటీవలి కాలంలో ఈ ముఠాకక్షలు చాలామటుకు సమసిపోయాయి. ఇది ఒక విధంగా క్రిందటి ప్రభుత్వాల విజయమనే చెప్పుకోవాలి. కొందరు వృత్తిపరంగా నిష్ఠాగరిష్ఠులైన ఐ.పి.యస్. (ఇండియన్ పోలీసు సర్వీసు) ఆఫీసర్ల కృషి ఫలితమని కూడా చెప్పవచ్చు. అంతేకాక నేటి సమాజం అభివృద్ధి పథంలో పయనించడం, ఇక్కడి బాలబాలికలు మంచి విద్యావంతులవడము, ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు రావడము మొదలగు కారణాల వలన కూడా ఇప్పుడు ముఠాకక్షలు అంతరించిపోయాయనే చెప్పవచ్చు. రాయలసీమ వాసులకు ఇది ఒక శుభపరిణామము. ఈ పుస్తకంలో నేను నా చిన్ననాటి అనుభవాలను జోడించి ఆనాటి పరిస్థితులను, ఈనాటి సమాజం ముందు ప్రస్తావించడం జరిగింది. అంతేకాని, ఇందులో నేను ఏ వ్యక్తిని గానీ, ఏ వర్గాన్ని కానీ ఉద్దేశించి వ్రాయలేదు. కేవలం మంచికి, చెడుకు జరిగిన సంఘర్షణలకు, ఒక ప్రాంతంలో నెలకొన్న ఆనాటి పరిస్థితులను, సినిమాల్లో చూపినట్లుగా కాక వాటిలోని వాస్తవికతను తెలియ చెప్పుటకై చేసిన చిన్న ప్రయత్నమే ఈ పుస్తకము.

భూస్వామ్య వర్గానికి చెందిన ఒక మోతుబరి రైతు గంగిరెడ్డి. ఇతను ప్రాథమికవిద్య మాత్రమే చదువుకొని, ధృఢ స్వభావం కలిగి, సున్నిత భావాలు లేని మొరటు మనిషి. అతని కుమారుడు రాము. ఇతను లేత ప్రాయములోనే తను చుట్టూ ఉన్న సమాజము మరియు తన కన్న తండ్రి ఇతరుల పట్ల కఠినంగా, దౌర్జన్యంగా ప్రవర్తించడం చూసి బాధతో తల్లడిల్లుతాడు. తన చుట్టూ జరుగుతున్న హింసాత్మక సంఘటనలు చూసి పసివయసులోనే ఆత్మన్యూనతా భావములోకి నెట్టివేయబడతాడు.

రాము తండ్రి గంగిరెడ్డికి రాము మనస్తత్వం మింగుడు పడలేదు. తనలాంటి యోధునికి ఇంత సాధు స్వభావం కలిగిన కుమారుడు ఏమిటి ? వీడిని ఎలాగైనా మార్చి తనంతటి వానిగా తీర్చిదిద్దాలను కుంటాడు. కానీ అతని ప్రయత్నాలేవి ఫలించవు.

కానీ అనూహ్యంగా యోధుడైన గంగిరెడ్డి, జీవితంలో ఎలా ఓడిపోతాడో, అలాగే సాధు స్వభావుడు, శాంతమూర్తి అయిన రాము, ఎలా విజయపథంలో జీవిత గమ్యాన్ని చేరుకుంటాడో తెలుపుతూ, రాయలసీమ ముఠాకక్షల నేపధ్యంలో సాగుతుందీ కథ.

ఈ పుస్తకము, కేవలము కడప జిల్లా ముఠాకక్షల ఇతివృత్తముతో సాగినా, రాయలసీమ అన్ని జిల్లాల్లోనూ, ఇలాంటి సంఘటనలే జరుగుతూ వుంటాయి. కనుక, అన్ని జిల్లాల ముఠాతగాదాలు ఒకేసారి పేర్కొనడమెందుకని, ఒక్క కడప జిల్లా ఇతివృత్తముతోనే ఈ కథ వ్రాయడము జరిగింది.

– సూర్య.

# సుడిగుండాలు

## (రాయలసీమ ముఠాకక్షల కథ)

– సూర్య

## మొదటి భాగం

గంగిరెడ్డి కొత్తపల్లెలో ఒక మోతుబరి రైతు. చుట్టుప్రక్కల ఉన్న ఊర్లలోకెల్ల ధనవంతుడైన రైతు. ఇతడు ప్రాథమిక విద్య మాత్రమే చదువుకొని ఉన్నాడు. అయితే మంచి లోకజ్ఞానము కలిగి ఉండేవాడు. ఇతడు ఒక ధృఢ స్వభావము కలిగి, కష్టపడి పనిచేయు మంచి రైతుగా పేరు గడించియున్నాడు. కానీ, ఇతనికి డబ్బు మీద ఉన్న విపరీతమైన కాంక్ష మరియు ఒక విధమయిన పిసినారితము, ఇతని వ్యక్తిత్వానికి మాయని మచ్చలాగా ఉండేది.

ఇతనికి 5 మంది ఆడపిల్లల తర్వాత ఒక కుమారుడు జన్మించాడు. అతడే రాము, మన కథానాయకుడు. తన ఆస్తికంటికి వారసుడైనందున, తన వంశాన్ని ఉద్ధరించేవాడు వీడేనని, గంగిరెడ్డి ఆ పిల్లవాని మీద విపరీతమయిన ప్రేమ, పుత్ర వ్యామోహము కలిగి, రామును అపురూపంగా చూసుకొనేవాడు. అప్పట్లో రాయలసీమ ప్రాంతంలో సరైన రోడ్డు, బస్సు సౌకర్యాలు లేవు. అది 1955వ సం॥ ప్రాంతమయి వుంటుంది. చాలా మంది పల్లెటూర్లలోని రైతులు కాలినడకనగానీ, ఎడ్లబండ్లలోగానీ, చుట్టుప్రక్కల ఊర్లకు ప్రయాణం చేసేవారు. వారి పంటలు కూడా ఎడ్లబండ్లలోనే తీసుకొనిపోయి పట్టణంలో విక్రయించేవారు. కొందరు మోతుబరి రైతులు గుర్రాలను కూడా ప్రయాణ సాధనాలుగా వాడేవారు.

రాముకు అప్పుడు ఇంకా 3 సం॥లు నిండలేదు. ఆ రోజు గంగిరెడ్డి వేకువజామునే లేచి తన భార్య రాజేశ్వరిదేవిని, తన ముద్దులకొడుకు రామును పిలుచుకొని, ఎడ్లబండిపై దగ్గరలోనే ఉన్న చిన్నపట్టణము ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. ఆ కాలములో ప్రొద్దుటూరును 'పేట' అని కూడా పిలచేవారు. పేటలో గంగిరెడ్డి 7 ఇళ్ళను కట్టించియున్నాడు. కొద్దికాలం అక్కడే తన భార్యతో కలిసి నివాసముండి ఆ ఇళ్లను కట్టించినాడు. ఆ ఇళ్ళు తయారైన కొద్దిరోజుల్లోనే రాము అక్కడే జన్మించాడు. గంగిరెడ్డి ఒక ఇంటిని తమ కోసమే ప్రత్యేకంగా పెట్టుకొని, మిగతా ఇళ్ళు

బాడుగకు ఇచ్చాడు. కనుక, గంగిరెడ్డి అప్పుడప్పుడు సతీసమేతంగా రామును పిలుచుకొని పేటకు పోయి అక్కడే కొద్దిరోజులు ఉండి, తన పనులను చూసుకొని తిరిగి పల్లెకు వచ్చేవాడు.

అలాగే ఈసారి కూడా రామును పిలుచుకొని తన భార్యతో కలిసి ఎడ్లబండిలో వేకువజామునే బయలుదేరాడు. రాముకు ఇంతకు మునుపు చేసిన ప్రయాణాలేవి గుర్తుకు లేవు. ఈరోజు వేకువజామునే మెలుకువ వచ్చినప్పుడు, రాముకు తన అమ్మ, నాన్నలతో కలిసి ఎడ్లబండిలో ప్రయాణము చేయుచున్న ఈ సంఘటన, రాము మనోఫలకముపై జ్ఞాపకం ఉన్న మొట్ట మొదటి సంఘటన. అది తెల్లవారుజామున 5గం॥ ప్రాంతము. బాగా చీకటిగా ఉంది. గతుకుల దారిపై ఎడ్లబండి కుదుపులతో ప్రయాణిస్తూ ఉంది. ఇంతలో ఎడ్లబండి ఒక రైల్వే క్రాసింగ్‌ను దాటబోవు చుండగా, తెల్లవారుజామున వెళ్ళు చెన్నై–ముంబాయి రైలు బండి, అన్ని కంపార్టుమెంటులలోను ప్రకాశవంతమైన వెలుతురుతో, విపరీతమైన శబ్దం చేయుచూ రాము ప్రయాణం చేస్తున్న ఎడ్లబండిని వేగంగా దాటిపోయింది. రాము ఆ రైలుబండిని, అందులోని ప్రకాశవంతమైన వెలుగును, అమితమైన ఆశ్చర్యంతో చూసి,

"నాయనా ! ఏమిటది ? అంతపెద్దది !! అలా శబ్దం చేస్తూ పోయింది ? అందులోని ఆ వెలుతురు ఏమిటి ?" అని వరుస ప్రశ్నలు వేశాడు.

గంగిరెడ్డి తన చిన్ని కుమారుని మాటలకు మురిసిపోతూ,

"అది రైలుబండి బాబు ! అందులో మనుషులు ఒక ఊరి నుండి ఇంకొక ఊరికి ప్రయాణం చేస్తారు. అందులోని వెలుతురు కరెంటు బల్బులది. ప్రొద్దుటూరులో మన ఇళ్ళలో కూడా ఇటువంటి కరెంటు బల్బులున్నాయి".

అని, రైలు బండి అంటే ఏమిటో తన చిన్ని కుమారునికి తెలియచెప్పే ప్రయత్నం చేశాడు. రాము రైలుబండి గురించి మరియు కరెంటు బల్బులగురించి అర్థం చేసుకొనుటకు ప్రయత్నము చేశాడు. అయితే రాము బుర్రకు తట్టిన ఒకే ఒక అర్థం, ప్రొద్దుటూరులో తమ ఇళ్ళలో కూడా అలా వెలిగే కరెంటు బల్బులున్నాయని. రాము సొంత ఊరు కొత్తపల్లెలో అప్పటికి విద్యుత్ లేదు. కనుక, అతనికి కరెంటు బల్బుల గురించిన జ్ఞానం లేదు. తర్వాత 12 సం॥లకు గానీ అక్కడ

విద్యుత్ రాలేదు.

రాము విద్యుత్ దీపాల గురించి, రైలుబండి గురించి ఆలోచిస్తూ మరలా నిద్రలోకి జారుకున్నాడు. రాముకు మరలా మెలకుల వచ్చేసరికి ఎడ్లబండి పెన్నానది దాటి ప్రొద్దుటూరులోకి ప్రవేశిస్తూ ఉంది. రాము మరలా తండ్రిని,

"నాయనా ! మనం ఇప్పుడు ఎక్కడ ఉన్నాము ?"

అందుకు అతని తండ్రి,

"మనము ప్రొద్దుటూరికి దగ్గరగా వచ్చినాము".

అని చెప్పి, తన భార్య రాజేశ్వరి వైపుకు తిరిగి,

"ఒక సంII క్రింద నల్లబల్లె నర్శిరెడ్డిని, అక్కడ కనిపిస్తున్న ఆ పాడుబడ్డ ఇంటివద్ద 'ఖూని' చేసినారు. ఆ కేసులోని ముద్దాయిలందరిని 'గళ్ళుకు (ఉరిశిక్ష)' వేసినారు",

అని చెప్పినాడు. రాముకు తన తండ్రి మాటలు ఏమి అర్థం కాలేదు. రాము మరలా,

"నాయనా ఖూని అంటే ఏమిటి" అని అడిగాడు.

అందుకతని తండ్రి,

"ఒక మనిషిని, ఇంకొక మనిషి చంపితే, దానిని 'ఖూని' అని అంటారు".

అని చెప్పాడు. రాముకు, ఏమీ అర్థం కాలేదు. అసలు ఒక మనిషిని, ఇంకొక మనిషి ఎందుకు చంపుతాడో అసలే అర్థం కాలేదు. ఒక చీమను చంపితేనే తన తల్లి తనతో,

"రాము పాపం రా! అలా చంపకూడదు!! పాపం వస్తుంది !!!" అని చెప్పేది.

మరి మనిషిని ఎందుకు? ఎలా? చంపుతారో, రాము అసలు ఆలోచించలేక పోయాడు. రాము బుర్రకు 'గళ్ళుకు' అంటే ఏమిటో తర్వాత చాలా కాలం వరకు అర్థం కాలేదు.

రాము తర్వాతికాలంలో సున్నితమైన మనస్తత్వం కలిగి ఉండుటకు, బహుశా, తనకు అనుభవమయిన ఈ మొట్టమొదటి జ్ఞాపకాల దొంతరలే కారణం అయివుండవచ్చు. ఈ సంఘటన తర్వాత తన చిన్ననాటి సంగతులు ఇంకా చాలా జ్ఞాపకమున్నాయి. కొద్దిరోజుల తరువాత తన తండ్రి గంగిరెడ్డి తనను భుజాల పైకి ఎక్కించుకొని, కల్లంలోకి, ఇంకా ప్రక్క ఇళ్ళల్లోని బంధువుల

వద్దకు, అవతలి వీధిలోని సుబ్బిశెట్టి అంగడికి పిలుచుకొని పోయేవాడు. కల్లంలో, పావురం కంటే చిన్నగా ఉన్న పక్షులు కొన్ని గింజలు ఏరుకొని తింటూ, ఒక విధమైన శబ్దాలు చేస్తూ వుండేవి. రాము తన తండ్రితో,

"ఆ పక్షుల పేరేమిటి ? అవి ఏమని అరుస్తున్నాయి ?

ఎందుకు అలా అరుస్తూ ఉన్నాయి ?" అని అడిగాడు. అందుకు గంగిరెడ్డి,

"ఆ పక్షులను బెళ్ళగాళ్ళు అని అంటారు. అవి ఎప్పుడూ శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! అని దేవున్ని ప్రార్థిస్తూ ఉంటాయి" అని చెప్పాడు. అప్పటి నుండి రాముకు ఆ పక్షులంటే ప్రీతి ఏర్పడింది.

తన పెద్ద అక్క శివమ్మ భర్త వీరారెడ్డి తుపాకీ తీసుకొని దగ్గరలోనే ఉన్న అడవికి వెళ్ళి జింకలను, కుందేళ్ళను వేటాడేవాడు. వీరారెడ్డి ఎందుకో కొద్దిరోజులుగా వేటకు వెళ్ళలేదు. కల్లంలో జొన్నలు, కొర్రలు నూర్పిడికి వచ్చాయి. అప్పుడు అక్కడ రాము, కొందరు పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ప్రక్క కళ్ళంలో బెల్లగాళ్ళు, శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! అని అరుస్తున్నాయి (అవి అరిచే అరుపులు మనం ఏవిధంగా అన్వయించుకుంటే ఆ విధంగా అనిపిస్తూ ఉంటాయి. ఈ విషయం పల్లె జీవితం గడిపిన చాలా మందికి అనుభవమయి ఉంటుంది).

ఆ రోజు రాము బావ వీరారెడ్డి ఇంకా కొంత మంది స్నేహితులతో కలిసి తుపాకీ పట్టుకొని కల్లంలోకి వచ్చాడు. వచ్చి రాగానే, తుపాకీలో రవ్వలతూటాను నింపి, గురి చూసి శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! అని అరుస్తున్న బెళ్ళగాళ్ళ గుంపుపై కాల్చాడు. తుపాకీ పెద్ద శబ్దం చేస్తూ పేలింది. చెట్లపై ఉన్న కాకులు అన్ని కావు,కావు, అని అరుస్తూ పైకి ఎగిరాయి. గుంపులు, గుంపులుగా ఉన్న బెళ్ళగాళ్ళని చెల్లాచెదురు అయ్యాయి. వీరారెడ్డి స్నేహితులు వెంటనే పరిగెత్తుకెళ్ళి "ఒక్కవేటుకు 8 బెళ్ళగాళ్ళు చచ్చినాయి" అని అరుస్తూ, రక్తం మోడుతూ నేలకొరిగిన ఆ పిట్టలను పట్టుకొని,

"ఈరోజు వీటితో మాకు మాంచి విందు",

అని వీరారెడ్డి దగ్గరగా వచ్చారు. వీరారెడ్డి కొంచెం గర్వంగా చిరునవ్వు నవ్వి, వాటన్నిటిని ఒక మనిషి ద్వారా ఇంటికి పంపి, వాటి మాంసంతో వేపుడు చేయమని, చెప్పమని చెప్పాడు.

అతి చిన్న వయసులో ప్రత్యక్షంగా ఈ హింసాత్మకమైన సంఘటన చూసిన రాముకు

గుండెలు తరుక్కుపోయాయి. శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! అని ప్రార్థిస్తున్న ఆ అమాయకమయిన పిట్టలను కాల్చినపుడు ఆ శ్రీకృష్ణుడు ఎందుకు వాటిని రక్షించలేదో రాముకు అర్థము కాలేదు.

తరువాత ఇంటివద్ద రాము తల్లి అయిష్టంగానే ఈ పక్షుల వేపుడు చేసింది. అప్పుడు ఆమె అన్న మాటలు నేటికి కూడా రాము చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అప్పుడు ఆమె,

"ఈ అమాయకమయిన పిట్టలను చంపిన పాపం ఊరికే పోదు. వీటిని చంపుటకు అతనికి చేతులెలా వచ్చాయో", అని అంది.

ఆ రోజు వండిన మాంసం వీరారెడ్డికి, అతని స్నేహితులకు మాత్రమే వడ్డించారు. మిగిలిన కుటుంబ సభ్యులెవ్వరు దాన్ని తాకనైనా లేదు. రాము ఈ సున్నితమైన మనస్తత్వం వల్ల ఎవరితోనూ ధైర్యంగా మట్లాడలేక పోయేవాడు. అందరి ముందు చాలా సిగ్గుపడుతూ ఉండేవాడు. గంగిరెడ్డి, కొడుకు ప్రవర్తన చూసి కొంచెం ఆలోచనలో పడ్డాడు. ఈ ప్రాంతంలో గ్రామాలలో నిలదొక్కుకోవాలంటే ఎంతో ధైర్యస్థైర్యాలు అవసరం. అలాగే కొంచెం కఠినంగా కూడా వ్యవహరించాల్సి ఉంటుంది. కనుక, తన కొడుకును ఎలా అయినా తనంతటివాన్ని చేయాలని సంకల్పించాడు.

ఇప్పుడు గంగిరెడ్డి ఊరిలో పనిమీద ఎక్కడికి పోయినా, రామును తనతోపాటు పిలుచుకొని పోయేవాడు. ఈ విధంగానైనా రాముకు తన వ్యవహారశైలి నేర్పాలనుకొనేవాడు.

ఆ రోజు గంగిరెడ్డి, రామును పిలుచుకొని ఊరి బయట ఉన్న లంబాడాతాండకు వెళ్ళాడు. గంగిరెడ్డి అక్కడ ఉన్న లంబాడావారందరికి డబ్బు, ధాన్యం అప్పు ఇచ్చి వున్నాడు. అందుకుగాను వారు, వారి జీవాల ఎరువంతా తనకే అమ్మవలసి ఉంటుంది. అది కూడా తాను నిర్ణయించిన ధరకే ఇవ్వవలసి ఉంటుంది. అక్కడి వారంతా ఎప్పుడూ గంగిరెడ్డికి వ్యతిరేకంగా ప్రవర్తించేవారు కాదు. కానీ 2 రోజుల క్రిందట, లక్ష్మానాయక్ అనే వ్యక్తి, ఇంకొక రైతు ఎక్కువ ధర ఆశ చూపడంతో, తన వద్ద ఉన్న ఎరువంతా అతనికి అమ్మినాడు. ఈ విషయం తెలుసుకున్న గంగిరెడ్డి లక్ష్మానాయక్‌ను తక్షణమే, ఉన్నఫలంగా తన బాకీ మొత్తం తీర్చమని నిలదీశాడు. తన తండ్రి ఆవేశంగా మాట్లాడటం చూసి రాము బెంబేలు పడ్డాడు. ఈలోగా లక్ష్మానాయక్ కొద్దిగా తిరుగుబాటు

ధోరణి ప్రదర్శించడంతో, గంగిరెడ్డి తన చేతిలో వున్న తన కుమారుని చేతిని విసురుగా విదిలించి, ఒక్క ఉదుటున లక్ష్మానాయక్‌పైకి లంఘించి రెండు చేతులతో అతని మొహంపై పిడిగుద్దులు కురిపించాడు. అక్కడ అంతా తాండా వారే ఉన్నారు, కానీ, ఒక్కరు కూడా ఇదేమిటని అడగటానికి సాహసించలేదు. తర్వాత, లక్ష్మానాయక్, గంగిరెడ్డికి సాష్టాంగపడి, తను తప్పుచేశానని, అందుకు అపరాధంగా తన గొర్రెలను ఒక వారం రోజులు గంగిరెడ్డి పొలాలలో ఉదుగుతామని, ఇంకెప్పుడు పొరపాటు చేయనని వేడుకున్నాడు. దానితో గంగిరెడ్డి శాంతించి, అంతవరకు ఏమి జరుగనట్లే నిమ్మలంగా తన కొడుకు చేయి పట్టుకొని ఇంటికి బయలుదేరాడు.

రాముకు ఈ వ్యవహారమంతా చాలా అన్యాయంగా, అసహ్యంగా కనిపించింది. ఉన్నట్లుండి తన తండ్రికి అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. మొదటిసారిగా తన తండ్రి చేసిన పనిని రాము సమర్థించలేక పోయాడు. అప్పటి నుండి రాముకు, తన తండ్రి అంటే అమితమయిన భయంతో పాటు, తన తండ్రి లోపాలను మనసులోనే విమర్శించడం కూడా మొదలు పెట్టాడు. ఆ తర్వాత, తనకు తెలియకుండానే రాము అందరి ముందు అన్నిటికి సిగ్గు, భయము కలిగి, ఎవరితోనూ ధైర్యంగా వ్యవహరించేవాడు కాదు. ఈ విధంగా అంత లేత వయసులోనే రాము ఆత్మన్యూనతా భావంలోనికి నెట్టివేయబడ్డాడు.

అలా భయం-భయంగానే రాము కొంచెం పెద్దవాడై 5 సం॥లు నిండాయి. రాము తల్లి రాజేశ్వరి దేవికి ప్రాథమిక విద్య బాగా వచ్చు. కాబట్టి రాముకు చిన్న చిన్న పద్యాలు, పాటలు, తెలుగు అక్షరాలు, ఎక్కములు మొదలగునవి ఇంటివద్దనే నేర్పుతూ ఉండేది. అప్పటికి కొత్తపల్లెలో ప్రభుత్వ పాఠశాల ఏదీ లేదు. కానీ ఒక భట్రాజుల బడిని ఆ ఊరి పెద్దలు చాలా కాలం నుండి నిర్వహిస్తూ వున్నారు. ఇప్పుడు రామును అందులో ఒకటవ తరగతిలో చేర్పించారు. భట్రాజుల బడిలో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు ఏవి ఉండేవికావు. అందులో పెద్దబాలశిక్ష, ఎక్కములు, కూడికలు, తీసివేతలు, భాగహారములు మొదలగు వాటితోపాటు ఆంధ్రము, అమరకోశము, వేమన శతకము, సుమతి శతకము మొదలగు శతకములు బాగా నేర్పించేవారు. దీనివలన భట్రాజుల బడిలో చదివిన పిల్లలకు తెలుగు భాషా పరిజ్ఞానము, నీతి పద్యాలు, ప్రాథమిక

గణితం మొదలగు వాటి యందు మంచి ప్రావీణ్యం ఉండేది.

1957వ సం॥లో కొత్తపల్లెలో మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాల ప్రారంభమైంది. అప్పుడు రాము, రెండవ తరగతి చదువుతూ ఉండేవాడు. స్కూలు ప్రారంభము నందు అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. వారిలో శివారెడ్డి అనే అధ్యాపకుడు ప్రధానోపాధ్యాయుడుగా ఉండేవాడు. ఈయన వృత్తిపట్ల అంకిత భావము కలిగి, ఊరిలోని పిల్లలందరిని స్కూళ్ళో చేర్పించి అందరికి విద్య నేర్పించవలెనని పాటు పడుచుండేవాడు.

అప్పట్లో దళితులను అంటరానివారిగా చూసే అనాచారము ఉండేది. అలా చేయడము అప్పట్లోనే శాసనాల ప్రకారం నేరమైనా, ఎవరూ వాటిని అమలు పరచకపోవడంతో ప్రజలు కూడా ఈ దురాచారాల నుండి బయట పడలేక, వారి మూర్ఖత్వాన్ని బయటకు ప్రదర్శించేవారు. అయినా కూడా ప్రధానోపాధ్యయుడు శివారెడ్డి దళితుల పిల్లలను స్కూళ్లో చేర్పించి వారికి విద్యాబుద్దులు నేర్పించే ప్రయత్నం చేశాడు.

క్రమంగా ఊరిలోని పిల్లలంతా స్కూళ్ళో చేరారు. కానీ, కొన్నాళ్ళ తర్వాత కొత్తగా స్కూళ్లో చేరిన పిల్లల్లో కొంత మందిని వారి తల్లిదండ్రులు స్కూలు మాన్పించారు. దీనికి కారణము, వ్యవసాయ పనుల్లో పిల్లలు తమ తల్లిదండ్రులకు సహాయపడటం ఒక వంతు అయితే, మేము చదుపుకొని ఏమి లాభం? పిల్లలు ఏ పనికీ కొరగాకుండా పోతారనే భయం కూడా మరొక కారణము. దీనికి విరుగుడుగా, ప్రధానోపాధ్యాయుడు బాగా చదివే పిల్లలను రెండు జట్లుగా ఏర్పరచి, వారిని మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్కూలు మానిన పిల్లల ఇళ్ళకు పోయి, పిల్లల తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, వారి పిల్లలను మరలా స్కూలుకు పంపమని కోరేవారు. ఒకరోజు మధ్యాహ్నం రాము తన జట్టులోని మరో ముగ్గురి పిల్లలతో కలిసి, ఆ రోజు స్కూలుకు రాని పిల్లల ఇళ్ళకు పోయాడు. మొదట సుబ్బారెడ్డి అనే పిల్లవాని ఇంటికి వెళ్లారు. కానీ, అక్కడ ఆ పిల్లవాడు లేడు. సుబ్బారెడ్డి తండ్రి,

“వాడు కరుబూజకాయలతోటలో మొక్కలకు నీరు పెట్టుటకు పోయినాడు. వాడు ఇంక స్కూలుకు రాడు. మీరు వెళ్ళిపోండి”, అని చెప్పాడు.

దానికి రాము,

"మనము కరుబూజ తోట దగ్గరికే వెళ్ళి సుబ్బారెడ్డిని స్కూలుకు రమ్మని చెప్దాము పద". అని, అందరిని తోడుకొని తోట దగ్గరికి వెళ్ళాడు. అక్కడ, సుబ్బారెడ్డి మొక్కలకు నీరు పెడుతూ కనిపించాడు. వెంటనే పిల్లలు సుబ్బారెడ్డిని ఉద్దేశించి,

"ఒరేయ్ ! సుబ్బారెడ్డి ! నీవు మాతో పాటు స్కూలుకు రావాలి. శివారెడ్డి సారు అదే పనిగా మమ్ములను నీ కోసమే ఇక్కడికి పంపించారు"

అని చెప్పగా సుబ్బారెడ్డి,

"నేను ఇంక స్కూలుకు రాలేను రా! ఇంటి వద్ద చాలా పనులు ఉన్నాయి. మా నాన్న ఒక్కడే అన్ని చేసుకోలేకున్నాడు. అయినా నాకు చదువుకోవాలని లేదు, పొలం పనులే నాకిష్టం"

అని చెప్పాడు. అందుకు రాము,

"అదెట్లారా ! మనమంతా బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలి!! చదువుకొంటే తర్వాత జీవితంలో చాలా సుఖపడవచ్చు!!!"

అని చెప్పాడు. అప్పుడు సుబ్బారెడ్డి, ఇంక వీడితో ఇట్లా కాదని,

"సరే మీ నలుగురు ఈ కాయలు తీసుకొని తింటూ వెళ్ళండి. ఇవి చాలా తియ్యగా ఉంటాయి కూడా."

అని కరుబూజకాయలను ఎరగా చూపాడు. అందుకు రాము కోపగించుకొని,

"ఏమిట్రా ? నీకు మేము ఎట్లా కనిపిస్తున్నాము ? మాకు లంచం ఇస్తావా ? నీవు స్కూలుకు రాకపోతే అది నీ ఖర్మ. మొత్తం విషయమంతా శివారెడ్డి సారుకు చెప్తాము"

అని అన్నాడు. దానికి మిగిలిన పిల్లలు,

"ఒరేయ్ రాము ! వాడంతకు వాడు కాయలు ఇస్తానంటే మనం ఎందుకు కాదనాలి."

అని సుబ్బారెడ్డి ఇచ్చిన కాయలు రాము తప్ప మిగిలిన ముగ్గురు తీసుకొని వాటిని పగులగొట్టి తింటూ బయలుదేరారు. రాము మాత్రము ఆ కాయలు తనకు వద్దని నిష్కర్షగా చెప్పాడు.

తర్వాత రాము బృందం లంబాడ తాండాలలోని రాజానాయక్ అనే విద్యార్థి ఇంటికి వెళ్ళింది. బయట రాజానాయక్ తండ్రి కన్పించాడు. విద్యార్థులంతా రాజానాయక్ తండ్రితో,

"మీ రాజానాయక్ బాగా చదువుచున్నాడు. రెండు రోజుల నుంచి వాడు స్కూలుకు రావడం లేదు. శివారెడ్డి సార్ మీ పిల్లవాన్ని తప్పక మాతో స్కూలుకు పిలుచుకొని రమ్మని మమ్మల్ని పంపించాడు. కనుక మీరు వెంటనే రాజానాయక్‌ను మా వెంట స్కూలుకు పంపండి", అని చెప్పారు.

అప్పుడు రాజానాయక్ తండ్రి,

"అయ్యా రాము ! మా రాజానాయక్‌ను స్కూలుకు పంపితే మీ ఇంట్లో యనుములు (బర్రెలు) కాసేదెవరు? వాటి పేడ ఎత్తివేసేది ఎవరు ? మాకెందుకు ఈ చదువులు. నేను మీ నాయన వద్ద చేసిన అప్పు తీర్చేవరకు వీన్ని మీ ఇంట్లో జీతానికి పెట్టకపోతే మీ నాయన నన్ను బ్రతకనిస్తాడా? ఎందుకొచ్చిన గొడవ, మీరు ఇంక వెళ్ళిపోండి."

అని చెప్పాడు. ఈ మాటలకు రాము మోము చిన్నబోయింది. నోట మాటరాలేదు. మిగతా పిల్లలు కూడా ఏమి మాట్లాడలేక పోయినారు.

తర్వాత వీరంతా ప్రక్కనే ఉన్న దళితవాడలోనికి పోయారు. అక్కడ క్రొత్తగా స్కూల్లో చేరిన విద్యార్థులు స్కూలుకు సరిగ్గానే వస్తున్నారు. ముగ్గురు, నలుగురు పిల్లలు అప్పుడప్పుడు స్కూలు ఎగొట్టేవారు ఉన్నారు. వారిని స్కూలుకు ప్రతిదినం పంపమని వారి తల్లిదండ్రులకు చెప్పి, స్కూలు ఎగ్గొట్టి ఇంటి వద్ద ఆడుకుంటున్న ఇద్దరు పిల్లలను తమతోపాటు స్కూలుకు తీసుకుకెళ్లారు. ఈ పిల్లలు స్కూలుకు వెళ్ళేసరికి మధ్యాహ్నపు స్కూలు ప్రారంభం అయ్యింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో వ్రాయవలసిన ఎక్కములు వీరు వ్రాయలేక పోయారు. మామూలుగా అట్లా వ్రాయలేని వారంతా, స్కూలు ప్రారంభమయిన తర్వాత బెంచిపై ఎక్కి ఎక్కములు వ్రాయవలసి ఉంటుంది. కనుక, రాము బెంచిపై ఎక్కి ఎక్కములు వ్రాస్తున్నాడు. రాము బృందంలోని మిగిలిన ముగ్గురు విద్యార్థులు మాత్రము తాము స్కూలు పని మీదనే బయటకు వెళ్ళవలసి వచ్చింది. కనుక, బెంచిపై ఎక్కి ఎక్కములు వ్రాయవలసిన అవసరమే లేదని, అసలు వ్రాయవలసిన పనేలేదని,

వారికి వారే నిర్ణయించుకొని, మిగిలిన అందరితోపాటు కూర్చున్నారు. ఊరిలోని పెద్దలెవరో స్కూలుకు వచ్చి వుంటే టీచర్లు ఇద్దరూ వారితో మాట్లాడుతూ ఉన్నారు. పిల్లలంతా గోలగోలగా అరుస్తూ ఉన్నారు. బాగా అలసిపోయిన రాము, తదేక దీక్షతో ఎక్కములు వ్రాసేది పూర్తి చేశాడు. అప్పుడు రాము మనసులో కొంత ప్రశాంతత, మరి కొంత ఆందోళన మిళితమై ఉన్నాయి.

గంగిరెడ్డికి ఒక గుర్రము వుండేది. అప్పుడప్పుడు, అతను ఆ గుర్రము మీద స్వారీ చేస్తూ తన పొలాల దగ్గరకు, చుట్టుప్రక్కల వున్న పల్లెలకు వెళ్లేవాడు. ఒక రోజు గంగిరెడ్డి రామును గుర్రముపై తనతో కూడా పొలాల వద్దకు తీసుకెళ్లాడు. రాముకు గుర్రముపై స్వారీ చేయడము చాలా ఆనందంగా వుంది. అప్పుడు గంగిరెడ్డి ఒక ఎత్తైన ప్రదేశములో గుర్రాన్ని నిలిపి,

"చిన్నా! యిక్కడ నుండి ఆ కనిపించే చేలన్ని మనవే, అన్నీ కలిపి దాదాపుగా 100 ఎకరాలు వుంటుంది. ఇవి కాక యింకా ఒక నూరు ఎకరాలు వేరే–వేరే చోట్ల వుంది. అంతాకలిపి మనకు దాదాపుగా 200 ఎకరాల పొలము ఉంది."

అని గర్వంగా చెప్పాడు.

రాముకు 100 ఎకరాలు అంటే ఎంతో, ఏమీ అర్థము కాకున్నా, ఆ కనిపించే పొలమంతా తమదే అని అర్థమయింది. అయితే రాముకు ఏపుగా పెరిగి వెన్ను తీసిన జొన్న, ప్రక్కనే పచ్చగా కళకళలాడుతున్న వేరుశనగా చాలా అందంగా కనిపించినాయి. పొలంప్రక్కనే ఒక చిన్న రైల్వేస్టేషన్ వుంది.

పొలాల్లో అక్కడక్కడ కొంతమంది పనిచేసుకుంటూవున్నారు. గంగిరెడ్డి ఆ ప్రదేశములో ఎక్కడికెళ్లినా, వారంతా పనిచేయడము మానుకొని

"ఏమబ్బా! కొడుక్కు ఇప్పటినుంచే పని పాటలు నేర్పిస్తున్నావా? రాము చాలా సుకుమారమైన వాడు, ఎండలో ఎక్కువ సేపు తిప్పవద్దు"

అని అంటుంటే, రాముకు, వారు రోజంతా ఇలా చేలల్లో, ఎలా పని చేస్తారా? అని ఆశ్చర్యపోయాడు.

తర్వాత గంగిరెడ్డి రామును పిలుచుకొని రైల్వేస్టేషన్‌కు వెళ్లి, గుర్రాన్ని ఒక చెట్టుకు కట్టి, స్టేషన్‌లో, స్టేషన్ మాస్టర్ రూములోనికి పోయాడు. గంగిరెడ్డిని చూడగానే స్టేషన్ మాష్టర్ లేచి నిలబడి

"రండి గంగిరెడ్డి గారు! రండి! ఈ బాబు మీ అబ్బాయా? రండి కూర్చోండి!"

అని కుర్చీ చూపించాడు. అతను తమిళుడు, అక్కడ స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగము చేస్తూవున్నాడు.

స్టేషన్ మాస్టర్, గంగిరెడ్డితో కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడి, ఆ తర్వాత వీరిద్దరిని ప్రక్కనే వున్న తన క్వార్టర్స్‌కు పిలుచుకువెళ్లాడు. వారిల్లు చిన్నదైనా చాలా శుభ్రంగా, పొందికగా వుంది. తమ యిల్లు చాలా పెద్దదైనా చాలామంది పనిచేసేవారున్నా, ఇంట్లోనే పశువులను ఉంచేదానివల్ల పేడవాసన కొడుతూ, యింటి నిండా ఈగలు ఎగురుతూ, చాలా అపరిశుభ్రంగా ఉంటుంది. అని అనుకొన్నాడు రాము.

ఇంతలోనే స్టేషన్ మాస్టర్ భార్య లోపలి నుండి హాలులోనికి వచ్చి గంగిరెడ్డికి నమస్కారము చేసి, ఏదో తమిళములో మాట్లాడేస్తూవుంది. ఆమెకింకా సంతానము కలిగినట్టులేదు. దంపతులిద్దరూ వయసులో వున్నవారే. ఆ తర్వాత స్టేషన్ మాస్టర్,

"నా భార్య ఈరోజు వేడి వేడి, ఇడ్లీలు సాంబారు చేసింది. మీరు టిఫిన్ చేసి వెళ్లండి రెడ్డిగారు"

అని చెప్పి, స్టేషన్‌లో పని ఉండేదానివల్ల అతను స్టేషన్‌కు వెళ్లిపోయాడు. వాళ్లింట్లో కడప పాలిష్ బండలతో చేసిన డైనింగ్ టేబుల్ వుంది, దానికి నాలుగు వైపులా నాలుగు కుర్చీలు వేసివున్నాయి. ఆమె, వీరిద్దరిని డైనింగ్ టేబిల్ వద్ద కూర్చోమని, రెండు ప్లేట్లలో నాలుగు, నాలుగు ఇడ్లీలు పెట్టి, సాంబారు ఒక గిన్నెలో పోసి టేబుల్ మీద పెట్టి యింక టిఫిన్ తినమని చెప్పింది. ఆమె, తమిళములోనే మాట్లాడుతూ ఉంది. అక్కడక్కడ తెలుగు పదాలు కూడా పలుకుతూ ఉంది.

గంగిరెడ్డి “నా కొడుకు నాలుగు ఇడ్లీలు తినలేడు” అని చెప్పి, రాము ప్లేటులోని రెండు ఇడ్లీలు తన ప్లేటులో వేసుకొని, రెండు ప్లేట్లలో గరిటెతో సాంబారు పోసి, స్పూనుతో తినమని తనొక స్పూను తీసుకొని, రాముకు ఒక స్పూను యిచ్చాడు, రాము అంతకు మునుపెప్పుడూ ఇడ్లీలు చూసియుండలేదు. స్పూనుతో కూడా తినే అలవాటు లేదు. గంగిరెడ్డి తన కుమారునికి ఎలా తినాలో నేర్పిస్తున్నాడు. ఆ తర్వాత, ఆమె,

“రెడ్డిగారూ! మాకు కొన్ని వేరుశనగకాయలు ఇస్తారా?”

అని తమిళములోనే గంగిరెడ్డికి అర్థమయ్యేటట్లు అడిగింది.

వీరి ఆతిథ్యానికి సంతోషించిన గంగిరెడ్డి,

“నేనిప్పుడే మామనుషులతో ఒక అర్ధమూటె వేరుశనగకాయలు పీకించి పంపిస్తాను”

అని చెప్పి అక్కడ నుండి బయలుదేరాడు.

మళ్లీ పొలములోనికి వచ్చి అక్కడ పనిచేస్తూవున్న సుబ్బన్నతో,

“సుబ్బన్నా, ఒక అర్ధమూటె శనక్కాయలు పీకి స్టేషన్ మాస్టర్ ఇంట్లో యిచ్చిరా!”

అని చెప్పి, తన గుఱ్ఱాన్ని రైల్వేట్రాక్ ప్రక్కనే ఉన్న దారిలోనికి తిప్పి, దాన్ని అదిలించాడు. అప్పుడే ఎదురుగా ఒక గూడ్సు రైలు వేగంగా వస్తూ వుంది. రైలు దగ్గరగా రాగానే, దాని డ్రైవర్ గట్టిగా హారన్ వాయించాడు. గుఱ్ఱము ఒక్క సారిగా ప్రక్కకు గెంతి, చేలల్లో అడ్డము పరిగెత్త సాగింది. గంగిరెడ్డికి గుఱ్ఱపు స్వారీ బాగా వచ్చు కనుక, చాకచక్యంగా దాన్ని అదుపు చేసి, రాముతో “వాడు (రైలు డ్రైవర్) కావాలనే గుఱ్ఱాన్ని బెదిరించేదానికి హారన్ కొట్టినాడు” అని డ్రైవరును నిందించాడు.

రాము తన చిన్ననాటి నుండి గుఱ్ఱాలమీద మోజు పెంచుకున్నాడు. కాని తన తండ్రి స్వారీ చేసే గుఱ్ఱము చాలా చిన్నది. రాముకు మంచి మేలుజాతి గుఱ్ఱముపై స్వారీ చేయాలని వుండేది. చాలా సార్లు తన తండ్రిని, తన కొరకు ఒక మంచి మేలుజాతి గుఱ్ఱాన్ని కొనమని అడిగేవాడు. కాని గంగిరెడ్డి ఎప్పుడూ ఆ ఆలోచనే చేయలేదు.

నిన్న మొన్నటి వరకు వేమయ్య స్వామి అనే స్వాములు, మంచి మేలుజాతి గుర్రాల మీద ఆంధ్రప్రదేశ్‌లోని చాలా ప్రాంతాలలో పర్యటించేవారు. ఒక రోజు వేమయ్య ఒక అద్భుతమైన గుర్రము మీద కొత్తపల్లెకు వచ్చాడు. వేమయ్య ముప్పై, ముప్పై అయిదు సం॥ వాడు పసుపుపచ్చని వస్త్రాలతో నెత్తిన పసుపు పంచతో తలపాగాచుట్టి, ముందు కొందరు అనుచరులు తప్పెట్లు కొడుతూ ఉంటే, వచ్చి ఊరి మధ్యలో వున్న సత్రములో దిగాడు. సత్రము బయట వున్న పెద్ద వేపచెట్టు నీడలో గుర్రాన్ని కట్టి వేసినారు. గుర్రము దాదాపు అయిదున్నర్ర అడుగులపైనే ఎత్తు వుంది. చూసేదానికి చాలా అందంగా, గంభీరంగా వుంది. గుర్రము ఎరుపు, తెలుపు రంగుల పాచస్‌లో, ముఖంపై తెల్లని నామంతో, నాలుగు కాల్లు, మోకాల్ల పై భాగము వరకు తెల్లగా, తెలుపు ఎరుపు కలగలిపిన తోకతో అద్భుతంగా వుందీ గుర్రము.

ఊరిలోని పిల్లలేకాక పెద్దలు కూడా గుర్రము చుట్టూ గుమికూడి, దాని అందాన్ని ఆస్వాదిస్తూవున్నారు. రామూ దాన్ని వదలి రాలేక పోతున్నాడు, ఉదయము నుండి గుర్రము దగ్గరే, తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. దాన్ని ఎలాగైనా సొంతము చేసుకోవాలనే ఆలోచన వచ్చింది. ఈ లోపల ఇంటివద్ద నుండి ఒక మనిషి వచ్చి రామును యింటికి పిలుచుకొని పోయాడు. రాము తన తండ్రితో తటపటాయిస్తూనే, తాను చూసిన గుర్రాన్ని పొగిడి, దాన్ని ఎలాగైన తనకోసము కొనమని అడిగాడు. దానికి గంగిరెడ్డి,

“ఏరా రామూ! ఆ గుర్రము నీకు అంతబాగా నచ్చిందా?” అని వెంటనే తన కుమారున్ని పిలుచుకొని సత్రము వద్దకు బయలు దేరాడు.

గంగిరెడ్డి అక్కడకి పోగానే, అంతా గంగిరెడ్డి చుట్టూ చేరి,

“అబ్బా! మీరు ఇలాంటి గుర్రాన్ని ఎక్కి స్వారీ చేయాలి, అంతే కాని, ఇప్పుడు మీరు స్వారీ చేసే గుర్రము ఏమి బాగలేదు” అని అన్నారు.

దానికి గంగిరెడ్డి “మనకు పని జరగాలి కాని, ఇంత పెద్ద గుర్రము మనకెందుకు? దీన్ని సాకాలన్నా కష్టమే, ఇంకా దీనికి ప్రత్యేకంగా ఒక మనిషిని పెట్టాలి. ఇవి చూసేదానికేగాని మనము దీన్ని సాకి, దీని మీద స్వారీ చేయాలంటే మనకు కుదరదు.” అని అన్నాడు.

తర్వాత గంగిరెడ్డి కూడా గుర్రాన్ని మెచ్చుకొని, చాలా మంచి మేలుజాతి గుర్రము, చాలా అందంగా ఉంది, అని చెప్పి, వేమయ్య స్వామి దగ్గరకు వచ్చి, "స్వామీ! మీరు ఈ గుర్రాన్ని ఎక్కడ, ఎంతకు కొన్నారు?" అని అడిగాడు. అందుకు వేమయ్య,

"అయ్యా! నేను దీన్ని ఆరు నెలల క్రిందట బెంగుళూరులో పదివేల రూపాయలు యిచ్చికొన్నాను." అని చెప్పాడు.

ఆరోజుల్లో పదివేలు అంటే చాలా ఎక్కువ మొత్తమే. పదివేల రూపాయలకు దాదాపు పది ఎకరముల మంచి నల్ల రేగడి భూమి వస్తుంది. వేమయ్య ఊరు వదిలి వెళ్లేవరకు గుర్రము వెంటే ఉన్నాడు రాము. పెద్దయిన తర్వాత తప్పక ఇలాంటి గుర్రాన్ని సొంతము చేసుకోవాలనుకున్నాడు.

ఊరిలో ప్రాథమిక విద్య పూర్తయిన తర్వాత రామును కోడూరు హైస్కూలు నందు ఆరవ తరగతిలో చేర్పించారు. క్రొత్తపల్లె నుండి కోడూరుకు 8 కి.మీ., దూరం ఉంటుంది. రానూ, పోనూ మొత్తము 16 కి.మీ., ఉంటుంది. క్రొత్తపల్లె నుండి హైస్కూలుకు వెళ్ళే విద్యార్థులంతా కాలి నడకనే స్కూలుకు పోవాలి. రాముకు రోజూ 16 కి.మీ., నడిచిపోవాలంటే కష్టం అనిపించేది. రాము చదువులో చురుకుగా ఉండేవాడు. కానీ ఆటలలో కొంచెం కూడా పాల్గొనేవాడు కాదు. చిన్నప్పటి నుంచి చాలా బిడియస్తుడు, భయస్తుడు అయినందున అందరితో కలిసేవాడే కాదు. ఆడపిల్లలతో మాట్లాడాలంటే చాలా భయపడేవాడు (తన అక్క, చెల్లెల్లుతప్ప).

అయితే తనకు స్నేహితంగా ఉన్న తన ఈడు మగపిల్లలతో చాలా చనువుగా ఉండేవాడు. అప్పుడప్పుడు వారితో మెడ పట్లు కూడా పట్టేవాడు. చిన్న చిన్న గాయాలకు, నొప్పికి భయపడేవాడు కాదు. తన భయం అంతా మనుషులతో ఎదురుపడి మట్లాడాలంటేనే, ఇంకా ఇతర సాంఘీక కార్యక్రమాలలో పాల్గొనాలంటే చాలా సిగ్గు పడేవాడు. రాము చిన్ననాడు ఏర్పడిన ఆత్మన్యూనతా భావం నుండి బయట పడలేక పోయేవాడు. రాము పది సంవత్సరముల వయసులో వుండగా, తన తరగతిలోని ఒక అమ్మాయి పట్ల అమితంగా అకర్షితుడైనాడు. ఆమె చాలా అందమైనది మరియు మంచి సంస్కారము కలది. కానీ, రాము ఎప్పుడూ ఆ అమ్మాయితో మాట్లాడుటకు కూడా ప్రయత్నించలేదు. అంత ధైర్యము రాముకు లేదు. ఈ విషయము తాను పెరిగి

పెద్దవాడయ్యేంత వరకు తన మనసులో దాచుకున్నాడే కానీ, ఇతరులకెవ్వరికి చెప్పలేదు.

ఇది ఇలా వుండగా, గంగిరెడ్డి కష్టపడి పనిచేయడం ద్వారా మంచి పంటలు పండించి, తన పరపతి ఇంకా పెంచుకొని, ఆ ప్రాంతంలో అతి పెద్ద ధనవంతుడిగా అభివృద్ధి చెందాడు. కానీ ముక్కుకు సూటిగా పోయే మనస్తత్వం, వ్యవహారాల పట్టువిడుపులు పాటించకుండా కఠినంగా ఉండటం వలన, తన ఊరిలోనే కాక ప్రక్క గ్రామాలలో కూడా చాలా మందిని శత్రువులుగా తయారు చేసుకొన్నాడు. ఒకమారు గంగిరెడ్డి, ప్రక్క ఊరిలో ఉన్న ఇద్దరి వైరి వర్గాల నాయకులకు ఎక్కువ మొత్తంలో డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఇందులో బలమైన వర్గం నాయకుడైన వెంకటకృష్ణయ్యకు, తన వైరి వర్గం అయిన బ్రహ్మయ్యకు గంగిరెడ్డి అప్పు ఇవ్వడం రుచించలేదు. ఈ విషయమై వెంకటకృష్ణయ్య, గంగిరెడ్డికి తన అసంతృప్తిని తెలియబరిచాడు. గంగిరెడ్డి యథాలాపంగానే,

"నాకు అటువంటి పట్టింపులేమీ లేవు. తీర్చ గలిగే శక్తి వున్న వారికి ఎవరికైనా అప్పు ఇస్తాను. ఆ అప్పు రాబట్టుకొనే శక్తి నాకు ఉంది" అని, మామూలుగానే వెంకటకృష్ణయ్యకు తెలిపాడు.

నా అంత బలమైన నాయకుడు చెప్పిన తర్వాత కూడా గంగిరెడ్డి తన మాట వినలేదేమని వెంకటకృష్ణయ్య మండి పడ్డాడు. ఈ సంఘటనతో అతని అహం దెబ్బతింది. సరే! ఈ గంగిరెడ్డి నాతో అప్పు ఎలా రాబట్టుకుంటాడో చూస్తామని బహిరంగంగానే చెప్పడం మొదలుపెట్టాడు. ఈ విషయం తెలిసిన గంగిరెడ్డి ఆలోచనలో పడ్డాడు.

'నేను ముఠా నాయకున్ని కాదు. అలాగని ఇప్పుడు నేను వెంకటకృష్ణయ్యతో డబ్బు రాబట్టకపోతే అందరిలో చులకన అవుతాను. తర్వాత, బాకీ ఉన్నవారు ఒక్కక్కరే ఎదురు తిరుగుతారు,'

అని ఆలోచించి, తన భార్య రాజేశ్వరిదేవిని సంప్రదించి, వెంటనే వెంకటకృష్ణయ్య వైరి వర్గపు నాయకుడైన బ్రహ్మయ్యను పిలిపించి,

"నేను నీకు అప్పు ఇవ్వడం ద్వారా వెంకటకృష్ణయ్యతో శత్రుత్వం వచ్చేటట్లు ఉంది. అయినా నేను భయపడటం లేదు. మీ ఊరి వరకు నీవు నాకు సహాయం చేస్తే, నీవు నాకు

ఇవ్వవలసిన బాకీలో మొత్తం వడ్డీ మాఫీ చేస్తాను" అని చెప్పాడు.

దానికి బ్రహ్మయ్య, 'ఇదియే సరైన సమయమని, ఎన్నాళ్ళ నుంచో తనకంటే బలవంతుడైన వెంకటకృష్ణయ్యను గంగిరెడ్డి సహాయంతో ఎలాగైనా అణిచివేయాలని' ఆలోచించి,

"అన్నా ! గంగిరెడ్డి ! నీ కోసం నా ప్రాణమైనా ఇస్తాను. నేనూ, నీవూ కలిస్తే ఆ వెంకట కృష్ణయ్య మనకు ఒక లెక్కకాదు",

అని తన పూర్తి సహకారం తెలిపాడు.

వెంటనే గంగిరెడ్డి తనకివ్వవలసిన బాకీ మొత్తం వెంటనే చెల్లించమని, అట్లు చేయని యెడల, తాను వ్రాసి ఇచ్చిన ప్రామిసరీ నోటు కోర్టులో దాఖలుచేస్తానని, మనిషి ద్వారా ఉత్తరం వ్రాసి పంపినాడు. దానికి వెంకటకృష్ణయ్య,

"నేను గంగిరెడ్డికి ఒక్క పైసా కూడా చెల్లు ఇవ్వను. అతనికి చేతనైన పని చేసుకొమ్మను."

అని, నోటి మాటగా ఉత్తరం తెచ్చిన మనిషితో చెప్పి పంపించాడు. గంగిరెడ్డి ఈ జవాబు ముందుగానే ఊహించినందువల్ల, వెంటనే తర్వాతి కార్యక్రమానికి పూనుకున్నాడు. గంగిరెడ్డి వెంటనే పేటకు వెళ్ళి తన వకీలుతో,

'తనకు ఇవ్వవలసిన బాకీ, వడ్డీ, మొదలు వెంటనే చెల్లించమని, అట్లు చేయని ఎడల కోర్టులో దాఖలు చేస్తానని' వెంకటకృష్ణయ్యకు లీగల్ నోటీసు పంపాడు.

దానికి వెంకట కృష్ణయ్య ఏమాత్రం వెరువక,

"ఇళ్ళు అలకగానే పండగ అవుతుందా ?"

అని నోటీసును ఏమాత్రం పట్టించుకోలేదు. తర్వాత గంగిరెడ్డి కోర్టులో తన బాకీ, వడ్డీ, మొదలు తీర్చమని వాజ్యం వేశాడు. కానీ వెంకటక్రిష్ణయ్య ఏమాత్రం దిగులు చెందక కోర్టుకు అసలే హాజరు కాలేదు. దీనితో కోర్టు వెంకటక్రిష్ణయ్య పై బాకీ మొత్తం వడ్డీ, మొదలు ఖర్చులతో కలిపి డిక్రీ ఇచ్చింది.

వెంకటకృష్ణయ్య ఎప్పటికప్పుడు అన్ని విషయాలు తెలుసుకుంటూ వున్నాడు. డిక్రీ అయితేనేమి? ఈ ఊరిలో ఎవరు తనకు ఎదురు నిలబడగలరు? అని ధీమాగా ఉన్నాడు.

గంగిరెడ్డి తన ఊరి పొలిమేరకు దగ్గరగా వున్న వెంకటకృష్ణయ్యకు చెందిన 10 ఎకరాల రేగడి భూమిని తనకు రావలసిన బాకీ మొత్తానికి జప్తుకు పెట్టాడు. కోర్టు వారు వేలంపాట నిర్వహించారు. గంగిరెడ్డికి, బ్రహ్మయ్యకు మధ్య కుదిరిన ఒప్పందం విషయం తెలియని వెంకటకృష్ణయ్య వేలం పాటలో తన భూమి కొనేటందుకు ఎవరూ ముందుకు రారని చాలా నమ్మకంగా ఉన్నాడు. కానీ, అందుకు భిన్నంగా, వేలం పాటలో బ్రహ్మయ్య ఆ 10 ఎకరాల భూమిని గంగిరెడ్డికి బినామిగా వేలంలో కొన్నాడు. ఆ భూమిని వెంటనే బ్రహ్మయ్యకు కోర్టు వారు స్వాధీన పరిచారు. విషయం తెలిసిన వెంకటకృష్ణయ్య ఆశ్చర్యంతో పాటు విపరీతమైన కోపంతో ఊగిపోయాడు. ఎప్పుడూ తనకు ఎదురొడ్డి నిలవలేని బ్రహ్మయ్య, ఇప్పుడు ఈవిధంగా ఎదురు తిరగటాన్ని చూసి, అసలు ఏమి జరిగిందో తెలుసుకొని నిరుత్తరుడైనాడు.

ఆ సం॥ వర్షాలు బాగా పడ్డాయి. భూమి బాగా పదునైంది. గంగిరెడ్డి, బ్రహ్మయ్య ఇరువురు కలిసి ఆ 10 ఎకరాల పొలంలో వేరుశెనగ విత్తినారు. వెంకటకృష్ణయ్య అప్పటికేమో ఊరకనే ఉన్నాడు. వేరుశెనగ బాగా మొలచి ఒక నెల పైరు అయ్యింది. అప్పుడు వెంకటకృష్ణయ్య వున్నట్లుండి ఆ పది ఎకరాల వేరుశెనగను ఒక్క రోజులోనే చెడగొట్టి జొన్న విత్తాడు. గంగిరెడ్డి కూడా ఈ పరిణామం ఊహించి వున్నాడు. కనుక, అప్పటికి ఊరికే వున్నాడు. జొన్న పైరు బాగా మొలిచింది. అదునుకు వర్షాలు పడటంతో జొన్న పైరు ఇంకా బాగా పెరిగి వెన్ను తీసింది. మరికొన్ని రోజుల్లోనే పెద్ద పెద్ద జొన్న కంకులు తయారయ్యాయి. గంగిరెడ్డి జొన్న కంకులు బాగా గట్టిపడి గింజలు అయ్యేవరకు వేచి ఉండి, వెంటనే బ్రహ్మయ్యను పిలిపించి వేగంగా పావులు కదిపాడు.

తన వల్ల మేలు పొందిన మిత్రులందరిని, అలాగే తనకు బాకీ వున్న వారిని సమావేశపరచి వారి సహకారం అర్థించి, వారందరిని కూడగట్టాడు. తన ఊరిలో తనతో శత్రుత్వము లేని వారందరిని పిలిపించుకొని సమాలోచన చేశాడు. వారిలో ముఖ్యులైన వెంకటరెడ్డి, కుల్లాయప్ప, రోశిరెడ్డి, దస్తగిరి, అంకన్న, అంకిరెడ్డి, రాంపండు, సుగాలి ముఖ్యా నాయక్, పెద్దోడు, నడిపోడు, నర్సయ్య, వీరయ్య, ఏసయ్య మొ॥ వారందరిని సమావేశపరచి, వారందరికి తను అన్ని విధాల సహాయం చేస్తానని వాగ్దానం చేసి, వారి స్నేహాన్ని, సహకారాన్ని కోరి, వారితో వాగ్దానం

తీసుకున్నాడు.

చుట్టుప్రక్కల వున్న చింతకుంట, బొందలకుంట, బూచుపల్లి, ఓబులపల్లి, చిన్నపల్లి మొ॥ ఊర్లలో వున్న మిత్రులందరితో అవసరం అయినప్పుడు వారి సహాయం కావాలని కోరి, అందుకు వారి సమ్మతి తీసుకున్నాడు. రాము తన ఇంట్లో జరుగుచున్న ఈ సంఘటనల గూర్చి చాలా ఆందోళనగా ఉన్నాడు. రాము తప్ప మిగిలిన కుటుంబ సభ్యులంతా ఉత్సాహంగా తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. రాము మాత్రం తండ్రి అంటేనే జడుసుకుంటున్నాడు. ముఖ్యంగా ఈ మధ్య గంగిరెడ్డి చాలా గంభీరంగా కనిపిస్తున్నాడు, మాట కూడా చాలా కఠినంగా వినిపిస్తూ ఉంది.

ఒకరోజు, రాము స్కూలులో డ్రిల్ మాస్టర్ పిల్లలందరితో జావలిన్‌ని విసిరి వేయించి ఆ దూరాన్ని నమోదు చేసుకుంటున్నాడు. రాము వంతు రాగానే డ్రిల్ మాస్టర్,

“ఏరా! రామూ! మీ నాన్న ఒక పెద్ద హీరో అయిపోయినాడే!! పెద్ద పార్టీయే పెట్టుకున్నాడు.!!! మరి నువ్వు జావలిన్‌ని ఎంత దూరం విసురుతావో చూస్తాం!!!” అని, రాముకు జావలిన్ యిచ్చాడు, రాముకు జావలిని పట్టుకొనేదే రాదు. కానీ ఎలాగో దానిని విసిరాడు. అలా మూడుసార్లు విసిరాడు. ఒక్కసారి కూడా దాన్ని కనీస దూరం కూడా విసరలేక పోయాడు. డ్రిల్ మాస్టర్ బిగ్గరగా నవ్వి,

“ఇలాగైతే ఎలారా రాము? మీ నాన్నకు ఈ విషయం తెలిస్తే బాధపడతాడు కదా !” అని అన్నాడు.

ఆ మాటకు పిల్లలంతా గొల్లున నవ్వారు. రాముకు తన మొహం ఎక్కడ దాచుకోవాలో తెలియలేదు.

ఊరిలో మరియు తన కుటుంబంలో జరుగుచున్న పరిణామాలను రాము నిశితంగానే గమనిస్తున్నాడు. ఈ మధ్య చాలా మంది ఇంటికి రావడం, రాత్రి పొద్దుపొయేవరకు చర్చించుకోవడం, జరుగుతూ ఉంది. అప్పుడు వారు ఆయుధాలను సేకరించడం గురించి మరియు మనుషులను కూడగట్టడం గూర్చి మాట్లాడుకొనేవారు. సాధారణంగా ఎవ్వరూ త్రాగి తమ

ఇంటిలోనికి ప్రవేశించడానికి సాహసించేవారు కాదు. అటువంటిది ఇప్పుడు కొందరు త్రాగి కూడా ఇంట్లోకి వచ్చి, అందరితో కూడా కలిసి మాట్లాడేవారు. వీరిలో కొందరు గంగిరెడ్డిని సారా కొరకు చిల్లర డబ్బులు అడిగి ఇప్పించుకొనేవారు. ఊరిలోని వారంతా, గంగిరెడ్డి కుటుంబంలో జరిగే పరిణామాలన్నీ ఆసక్తిగా గమనిస్తూ వున్నారు. వీరిలో గంగిరెడ్డితో శత్రుత్వం వుండేవారు అతనికి కీడు జరగాలని కోరుకునేవారు, మధ్యస్తులు మాత్రం, గంగిరెడ్డి ఎలాగైనా ప్రక్క ఊరి వెంకటకృష్ణయ్యకు బుద్ధి చెప్పాలని కోరుకొనేవారు. గంగిరెడ్డి మాత్రం ఈ పరిణామాల వల్ల గంభీరంగా కనిపిస్తూ వున్నాడే కానీ, ఎలాంటి భయం లేకుండా నిబ్బరంగా ఉంటున్నాడు. కానీ, వ్యవహారాలలో కొంచెం కఠినంగా, దురుసుగా తయారయ్యాడు.

ఒకరోజు రాత్రి గంగిరెడ్డి అందరితో మాట్లాడుతూ వుండగా తనకు ముఖ్య అనుచరుడైన రామిరెడ్డితో ఏదో పని పడింది. అప్పుడు అక్కడ చాలా మంది గంగిరెడ్డి మనుషులు వున్నా, తన ప్రక్కనే నేలచూపులు చూస్తున్న రాముతో,

"నీవు వెంటనే పోయి రామిరెడ్డి అన్నను పిలుచుకొని రా!" అని చెప్పాడు. రాముకు చీకటి అంటే భయం లేకున్ననూ, ఇతరుల ఇళ్ళకు పోవుటకు మొహమాటపడి, తన తండ్రి చెప్పిన మాట వెంటనే వినకుండా తలపటాయిస్తూ ఉన్నాడు. గంగిరెడ్డికి తన కొడుకు మీద అమితమైన ప్రేమ వున్ననూ, వాడు ఎందుకూ కొర కాకుండా పోతున్నాడని తలచి, తన కోపాన్ని నిగ్రహించుకోలేక రాము చెంప చెళ్లు మనిపించి,

"పులి కడుపున మేక పిల్లలా, నా కడుపున నీవు ఎలా పుట్టావురా ?" అని అరిచాడు.

వెంటనే ప్రక్కనున్న వారంతా గంగిరెడ్డిని శాంతపరిచి,

"రాము చిన్న పిల్లవాడు, మెత్తనివాడు, వాని మీద ఇలా కోపగించుకోవడం భావ్యం కాదు." అని చెప్పారు.

గంగిరెడ్డి, తాను చేసిన పనికి కొంచెం బాధపడి, ఎలాగైన తన కుమారున్ని తనంతటి వానిగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకొన్నాడు. అప్పుడు రాము మనస్థితి ఎలాగుందంటే, గట్టిగా ఏడిస్తే మరలా కొడతాడేమోనని ఎక్కిల్లు పెడుతూ, కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటూ, ఆ క్షణమే

అక్కడ నుండి ఎందుకు అంతర్ధానం కాలేదా! అని బాధపడ్డాడు.

రాము ఈ కక్షలు, కార్పణ్యాలు లేని శాంతి సీమలోకి మాయం అయిపోవాలని ఆకాంక్షించాడు. రాముకు ముఠా తగాదాలు వున్న ఇలాంటి పల్లెలంటే రోత పుట్టింది. వాటిపట్ల తీవ్రమైన విముఖత కలిగింది. అప్పటి నుండి తన ఊరు కొత్తపల్లెలో వుండుటకు ఎప్పుడూ ఇష్టపడలేదు.

ఆ రోజు రాత్రి నిండు పున్నమి. రాత్రి అవగానే గంగిరెడ్డి వర్గీయులు దాదాపు 200 మంది అతని ఇంటివద్ద గుమికూడారు. ముందుగా తయారు చేయించిన 200 కొడవళ్ళు అందరికి పంచినారు. 20 ఎడ్లబండ్లు పెద్ద, పెద్ద జొల్లలతో సిద్ధం చేశారు. దాదాపు 150 ఈటెలు ఇంకా 50 వేటకొడవళ్ళు, ఇవన్నీకాక 2 డబుల్ బ్యారల్ తుపాకులు, వాటి మందు గుండు సిద్ధం చేశారు. గంగిరెడ్డి మామూలుగా తను పట్టుకునే చేతి కత్తినే కాకుండా, ఒక 380 కాలిబర్ పిస్టల్ నిండుగా బుల్లెట్స్‌తో లోడు చేసి బొడ్లో దోపుకున్నాడు. అతని భార్య రాజేశ్వరిదేవి ఎంతో మార్ధవం, సౌకుమార్యం కలిగినదైనా, ఇప్పుడు కఠినాతికఠినంగా దృఢచిత్తంతో తన భర్తను అన్ని విషయాలలోను సమర్థిస్తూ అవసరం అయినపుడు సూచనలు ఇస్తూ తన ధర్మాన్ని నిర్వర్తించింది.

వీరంతా ఆయుధాలు, సరుకు, సరంజామ అంతా తీసుకొని ఇంటి వెనక వైపు కల్లంలోనికి ప్రవేశించారు. ఇంతలో రెండు పెద్ద డబ్బాలు తెచ్చి దించి, వెంటనే వాటిపై సీలు తొలగించినారు. గంగిరెడ్డి ఆ డబ్బాలో తన చూపుడు వేలు పెట్టి, బయటకు తీసి, ప్రక్కనున్న దీపంలో ఆ వేలు పెట్టాడు. వెంటనే వేలు అంతా బగ్గున మండింది. “నడిపోడు మంచి సరుకే పంపినాడు. ఇంక మీరంతా కానీయండి,” అని గంగిరెడ్డి సంజ్ఞ ఇవ్వగానే, తాగే వారంతా ముందుకు వచ్చి కావలసినంత సారా తాగుతున్నారు. ఈ లోపల రామిరెడ్డి యింట్లో కోసి, వండిన, రెండు పొట్టేళ్ల మాంసం అంతా అండాలలో తెచ్చి దించి, మంచి విందుకు ఏర్పాట్లు చేసినారు. ఇంతలో అంకన్న, దస్తగిరి, రోశిరెడ్డి తమ మనుషులు ఎక్కువగా తాగుచున్నారేమో అని,

“ఇంక తాగేది చాలించండి. పని అయినాక ఎంతైనా తాగండి, అంతేకానీ ఇప్పుడే అంతా తాగి ఇక్కడే పడిపోవద్దు.”

అని అందరిని హెచ్చరించి, తొందరగా భోజనాలు కానీయమని చెప్పి, అందరిని హుషారుగా ఉండమని చెప్తున్నారు. మొత్తం గుంపు అంతా రాత్రి 8 గం॥లకు 20 ఎడ్లబండ్లలో గంపలతో, కొడవళ్ళతో, ఈటెలతో మందుగుండు సామాగ్రితో బయలుదేరి దండుకు వెళుతున్నట్లు వెళ్ళారు. తకరారులో వున్న పొలం అక్కడికి కేవలం 3 కి.మీ., మాత్రమే. వీరంతా అక్కడికి కేవలం 45 ని.లలో చేరుకున్నారు. వెంటనే అంతా జట్లుగా విడిపోయి బాగా పండిన జొన్న కంకులను వెన్నెల వెలుతుర్లో కొడవళ్ళతో కోసి, మెడకు కట్టుకొన్న జోలెల్లో వేసుకుంటున్నారు. రెండు గంటలు గడిచాయి.

ఎటువంటి అవాంతరం ఎదురుకాలేదు. పని కూడా చాలా వరకు అయిపోయింది. తెల్లవారుజామున 2 గం॥కు మొత్తం పొలంలోని పంట అంతా ఎడ్లబండ్ల జొల్లల్లోకి చేరిపోయింది. అప్పుడు ఉన్నట్లుండి ఒక్కసారిగా గుంపుగుంపంతా గంగిరెడ్డి జిందాబాద్! గంగిరెడ్డికి జై!! అని అరిచారు.

సరిగ్గా అప్పుడే ఒక హెడ్ కానిస్టేబుల్ నలుగురు పోలీస్ కానిస్టేబుల్స్, 303 రైఫిల్స్ పట్టుకొని పొలంలోకి వచ్చి హూంకరిస్తూ, "గంగిరెడ్డి ఎవరు? ఏమిటి ఈ దౌర్జన్యం ? గంగిరెడ్డి ఎవరో వెంటనే మా ముందుకు రావాలి," అని అరిచారు. అందుకు వెంటనే గంగిరెడ్డి ముందుకు వచ్చి "నేనే గంగిరెడ్డిని. మీకు ఏమి కావాలి? మీరు ఎందుకొచ్చారు?" అని గట్టిగానే అడిగాడు. అప్పుడు పోలీసు వారు, "ఏమయ్యా గంగిరెడ్డీ! ఏమిటి ఈ దౌర్జన్యం? ఇన్స్పెక్టర్ గారు నిన్ను అరెస్ట్ చేసి తీసుకురమ్మని పంపించారు." అని భింకంగానే మాట్లాడినారు. అందుకు గంగిరెడ్డి,

"మీ దగ్గర అరెస్ట్ వారెంట్ ఉందా? అయినా నేనేమి తప్పు చేయలేదే! మా భూమిలో పండిన పంటను కోసుకుపోతున్నాము."

అని సమర్థించుకున్నాడు. అందుకు కానిస్టేబుల్స్,

"అదేమిటో మాకు తెలియదు, మీరు తన భూమిలో దౌర్జన్యంగా దిగారని వెంకటకృష్ణయ్య ఈ రోజు రాత్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు",

అని చెప్పారు. అందుకు బ్రహ్మయ్య,

"నేను కోర్టులో ఈ భూమిని స్వాధీన పరచుకొన్నాను. వాటికి సంబంధించిన కాగితాలు ఇవిగో. అయినా మేమే మొదట వెంకటకృష్ణయ్య నుంచి ప్రమాదం ఉందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గారి దగ్గర ఫిర్యాదు చేసియున్నాము"

అని అనగానే, కానిస్టేబుల్స్ బాగా తగ్గి,

"అది నిజమే మీరు ప్రస్తుతం మారణాయుధాలు కల్గివున్నారు, మరియు నాటుసారా కూడా మీ వద్ద వున్నట్లుంది, ఎందుకు వచ్చిన గొడవ, మమ్మలను గమనించుకొని పోండి"

అనిఅనగానే, గంగిరెడ్డి ప్రక్కన వున్న బ్రహ్మయ్య,

"మీరు ఐదుగురు వున్నారు. మీకందరికి కలిపి ఒక వెయ్యి రూపాయలు ఇస్తాము, మా పనికి అడ్డం రాకండి."

అని చెప్పగానే

"సరే, మీ యారముట్లు (తుపాకులు మొ॥నవి) దాచిపెట్టండి. సారా కూడా ప్రక్కకు తీసుకెళ్ళండి. మీ బండ్లను వెంటనే తోలుకెళ్ళండి. గంగిరెడ్డి గారు, మీరూ, బ్రహ్మయ్య కలిసి స్టేషన్‌కు వచ్చి మా ఇన్స్‌పెక్టర్‌తో మాట్లాడుకొండి",

అని అన్నారు. దానికి గంగిరెడ్డి 'సరే' అని తమ ఎమ్మెల్యే నారాయణరెడ్డిని పిలుచుకొని స్టేషన్‌కు పోయి, ఇన్స్‌పెక్టర్‌కు సంజాయిషి వ్రాసి ఇచ్చి, వెంటనే ఇంటికి తిరిగివచ్చాడు.

గంగిరెడ్డి తమ గుంపుతో కలిసి దండుగా బయలుదేరగానే, ఊరిలోని వారంతా ఏమి జరుగుతుందో అని తెల్లవార్లు ఆత్రుతగా ఎదురుచూస్తూ వున్నారు. రాము మాత్రం తెల్లవారి ఏమి వినవలసి వస్తుందో అని దిగులుగా, ఆందోళనగా ఆలోచిస్తూ, తను ఏ కక్షలు, కార్పణ్యాలు లేని మరో ప్రపంచంలోకి మాయం అయిపోవాలని తలపోశాడు. ఎక్కడైతే శాంతి, ప్రేమ, రక్షణ వుంటాయో, అక్కడ ప్రత్యక్ష్యం కావాలని కోరుకుంటూ, నిద్రలోకి జారుకున్నాడు. వేకువజామున 5 గం॥కు దండుగా పోయిన గుంపు అంతా వెనక్కి మరలి ఊరు చేరుకోగానే 200 మంది ఒక్కసారిగా గంగిరెడ్డి జిందాబాద్! గంగిరెడ్డికి జై!! అని జై కొడుతూ, బండ్లలో వున్న జొన్న కంకులు అంతా కల్లం లోనికి తోలినారు. దీనితో ఊరిలోని వారే కాక చుట్టుప్రక్కల గ్రామాల

వారు కూడా గంగిరెడ్డి సమయస్ఫూర్తిని, ధైర్యాన్ని కొనియాడకుండా వుండలేక పోయారు.

ఒక్క చుక్క రక్తం కూడా చిందకుండా ఒక బలమైన శత్రువును గెలవడం ఈ ప్రాంతంలో మాటలు కాదు. దీనితో ప్రక్క ఊరిలోని ముఠానాయకులైన బ్రహ్మయ్యకు మరియు వెంకటకృష్ణయ్యకు కూడా గంగిరెడ్డి అంటే భయం, గౌరవం ఏర్పడ్డాయి.

ఆ రోజు ఉదయం పది గం॥లకు వెంకటకృష్ణయ్య దగ్గర నుంచి,

'తాను గంగిరెడ్డితో స్నేహం కోరుచున్నాననీ, అతను రమ్మంటే ఇంటికి వచ్చి అన్ని విషయాలు మాట్లాడగలనని' వర్తమానం పంపాడు. ఈ పరిణామాన్ని గంగిరెడ్డి మరియు బ్రహ్మయ్యతో కూడా మిగిలిన వారంతా ఆహ్వానించారు.

ఆ రోజు రాత్రి గంగిరెడ్డి ఇంట్లో పెద్ద విందు ఏర్పాటు చేయబడింది. వీరేకాక ఆ ప్రాంతంలోని పెద్ద రాజకీయ నాయకులు కూడా విందుకు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి చర్చలు, వాదోపవాదాలు లేవు. అంతా మర్యాదపూర్వకంగా జరిగింది. ఎవరో గెలిచినట్లుగా గానీ, ఇంకెవరో ఓడినట్లుగా గానీ, ఎవరూ భావించలేదు.

అయితే, ఈ వ్యవహారం అంతా రాముకు ఏ మాత్రం నచ్చలేదు. దీనివల్ల జరిగిన మంచి ఏమిటో రాముకు అర్థం కాలేదు. కేవలం వారి–వారి అహం, దర్పం ప్రదర్శించడానికి తప్ప ఇంక దేనికీ పనికి రాదని నిర్ణయించుకున్నాడు. ఈ పరిణామాలన్నీ రాము హృదయంలోనే కాక కడుపులో కూడా కలియబెట్టినట్టు బాధపడినాడు. ఈ సంఘటనల తర్వాత రాము ఇంకా బిడియస్తుడు, భయస్తుడు అయిపోయినాడు. అయితే గ్రామంలోని ఇతరులు, ఇంకా స్కూల్లో టీచర్లతో సహా అందరూ, రామును గౌరవించడం పరిపాటి అయిపోయింది. గంగిరెడ్డి మాత్రం, "ప్రపంచాన్ని అంతా జయిస్తున్నాను, కానీ, నా కుమారుని నా అంతటి వాన్ని చేయలేకపోతున్నాను", అని వ్యథ చెందేవాడు.

ఎలాగైనా రాములో మార్పు తీసుకొని రావాలని, పడుకొన్న తర్వాత రాముకు భారతము, రామాయణములలోని కొన్ని ముఖ్యఘట్టాలు, కథలుగా, నీతులుగా, ధర్మాలుగా చెప్పేవాడు. రాము ఈ కథలను చాలా ఇష్టంగా వినేవాడు. ఒక్కొక్క రోజు రాత్రి తానే అడిగి మరి

చెప్పించుకొనేవాడు. రామును, ముఖ్యంగా భారతంలోని కర్ణుని పాత్ర ఎంతగానో ఆకట్టుకుంది. కానీ కర్ణుడు అందరికంటే వీరుడూ, బలవంతుడూ, అయినా, ధర్మాన్ని ప్రక్కనబెట్టి, దుర్మార్గుడైన దుర్యోధుననికి స్నేహితునిగా, నమ్మినబంటుగా స్థిరపడిపోవడం, అదే స్నేహధర్మం అనుకోవడం సరిగా లేదనిపించింది. బలవంతుడైన వాడు ధర్మాన్ని రక్షించాలి గానీ, అధర్మం వైపు ఎప్పుడైతే మొగ్గు చూపుతాడో, అప్పుడు అతని బలమంతా తప్పక హరించుకొని పోతుంది. ఎందుకంటే, ప్రకృతిలో ధర్మానికే బలం ఎక్కువ. ప్రకృతిలో బలమైనదే జయించినట్లు అనిపించినా, చివరకు జయించేది ధర్మమే. ఎందుకంటే, ధర్మానికున్న బలము, అధర్మానికుండదు కనుక.

## రెండవ భాగం

రాము స్కూలు ఫైనల్ మంచి మార్కులతో పాస్ అయ్యాడు. తర్వాత, గంగిరెడ్డి రామును తిరుపతి పట్టణంలో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పి.యు.సి.)లో చేర్పించాడు. గంగిరెడ్డి తన కొడుకు చక్కగా చదువుకొనుట చూసి చాలా సంతోషించాడు. తనలాగా వ్యవహార దక్షుడు కాకపోయినప్పటికీ, చక్కగా చదువుకుంటున్నాడని తృప్తిపడ్డాడు. రామును ఎలాగైనా డాక్టరును చేసి, తద్వారా తన కొడుకు తన కంటే ఎక్కువ డబ్బు సంపాదించి, గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆశించేవాడు. అందుకు తగినట్టుగా రాము కూడా చాలా బాధ్యతాయుతంగా, చక్కగా చదువుకొనేవాడు. చూస్తుండగానే పబ్లిక్ పరీక్షలు దగ్గర పడ్డాయి. రాము, తను తప్పక ఫస్ట్‌క్లాస్‌లో పాసై మెడిసిన్‌లో చేరేందుకు సరిపడా మార్కులు సాధించగలనని ఆత్మవిశ్వాసంతో వున్నాడు.

ఏదిఏమైనా, విధి అన్నింటికంటే బలీయమైనది. మనము నమ్మినా, నమ్మపోయినా, మనమంతా విధి ఆడే ఆటలో పావులం మాత్రమే. ఉన్నట్లుండి రాముకు తీవ్రమైన జ్వరం వచ్చింది. డాక్టర్లు, రాము టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడని చెప్పారు. గంగిరెడ్డి వెంటనే రామును హాస్పిటల్‌లో చేర్పించినాడు.

దాదాపు 3 వారాలకు గానీ జ్వరం తగ్గలేదు. జ్వరం తగ్గేసరికి రాము చాలా బలహీనంగా తయారయ్యాడు. తర్వాత శక్తి పుంజుకొనేందుకు ఒక వారం రోజుల సమయం పట్టింది. ఆ తర్వాతి వారమే పబ్లిక్ పరీక్షలు. ముందు చాలా బాగా వ్రాయగలననుకొన్న పరీక్షలు, రాము అంత బాగా వ్రాయలేకపోయాడు. పరీక్షల అనంతరం వేసవి సెలవులు వచ్చాయి. ఒక నెల వేసవి సెలవుల తర్వాత, పరీక్షా ఫలితాలు తెలిశాయి. రాము ఫస్ట్‌క్లాస్‌లో అయితే పాస్ అయినాడే గానీ, మెడిసెన్‌లో చేరుటకు సరిపడా మార్కులు సాధించలేకపోయాడు. తనను ఎంతగానో ప్రేమించి, తన మీద ఎంతో నమ్మకం పెట్టుకొన్న తన తండ్రి కోర్కె తీర్చలేకపోయానే, అని రాము దిగులు పడ్డాడు.

గంగిరెడ్డి మాత్రము అంతగా దిగులు చెందకుండా రామును డొనేషన్ కట్టి మెడిసెన్‌లో చేర్పించుటకు సిద్ధమైపోయినాడు. కానీ రాము, "నేను డొనేషన్ కట్టి మెడిసెన్‌లో చేరనే చేరను."

అని, మొండి చేశాడు. రాము డొనేషన్ కట్టి చదువుట అవమానకరంగా భావించాడు. గంగిరెడ్డి చేసేదేమీ లేక డిగ్రీ చదివిన తర్వాత 'లా' కోర్సు చేయించవచ్చులే, అని తనను తాను సముదాయించుకున్నాడు. రాము డిగ్రీ కోర్సులో చేరి బాగా చదువుచున్నాడు. చూస్తుండగానే 3 సం॥ గడిచిపోయాయి. రాము డిగ్రీ మంచి మార్కులతో పాసైనాడు. గంగిరెడ్డి రామును గురించి దీర్ఘంగా ఆలోచించి, తాను ఏమి చేసినా తన కుమారుడు తన లాగా కష్టపడే వాడు, వ్యవహార దక్షుడు కాలేడు. కనుక, అతనిని మంచి లాయరుగా అయినా తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆ ప్రయత్నంలో భాగంగా గంగిరెడ్డి మొదట రామును హైదరాబాదులో, మంచి 'లా' కాలేజిలో లా కోర్సులో చేర్పించాడు. ఆ తర్వాత అతనిని మంచి లాయర్‌గా తయారు చేసేటందుకు తన వంతు ప్రయత్నాలన్నీ ముమ్మరం చేశాడు. రామును ఒక మంచి లాయర్‌గా చేయాలంటే, మొదట తన జిల్లాలో ఒక బలమైన వర్గంతో బాంధవ్యం కలుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత తనకు ముఖ్యమైన వారందరిని 'చదువుకొన్న మరియు అందమైన అమ్మాయిలు, జిల్లాలో పలుకుబడి కలిగిన కుటుంబాలలో ఎవరైనా వున్నారా?' అని విచారించసాగాడు. గంగిరెడ్డి వద్దకు అనేక సంబంధాలు అయితే వచ్చాయి కానీ, వాటిలో ఒక్కటే తమకు అన్ని విధాల సరిపోయిన సంబంధం, అని నిర్ణయించుకున్నాడు. ఆ సంబంధం, జమ్మలమడుగు తాలూకాలో, రేనాటి ప్రాంతానికి చెందిన పెద్దపల్లి రఘురామిరెడ్డి కుమార్తె నీరజ, తన కుమారునికి అన్ని విధాల తగిన వధువు అని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే రఘురామిరెడ్డి రేనాటి గడ్డ మీద తిరుగులేని ఆధిపత్యం వున్న మోతుబరి రైతు. అతనికి ఒక్కతే కుమార్తె. వెంటనే తన భార్య రాజేశ్వరిదేవిని సంప్రదించి, కనీసం రామును ఒక్క మాట కూడా అడగకుండా, రఘురామిరెడ్డి కుమార్తె నీరజతో రాము పెళ్ళి నిశ్చయించాడు. రాము తన తండ్రి చేసిన పనిని ఏ మాత్రం హర్షించలేకపోయాడు. నీరజను చూసిన తర్వాత ఆమెను ఇష్టపడినా, తన తండ్రి తన అభిప్రాయం తెలుసుకొనకుండా తన వివాహాన్ని నిశ్చయించడం రాముకు మింగుడు పడలేదు. కానీ ఎప్పటి వలెనే తన తండ్రిని ఇది ఏమిటని ప్రశ్నించలేక పోయాడు.

రాము, నీరజల పెళ్ళి ఆర్భాటంగా జరిగిపోయింది. ఇప్పుడు గంగిరెడ్డి తన ఇలాఖాలో స్థిరపడటానికి, బలపడటానికి ఈ క్రొత్త బాంధవ్యం ఎంతో ఉపయోగపడింది. రఘురామిరెడ్డికి గొప్ప పేరు ప్రతిష్టలు ఉన్నాయే కానీ, వారు ఇంకా అనాగకరికమైన మొరటు పద్ధతులు పాటించుచూ ఉన్నారు. వారికి తమ బలం, పలుకుబడే ముఖ్యం. అంతేకానీ చదువుల మీద గానీ, ఆధునిక పద్ధతుల మీద గానీ, అంత అవగాహన లేదు. ప్రస్తుతం వారు చుట్టుప్రక్కల వున్న ఊర్లలో తిరుగులేని శక్తిగా వ్యవహరిస్తున్నారు. కానీ, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! పెద్దపల్లెలో రఘురామిరెడ్డికి ఒక వైరి వర్గం కూడా ఉంది. వారు చాలా కాలం నుండి రఘురామిరెడ్డి కుటుంబముచే అణచి వేయబడ్డారు. ఇప్పుడు వారిలో కొందరు యువకులు తమ ప్రాబల్యం చాటుకొనుటకు పూనుకున్నారు. ఆ సమయంలోనే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఎప్పుడూ ఏకగ్రీవంగా పంచాయతీ ప్రెసిడెంటుగా ఎన్నికవుతున్న రఘురామిరెడ్డిపై వైరి వర్గపు నాయకుడు, యువకుడు అయిన విశ్వనాథరెడ్డి పోటీ చేయుటకు సిద్ధపడ్డాడు. రఘురామిరెడ్డి ప్రస్తుతం 60 సం॥లు దాటి కొంత అనారోగ్యంతో బాధపడుతూ వున్నాడు. విశ్వనాథరెడ్డి తన ముందు చాలా బలహీనమైన అభ్యర్థి అయినప్పటికి ఫలితాలు ఎలా వుంటాయో, అనే ఆందోళనకు గురి అయ్యాడు. ఇన్నాళ్ళు తనకు అణగి, మణగి వున్న వైరి వర్గీయులు తనకు పోటీగా నిలబడటం రఘురామిరెడ్డి జీర్ణించుకోలేక పోయాడు.

ఎలక్షన్‌లలో నామినేషన్‌లు, ఆ తర్వాత ప్రచారం మొ॥లగు ఘట్టాలన్ని ముగిసిపోయి, పోలింగు రోజు వచ్చింది. చదురుమదరు ఘర్షణలతో పోలింగు ముగిసింది. సాయంత్రం కౌంటింగ్ జరిగి, రఘరామిరెడ్డి ఎన్నికైనట్లు ప్రకటించారు. కానీ, రఘురామిరెడ్డికి చాలా తక్కువ మెజారిటీ వచ్చింది. రఘురామిరెడ్డికి ఈ వ్యవహారం అంతా చాలా ఆందోళన కలిగిస్తూ వుంది. అతని మనోనేత్రానికి ముందు ముందు జరుగబోవు అనార్థాలన్నీ కనిపించసాగాయి. ఇన్నాళ్ళు తాను అనుభవించిన పెత్తనం అంతా నాశనం అవుతున్నదనే మానసిక క్షోభకు గురి అయ్యాడు. వైరి వర్గపు నాయకుడైన విశ్వనాథరెడ్డి యువకుడే కాక రఘురామిరెడ్డి కంటే కఠినమైన, పట్టుదల కల మనిషి. దానికి తోడు ఇతనికి డిగ్రీ వరకు చదివిన విద్య తోడైంది. చట్టపరమైన మెలకువలు

తెలుసుకుంటూ ఇన్నాళ్ళు అణిచివేతకు గురి అయిన వర్గాన్ని నిలదొక్కుకొనేటట్లు చేయుటలో సఫలీకృతుడయినాడు.

ఈ లోపల రాము తన 3 సం॥ల లా కోర్సును పూర్తి చేసుకొని తన భార్య నీరజతో కలిసి పెద్దపల్లికి వచ్చాడు. అక్కడ అంతా బాగా వున్నట్లే అనిపిస్తూ వుంది. కానీ, రాముకు ఇదంతా తుఫాను ముందరి ప్రశాంతత లాగా తోచింది. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలనుకున్న రాముకు ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వడం విధిరాత కాక యింకేమనుకోవాలి. ఎక్కువ రోజులు అక్కడ ఉండలేక పోయాడు. వెంటనే సతీసమేతంగా బయలుదేరి తన ఊరు వచ్చాడు.

రాము లా కోర్సు చాలా ఇష్టంగా చదివి, చట్టం నందలి మెలకువలు గ్రహించి, ఇప్పుడు ప్రజలకు న్యాయపరమైన సేవలు అందించాలని ఉవ్విళ్ళూరుతూ ఉన్నాడు. న్యాయవ్యవస్థలో న్యాయవాది పాత్ర చాలా ముఖ్యమైనది. న్యాయవాది, న్యాయ సహాయం కోరి తన వద్దకు వచ్చు కక్షీదారులకు వృత్తిపరమైన సేవలు అందించాలి. అలాగే తాను తన కక్షీదారులకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం పోరాడాలి. దీన్ని సాధించుటకు ముఠానాయకుల కంటే ఎక్కువ ధైర్య సాహసాలు ఉండాలి. రాము తన వ్యక్తిత్వాన్ని ఈ దిశగా మలుచుకొనుటకు ప్రయత్నిస్తూ ఉన్నాడు.

రాయలసీమ జిల్లాల్లో వేసవి వస్తూనే చాలా గ్రామాలలో 'దేవర' అని, 'గంగమ్మ జాతర' అని, వివిధ సాంఘీక మరియు సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకుంటూ వుంటారు. చాలా మటుకు వీటన్నిటిలో జంతుబలులు జరుపుతూ వుంటారు. జంతుబలులను ప్రభుత్వము నిషేదించినా, వీటని ఈనాటికి యధేచ్ఛగా జరుపుతూనే వున్నారు.

పెద్దపల్లిలో గ్రామ పెద్దలంతా కలసి ఆ సంవత్సరం దేవర జరపాలని నిర్ణయించారు. దేవరకుగాను ఒక దున్నపోతును యధేచ్ఛగా వదులుతారు. అది ఏ పోలములోనైనా మేయవచ్చు, ఎక్కడనైనా సంచరించవచ్చు, కాని ఆ గ్రామ పొలిమేరలోనే ఉండాలి. దీని వలన పాడి, పంటలు బాగా అభివృద్ధి చెందుతాయని, పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల నమ్మకము, బహుశా, బాగా మేసి బలంగా వున్న దున్న దాటడము వల్ల బర్రెలకు, మంచి దూడలు పుడతాయనే

ఉద్దేశమైతే వుండి వుండవచ్చు. ఈ విధంగా బాగా మేసి బలసిన దున్నను 'దేవర దున్నపోతు' అని అంటారు. కొన్ని నెలల తర్వాత దేవర రోజు దాన్ని పెద్దమ్మకు బలి ఇస్తారు. దానితో గూడా ఊరివారంతా వారి శక్తి కొద్ది పొట్టేళ్లను, కోళ్లను బలి ఇచ్చి, విందు చేసుకుంటారు. ఈ సందర్భంగా వివిధ కారణాల వల్ల అల్లర్లు జరిగే ప్రమాదము కూడా వుంది. అయినా కూడా గ్రామస్తులు దేవర జరుపుకొనడానికే ఉత్సాహము చూపిస్తారు.

పెద్దపల్లిలో కూడా దేవర అనగానే గ్రామస్తులంతా సంబరపడిపోయారు. అంతా ముందునుంచే పొట్టేళ్లను, కోళ్లనూ మేపు కొంటున్నారు. ఉగాది పండుగకు ముందు వచ్చే ఆదివారము నాడు దేవర జరుపుకొను దినంగా గ్రామ పెద్దలు నిర్ణయించారు. అంతా బంధువులకు, స్నేహితులకు ఆహ్వానాలు పంపించారు. ఆ ఊరి అల్లుళ్లకు వారి కుంటుంబాలకు ప్రత్యేకమైన ఆహ్వానాలు వెళ్లాయి. రఘురామిరెడ్డి కూడా తన అల్లున్ని, కూతురును తానే స్వయంగా పోయి అహ్వానించి వచ్చాడు. రాము సొంత ఊరు కొత్తపల్లెలో ఎప్పుడూ దేవర జరుపలేదు. పూర్వమెప్పుడో దేవర సందర్భంగా పెద్ద ఘర్షణ చెలరేగిందని, అప్పటి నుండి దేవర జరపడము మానుకున్నారని పెద్దలు చెప్తారు.

రాము దృష్టిలో దేవర ఒక పండుగలాగా జరుపుకొంటే ఫర్వాలేదు కాని, చట్ట వ్యతిరేకమైన జంతుబలులను తానెన్నడూ సమర్థించలేడు. తనమామ ఆహ్వానాన్ని అతని ముఖాన్నే తిరస్కరించకపోయినా, రామూకు ఆ దేవరకు పోవడము ఎంతమాత్రము ఇష్టము లేదు. కాని, తన భార్య నీరజ దేవరకు తన పుట్టింటికి పోవటానికి చాలా ఉత్సహపడుతూ వుంది. రాము, నీరజకు తానెందుకు దేవరను ఇష్టపడడములేదో చెప్పినా కూడా, నీరజ తనను ఎలాగైనా రావాలని కోరుతూ వుంది. రాము ఇక చేసేదేమీ లేక, తనకు ముఖ్యమైన పనులున్నాయని, వీలైతే దేవర రోజుకు చేరుకుంటానని చెప్పి నీరజ నొక్కదాన్ని పెద్దపల్లెకు పంపించాడు.

రఘురామిరెడ్డి రెండు పొట్టేళ్లను దేవరకోసనమని బాగా మేపినాడు. తన బంధువులను , స్నేహితులను, తన మండలములోని అధికారులను చాలా మందిని, దేవరకు ఆహ్వానించాడు. గ్రామములోని ఇతరులు కూడా వారి–వారి బంధువులను, స్నేహితులనూ ఆహ్వానించారు.

పిలుపందిన వారంతా చాలా మంది దేవర కోసమని వచ్చారు. ఎందుకంటే, మంచి విందుతో పాటు, మందుగూడా దొరుకుతుందారోజు.

యధావిధిగా దేవర కార్యక్రమాలన్ని జరిగిపోవుచున్నాయి. పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. వారు కూడా బందోబస్తులో భాగంగా తమకు లభించనున్న విందు కోసం ఎదురు చూస్తున్నారు. నిజానికి వారు జంతుబలులను అనుమతించకూడదు. కాని, ఎవరూ ఆ ఆలోచనే చేయడము లేదు. ఎలాగూ చంపితినే జంతువులను, మామూలు పద్ధతిలో చంపితే ఏమి? పెద్దమ్మకు బలి ఇస్తే ఏమి ? అన్న ధోరణిలో అధికారులంతా వున్నారు. అందుకే, నేటికి కూడా, ఈ జంతుబలులుయధేచ్ఛగా జరిగి పోతున్నాయి. అయితే యిక్కడ అంతా ఆలోచించవలసిన అంశము ఏమిటంటే, వందల కొద్ది జంతువులను ఒకే చోట బలి యివ్వడము మూలంగా, ఆ ప్రదేశమంతా రక్తసిక్త మవుతుంది. వెంటనే, అనేక రకములైన, సూక్ష్మక్రిములు, బాక్టీరియా కొన్ని నిముషాల్లోనే ఆ ప్రదేశమంతా వ్యాపిస్తాయి. దాని మూలంగా అంటువ్యాధులు ప్రబలే ఆస్కారముంది. యింకా, ఈ విధంగా బలి ఇవ్వడము అందరికీ ఆమోదయోగ్యము కాక పోవచ్చు, కనుక దీన్ని పబ్లిక్ న్యూసెన్స్‌గా కూడా పరిగణించవచ్చు.

అయినా కూడా గ్రామస్తులందరూ దేవర జరగాలని కోరుకుంటున్నారు. కనుక, ఈ జంతు బలులను బలవంతంగా నిరోధించుట సాధ్యము కాక పోవచ్చు. కనుక, అసలు విషయము వారికి విశదపరచి, జంతు బలులకు ప్రత్యామ్నాయంగా ఇంకొక పద్ధతి అలవాటు చేస్తే ఈ జంతుబలులను అరికట్టవచ్చు. మొత్తము మీద పెద్దపల్లెలో దేవర ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగానే జరిగిపోయింది. రాము మాత్రము దేవరకు హాజరు కాలేదు.

ఇది ఇలా వుండగా, రఘురామిరెడ్డి ఊరు పెద్దపల్లిలో విశ్వనాథరెడ్డి చీటికి, మాటికి ఘర్షణలకు కాలు దువ్వుతున్నాడు. చిన్న చిన్న వీధి కొట్లాటలతో మొదలై చివరకు అవి రాయలసీమ జిల్లాల్లో సర్వసాధారణమయిన గ్రామ కక్షలుగా రూపు దిద్దుకున్నాయి. పర్యవసానంగా ఊరు ఊరంతా రెండు వర్గాలుగా నిలువునా చీలిపోయింది. రఘురామిరెడ్డికి ఇన్నాళ్ళు తాను అనుభవించిన పేరు, ప్రతిష్టలు అంతా నేతి బీరకాయలో నేతి చందమేనని అర్థమయింది. కానీ,

నిండా మునిగిన తర్వాత ఇంక చలేముంది. కనుక, ఎలాగైనా ముఠాకక్షలలో విజయం సాధించాలని నిర్ణయించుకున్నాడు. ఆర్థికంగా ఆదుకోమని తన వియ్యంకుడు గంగిరెడ్డిని ఆశ్రయించాడు. గంగిరెడ్డి, ఏమిటి ఇలా జరిగింది! అని విచారపడి, అవసరం అయినప్పుడు ఆర్థికంగా సహాయం చేస్తానని మాట ఇచ్చాడు.

రఘురామిరెడ్డి తన వర్గాన్నంతా కూడగట్టుకొని విశ్వనాథరెడ్డి చేయి దాడులను త్రిప్పి కొట్టాడు. ఎవరికి అవసరం వచ్చినా అంతా కలిసి పోరాడుదామని, తన వర్గాన్నంతా సంఘటిత పరిచాడు. ఈ ప్రాంతంలో నెలకొన్న ముఠాకక్షల్లో, తమ వర్గీయులు తప్పు చేసినా సమర్థించడమనే ఆటవిక సాంప్రదాయం ఉంది. ఒకరోజు నాయకుల ప్రమేయం లేకుండా ఇరువర్గాలకు చెందిన కొందరు యువకులు ఘర్షణ పడ్డారు. ఆ ఘర్షణలలో రఘురామిరెడ్డి వర్గానికి చెందిన ఇద్దరు దళిత యువకులను విశ్వనాథరెడ్డి వర్గీయులు క్రూరంగా కొట్టి గాయపరిచారు. వెంటనే గాయపడిన వారిని దగ్గరలోనే వున్న జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే దారిలోనే వారు గాయాల వల్ల జరిగిన విపరీతమైన రక్తస్రావంతో మరణించారు.

రఘురామిరెడ్డి సూచన మేరకు వైరి వర్గపు నాయకుడైన విశ్వనాథరెడ్డిని మొదటి ముద్దాయిగా చేరుస్తూ, ఇంకా ఏడుగురి మీద హత్యానేరం మోపారు. ఈ సంఘటన తర్వాత విశ్వనాథరెడ్డితో సహా అతని వర్గీయులంతా ఊరు విడిచి పారిపోయారు. ఊరిలో పోలీసు పికెట్ ఏర్పాటు అయ్యింది. పోలీసులు రెండు రోజుల్లోనే విశ్వనాథరెడ్డితో సహా ముద్దాయిలందరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వీరకి జుడీషియల్ రిమాండ్ విధించింది. ఊరిలో మిగిలివున్న విశ్వనాథరెడ్డి వర్గీయులైన పిల్లలు, స్త్రీలు, వృద్ధులు, ఒక ప్రక్క పోలీసులు మరియొక ప్రక్క రఘురామిరెడ్డి వర్గీయుల చేతిలో అనేక దౌర్జన్యాలకు గురి అయినారు. విశ్వనాథరెడ్డి వర్గీయులను లొంగదీసుకొనేందుకు చాకలి, మంగలి ఇంకా ఇతర వృత్తి పనివారిని ఎవ్వరిని, అవతలి వారికి పనులు చేయరాదని రఘురామిరెడ్డి వర్గీయులు ఆంక్షలు విధించారు. బలహీన వర్గాలకు చెందిన ఈ వృత్తి పనివారు, భయంతో ఆ ఆంక్షలను పాటించారు. ఇలాంటి సంఘటనలు రాయలసీమ జిల్లాలలోని ముఠాకక్షలు వున్న చాలా గ్రామాల్లో అప్పుడప్పుడు జరిగేవే. అప్పుడు ఆ బాధితులు

పడే బాధలు అన్ని, ఇన్ని కావు. ఒక ప్రక్క హత్య కావింపబడ్డ వారి బంధువులు అవమానభారంతో, మానసిక వ్యధతో, కుమిలి పోతూ, ప్రతీకారముతో రగిలిపోతూ ఉంటారు. హత్య చేసిన వారు, వారి బంధువులు పోలీసుల దౌర్జన్యాలతో మరియు ప్రతీకార దాడులతో తల్లడిల్లిపోతూ ఉంటారు.

మొత్తం మీద ఇరువర్గాల వారు అభద్రతా భావంతో, మానసిక వ్యధతో కుమిలిపోతూ ఉంటారు. అంతేకానీ రాయలసీమ జిల్లాల్లో జరిగే ఈ ముఠా ఘర్షణలు, సినిమాల్లో చూపినట్లుగా ఉద్వేగభరితంగా ఉండవు. నూరు మందిని, హీరో ఒంటరిగా మట్టుపెట్టే దృశ్యాలు ఇక్కడ ఊహించనైనా ఊహించలేము. పదిమంది హంతకులు, మాటువేసి ఒకరిని హత్య చేయడము ఇక్కడ మామూలుగా జరిగే సంఘటన. ఇందులో కూరుకుపోయిన వారికి తిన్న తిండి వంట బట్టక, నిద్రకరువై అలమటిస్తూ ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడి గ్రామ కక్షలను 'ఒక చావు, బ్రతుకుల పైశాచిక క్రీడగా' అభివర్ణించవచ్చు. రాము, పెద్దపల్లిలో నెలకొన్న పరిస్థితులను చూసి తాను చదివిన చదువు ఇక్కడ ఏవిధంగా ఉపయోగపడుతుందా అని యోచిస్తూ ఉన్నాడు.

రాముకు, ఒక రోజు ఉదయం జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి వద్ద నుంచి, ఒక మనిషి ఒక ఉత్తరం తీసుకొని వచ్చాడు. రాము, లింగారెడ్డి గారి గురించి విని వున్నాడే గానీ ఇంతవరకు అతనితో ఎటువంటి పరిచయం లేదు. అయితే అతను తన మామ రఘురామిరెడ్డికి కావలసిన వాడనేది తెలుసు. లింగారెడ్డి వ్రాసిన ఉత్తరంలో ఈ విధంగా ఉంది.

"ప్రియమైన రాము, నీకు పెద్దపల్లిలో పరిస్థితులు తెలిసే ఉంటాయి. ఈ విషయమై నీతో చర్చించవలసి ఉంది. కనుక వెంటనే బయలుదేరి వచ్చి నన్ను మా ఇంటి వద్ద కలుసుకొనవలసినదిగా కోరుచున్నాను".

ఇట్లు,

లింగారెడ్డి.

ఈ వర్తమానం అందగానే గంగిరెడ్డికూడా రామును వెంటనే పోయి లింగారెడ్డి గారిని కలవమని చెప్పాడు. వార్త తెచ్చిన వ్యక్తి వెంటే రాము కూడా బయలుదేరి పోయి రాజకీయ నాయకుడు లింగారెడ్డిని కలుసుకున్నాడు. రాముకు అంతకుమునుపు లింగారెడ్డితో కొంచెం కూడా పరిచయం లేదు. అతను ఆ ప్రాంతంలో మంచి వ్యక్తిత్వం వున్న నాయకుడని పేరుంది. ముఖ్యంగా అతను శాంతి కాముకుడు. రాము, లింగారెడ్డి ఇంటిలోకి ప్రవేశించిన వెంటనే, లింగారెడ్డి, రాము తనకు ఎప్పటి నుంచో పరిచయం వున్నట్లు చాలా ప్రేమగా,

"రా ! రాము!! నీ గురించి చాలానే విన్నాను. నీలాంటి అభ్యుదయ భావాలున్న యువకులే మన దేశానికి ఇప్పుడు అవసరం. రా! ఇక్కడ కూర్చో!!" అని మర్యాద చేసినాడు.

అతని వ్యవహారశైలి రామును ఎంతగానో ఆకట్టుకుంది. రాము, లింగారెడ్డితో ఇలా అన్నాడు,

"అన్నా ! మీ గురించి కూడా నేను చాలా విన్నాను. ఈ రోజు ఇలా మిమ్మల్ని కలుసుకోవడం నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను!!"

"మా మామ రఘురామిరెడ్డి మీకు కూడా చాలా ముఖ్యమైన వ్యక్తి. పెద్దపల్లిలో పరిస్థితులు ఏమీబాగా లేవు. ఎలాగైనా అక్కడ శాంతి నెలకొనేటట్లు చూడండి".

"నిజమే రాము! పెద్దపల్లిలో పరిస్థితి చాలా దారుణంగా వుంది. చెయ్యి దాటిపోయేటట్లు అనిపిస్తూ ఉంది. అయినా ఇదేమిటి రామూ, మీ మామ రఘురామిరెడ్డి ఇలా చేస్తున్నాడు. పార్టీలు పెట్టుకోవడమే మంచిది కాదు. అందులో ఇలా చాకలిని, మంగలిని అవతలి వాళ్ళకు పనులకు పోకుండా చేస్తే ఎలా? స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఏమి పాపం చేసినారు? పార్టీ అంతకు పార్టీ నడుపుకోవచ్చు కానీ, ఇలా చేస్తే ఎలా? ఇందువలన సమస్య మరింత జఠిలమవుతుందే గానీ, సమసిపోదు. చూడు రాము, ఒక పిల్లిని కూడా రూములో తలుపు మూసి కొడితే అది కూడా ఎగిరి మొహంపై రక్కుతుంది. కనుక సమస్యను మరింత తీవ్రతరం చేయకూడదు. మనం వెంటనే భోజనం చేసి పెద్దపల్లికి పోయి మీ మామతో మాట్లాడి ప్రస్తుతం నెలకొన్న ఈ సమస్యను పరిష్కరించాలి." అని లింగారెడ్డి అన్నాడు.

రాము అక్కడే ఒక ప్రక్క కూర్చోని వున్న మూడవ వ్యక్తిని అప్పుడు గమనించాడు. అతను పెద్దపల్లి వైరి వర్గపు నాయకులలో ఒకరు. అయితే, ఇతను వృద్ధుడయినందువలన అతను ఎక్కడికీ పారిపోకుండా పెద్దపల్లిలోనే వుంటున్నాడు. అతను తమ ఊరిలో జరుగుతున్న దౌర్జన్యాలకు ఇరు వర్గాలకు సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి వద్ద 'ఎలాగైనా తమను రక్షించమని' మొరపెట్టుకొని యున్నాడు. అలాగే రఘురామిరెడ్డి ఎవరి మాట వినకపోయినా తన అల్లుడు రాము మాట తప్పక వింటాడని, రాము విద్యావంతుడు, ఉత్తముడైన వ్యక్తి అని లింగారెడ్డికి తెలిపియున్నారు.

కనుక రాము మధ్యవర్తిత్వం వల్ల సమస్య పరిష్కారం అవుతుందని, వీరిరువు కలిసి రాము సహాయాన్ని కోరారు. రాముకు లింగారెడ్డి చెప్పినది సమంజసమే అయినా, తానే రఘురామిరెడ్డిని మందలించకుండా, తన సహాయం ఎందుకు కోరాడో అర్థం కాలేదు. ఎందుకంటే రఘురామిరెడ్డి, లింగారెడ్డి మాట జవదాటడు. కనుక రాము, లింగారెడ్డితో ఇలా అన్నాడు

"అన్నా, మీరు చెబితే మీ మాట మా మామ వినడా! నాతో చెప్పించవలసిన అవసరం ఏమొచ్చింది!!"

దానికి లింగారెడ్డి,

"అది నిజమే అనుకో, కాకపోతే రఘురామిరెడ్డి నీకు కూతురును ఇచ్చిన మామ. మీ ఇరువురు కష్ట సుఖాలు ఒకరికొకరు పంచుకుంటారు. మేము చెప్పేదేమో చెబుతాము, అయినా నీకున్నంత బాధ్యత మాకు ఉండదు కదా! అదుకే నిన్ను పిలిపించినాము" అని చెప్పాడు.

తర్వాత లింగారెడ్డి ఇంట్లో భోజనాలు చేసి అందరూ ఒక జీపులో పెద్దపల్లికి బయలు దేరారు. పెద్దపల్లి దగ్గర పడగానే ఆ ఊరికి చెందిన 3వ వ్యక్తి ఊరి బయటే జీపు దిగి రామును, లింగారెడ్డిని, ఎలాగైనా ప్రస్తుత సమస్య తీర్చమని మరియొకసారి వారిని అర్థించి తన దారిన తాను, తన ఇంటికి వెళ్ళాడు. లింగారెడ్డి, రాము మాత్రము నేరుగా రఘురామిరెడ్డి ఇంటికి వెళ్ళి, క్షేమ సమాచారం అంతా అయిన తర్వాత, లింగారెడ్డి ఈ విధంగా మొదలు పెట్టాడు,

"రఘూ! అవతలి వారి మీద ఖూనీ కేసు పెట్టారు కదా ? కేసు ఇంకా నడుస్తూనే ఉంది. నెల, రెండు నెలల్లో తీర్పు ఎలానూ వస్తుంది. మరి మీరు ఇప్పుడు అవతలి వారి ఇళ్ళకు చాకలిని, మంగళిని ఇంకా ఇతర వృత్తి పనివారిని పోనీయకుండా మళ్ళగొట్టడం ఏమీ బాగలేదు. దీనివల్ల సమస్య ఇంకా పెద్దదవుతుందే తప్ప, తీరిపోదు. కనుక నా మాట విని వెంటనే ఎవరి పనులు వారు చేసుకొనేటట్లు అందరికి చెప్పు," అని కోరాడు.

దానికి రఘురామిరెడ్డి అయిష్టంగా తల ఫంకించి, విశ్వనాథరెడ్డి వర్గీయులు తన వారిపై చేసిన దాడులను గురించి ఈవిధంగా అన్నాడు.

"వారు అన్యాయంగా దాడి చేసి, మా మనుషులను ఇద్దరిని దారుణంగా హత్య చేశారు. వారికి నా మీద తిరగబడేటంత ధైర్యం ఎలా వచ్చింది? నేను అంతకు అంత ప్రతీకారం తీర్చుకుని వారికి గుణపాఠం చెప్పందే విడిచిపెట్టను," అని తన ఆక్రోశం వెళ్ళగక్కాడు.

అంతవరకు మౌనంగా వున్న రాము,

"మామా! నీవు చెప్పేది నిజమే. అయినా, ఎలాగూ కేసు పెట్టారు కదా! కేసు కోర్టులో నడుస్తూ ఉంది. నా అంచనా ప్రకారం ఒక నెలలో అది విచారణకు వస్తుంది. మీకు సరైన న్యాయం జరుగుతుందనే అనుకుంటున్నాను. ఇట్టి పరిస్థితులలో మీరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనడం మంచిది కాదు. దీనివల్ల అనేక చెడు పరిణామాలు జరగవచ్చు. అవతలి వారిని ఇంకా ఎక్కువ వేధిస్తే, వారు ఇంకా గట్టిగా ప్రతిఘటిస్తారు. కనుక ఇంకెవరిని వేధించకుండా ఇంతటితో మీ దౌర్జన్యాలను ఆపండి," అని ముగించాడు.

స్వతహాగా రఘురామిరెడ్డి మంచి వ్యవహారదక్షుడు, పట్టువిడుపులు తెలిసినవాడు కావడం మూలంగా,

"సరే, నేను ఇక మీదట ఎవరిని వేధించను, ఎటువంటి దౌర్జన్యాలకు పాల్పడను, కానీ అదే సమయములో వారు కూడా ఎటువంటి వేధింపులకు, దౌర్జన్యాలకు పాల్పడకుండా కేసులన్నీ కోర్టులోనే పరిష్కరించుకుంటామని వారు మాట ఇస్తే నాకు సమ్మతమే," అని అన్నాడు.

ఈవిధంగా రాము పెద్దపల్లెలోని ఇరువర్గాల వారికి పరిచయం అయ్యాడు. తర్వాత కొద్ది

రోజులకు పెద్దపల్లి జంట హత్యల కేసు కోర్టులో విచారణకు వచ్చింది. విచారణ నిదానంగా జరుగుతూ వుంది, సాక్షులను ప్రవేశపెట్టడం, వారి సాక్ష్యాలను నమోదు చేయడం, డిఫెన్స్ లాయర్ ఈ సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయడం, అన్ని ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతున్నాయి. ఇట్టి పరిస్థితులలో ఇరు వర్గీయులు కడపలోనే మకాం వేసియున్నారు. పెద్దపల్లిలో హత్య చేయబడ్డ ఇద్దరు యువకుల అన్నదమ్ములంతా కలిసి ఏడుగురు ఉన్నారు. వారు అంతా తమ వారి దుర్మరణంతో, అవమాన భారంతోనూ, మానసిక వేదనతోనూ ఉన్నారు. వారంతా చాలా మటుకు నిరక్షరాస్యులే. వారిలో వారు చర్చించుకుంటూ, ఒకడు,

"మనవాళ్ళ హత్యల తర్వాత, మనము ప్రతీకారం తీర్చుకోకుంటే రేపు మన ఊళ్ళో ఎలా తలెత్తుకొని తిరగాలి."

అనగానే, ఇంకొకడు,

"హంతకులకు కోర్టులో తప్పక శిక్ష పడుతుంది. అంతటితో మన ప్రతీకారం తీరిపోతుంది" అన్నాడు.

మరలా మొదటివాడు,

"శిక్ష పడితే యావజ్జీవ శిక్ష పడుతుంది. అంతేకదా ! ఇప్పట్లో ఉరిశిక్ష ఏమి వెయ్యరు కదా !!"

మరలా రెండవ వాడు,

"యావజ్జీవ శిక్ష అంటే 14 సం౹౹ జైళ్ళో ఉండాలి. సామాన్యంగా ఆ తర్వాత వారిని వదలిపెడతారు"

మరలా మొదటివాడు,

"నేను చెప్పేదీ అదే, వారు మరలా 14 సం౹౹ల తర్వాత ఊరికి వచ్చి తలెత్తుకొని గర్వంగా తిరుగుతారు. అది చూసి మనం తలలు వంచుకొని తిరగాలా? దెబ్బకి దెబ్బ, ప్రాణానికి ప్రాణం, అలా చేస్తేనే మనం మొగోళ్ళం అనిపించుకుంటాం. మన వాళ్ళను చంపిన ఆ రంగారెడ్డిని, దస్తగిరిని చంపి, ఆ తరువాత కావాలంటే మనమే యావజ్జీవ శిక్ష అనుభవిద్దాము. అదే పౌరుషమైన

పని. మన పగ సాధించుకోవచ్చు, తర్వాత ప్రశాంతంగా బ్రతకవచ్చు".

ఈ ఏడుగురి లోకి చిన్నవాడైన రంగడు ఇలా అన్నాడు,

"ఇలా చంపుకుంటూ పోతే తర్వాత వాళ్ళు కూడా మనలను చంపుతారు కదా! ఏది మంచిదో, ఏమి చేయాలో కాస్తా ఆలోచించండి!!"

మిగతా ఇద్దరు కూడా అంతవరకు మాట్లాడని రంగడిని సమర్థించారు. కానీ మొదటివాడే మరలా,

"ఏమి మీకు రోషం, పౌరుషం లేదా ? వాళ్ళకున్న తెంపు మనకు లేకపోతే ఎలా ? ఏది ఏమైనా, మనం వెంటనే ఆ రంగారెడ్డిని, దస్తగిరిని నరికి చంపి మన పగతీర్చుకోవాలి. ఇందుకు అందరం కట్టుబడి ఉంటామని మనం ఏడుగురము ప్రతిజ్ఞ తీసుకోవాలి" ఈవిధంగా చర్చించుకొని వారు ఏడుగురు ఒకే మాట మీదకు వచ్చి, ఆరోజు నుంచి రంగారెడ్డి దస్తగిరులపై నిఘావేసి గమనిస్తూ ఉన్నారు.

ఆ రోజు రాత్రి రంగారెడ్డి, దస్తగిరి, ఇంట్లో నిద్ర పట్టక రెండవ ఆట సినిమాకు వెళ్ళారు. ఇది గమనించిన రఘురామిరెడ్డి వర్గీయులైన ఆ ఏడుగురు వెంటనే ఆ థియేటర్ వద్దకు వెళ్ళి అక్కడ మాటువేశారు. రాత్రి 11 గం॥ 30 ని॥లకు సినిమా వదలగానే ఒక్కొక్కరు లోపలి నుంచి బయటకు వస్తున్నారు. రోడ్డు మీద జన సంచారం అంతగా లేదు. వీధిలైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. రంగారెడ్డి, దస్తగిరులు బయటకు రాగానే వారి కోసం మాటువేసియున్న ఈ ఏడుగురు, రంగారెడ్డిని, దస్తగిరిని, ఒక్కొక్కరిని ముగ్గురు చొప్పున ఒడిసి పట్టుకొని, బిగ్గరగా కేకలు వేస్తూ, బొగ్గిట్లో దోపుకొని వున్న పిడిబాకులతో వారి ఛాతిపై, కడుపులో ఇంకా గొంతుమీద ఇష్టం వచ్చినట్లు పొడిచారు. వారు చనిపోయారని నిర్ధారించుకున్న తర్వాత ఆ ఏడుగురు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అక్కడి నుండి పరారై పోయారు.

అక్కడ సినిమా వదిలినపుడు బయటకు వచ్చిన జనం, హంతకులు కేకలు వేస్తూ వారిని నడిరోడ్డు మీద పొడుస్తూ వుంటే అంతా చెల్లాచెదురై పారిపోయారే తప్ప, రక్షించుటకు ఎవరూ సాహసించలేదు.

రఘురామిరెడ్డి ప్రమేయం లేకుండానే ఇప్పుడు ఈ హత్యలు జరిగాయని అందరికి తెలిసి కూడా, విశ్వనాథరెడ్డి ప్రోద్భలంతో రఘురామిరెడ్డిని మొదటి ముద్దాయిగా కేసులో ఇరికించి, ఇంకా పన్నెండు మంది మీద ఖూని కేసు బనాయించినారు. రఘురామిరెడ్డి జరిగిన దానికి చింతిస్తూ, ఒకవేళ తాను పోయి పోలీసులకు లొంగిపోతే వారి వేధింపులకు గురి కావలసి వస్తుందని భయపడి, ఎక్కడికైనా పారిపోవాలని ఆలోచిస్తూ వున్నాడు. అదే సమయంలో రాము అనుకోకుండా అక్కడికి రావడం జరిగింది. రఘురామిరెడ్డి రాముకు విషయం అంతా వివరించి,

"రాము! నేను ఈ ముఠాకక్షలు ఎంత వద్దనుకొన్నా ఇందులో కూరుకొని పోతున్నాను. ఇప్పుడు ఆ ఏడుగురు, వారంతకు వారే రంగారెడ్డి, దస్తగిరులను హత్యచేసి పారిపోయారు. ఇందులో నా పాత్ర ఏమాత్రము లేదు. కానీ ఆ విశ్వనాథరెడ్డి మరలా నన్ను మొదటి ముద్దాయిగా చేర్చి నన్ను ఈ రొంపిలోకి లాగుచున్నాడు. ఇప్పుడు ఇంక నేనేమి చేయగలను. నేను ఎక్కడికైనా దూర ప్రాంతానికి పారిపోయి, కేసు కోర్టులో విచారణకు వచ్చు సమయానికి తిరిగి వస్తాను. అంతవరకు సంసార బాధ్యతలు అన్ని నీవు చూసుకొనవలెను." అని అన్నాడు.

అందుకు రాము,

"మామా! మీరు ఇలా పారిపోతే ఇందులో తప్పక మీ హస్తం ఉందని పోలీసులుతో సహా అందరూ భావిస్తారు. కనుక మీరు ఎక్కడికి పారిపోవద్దు. మనం వెంటనే జిల్లా ఎస్పీ దగ్గరకు వెళ్దాము. మీరు వారికి సరెండర్ అవ్వండి. అప్పుడు తప్పక పోలీసువారు, ఈ హత్యలలో మీ హస్తం లేదని విశ్వసిస్తారు." అని చెప్పి. పేపరు, పెన్ను తీసుకొని ఈ కేసుకు సంభందించిన మొత్తం వివరాలను అందులో పొందుపరచి, రాము తన మామను పిలుచుకొని, వెంటనే యస్.పి. ఆఫీసుకు వెళ్ళాడు. అక్కడ యస్.పి. గారిని కలిసి, మొదట తాము వ్రాసుకొన్న విన్నపం ఇచ్చి, యస్.పి. గారితో ఈవిధంగా అన్నాడు,

"సార్, రఘురామిరెడ్డి నిర్దోషి. అతను ఈ ముఠాకక్షల నుండి బయటపడాలని చాలా ప్రయత్నిస్తూ ఉన్నాడు. కానీ మూర్ఖులైన ఆ ఏడుగురు హంతకులు చట్టము మీద గౌరవం లేకుండా వారు ప్రతీకారానికి పాల్పడి, ఈ హత్యలు చేసారు. అంతేకానీ రఘురామిరెడ్డికి ఈ

విషయం ఇసుమంతైనా తెలియదు." అప్పుడు యస్.పి. గారు,

"అలా అయితే, అవతలివారు హత్యచేసిన ఆ ఏడుగురు మీద నేరం మోపకుండా, రఘురామిరెడ్డినే ఎందుకు మొదటి ముద్దాయిగా చేరుస్తారు. ఈ హత్యలతో రఘురామిరెడ్డికి ఏదో ఒక విధమైన సంబంధం ఉంది గనుకనే విశ్వనాధరెడ్డి వర్గీయులు ఇతనిని మొదటి ముద్దాయిగా చేర్చారు. కానీ మీరంతకు మీరు నా వద్దకు వచ్చి లొంగిపోవడం ద్వారా మీ కేసును మీరు చెప్పే కోణము నుంచి కూడా పరిశీలిస్తాము" అని చెప్పాడు.

అప్పుడు రాము,

"సార్! రాయలసీమ ముఠాకక్షలలో ఎక్కడ హత్య జరిగినా, నాయకునికి ప్రమేయం లేకున్నా, ఆ నాయకున్నే మొదటి ముద్దాయిగా చేరుస్తారనేది అందరికి తెలిసిన విషయమే. కనుక, కేవలం రఘురామిరెడ్డిని మొదటి ముద్దాయిగా చేర్చినారని, అతనే ఈ హత్యలకు సూత్రధారి అని పేర్కొనడం న్యాయం కాదు. మీకు ఇప్పటికే ఎవరు హత్యచేశారో ప్రాథమిక సమాచారం అంది ఉంటుంది. కనుక, మీరు అన్ని విషయాలు విచారించి రఘురామిరెడ్డికి న్యాయం చేయాలని కోరుచున్నాను" అన్నాడు.

దానికి ఎస్పీ,

"సరే, మేము అన్ని విషయాలు విచారించిన తరువాత రఘురామిరెడ్డికి నిజంగా ఈ హత్యలలో ఎలాంటి హస్తం లేదని రుజువు అయితే, అప్పుడు అతనికి తప్పక న్యాయము చేస్తాము" అని చెప్పారు.

రఘురామిరెడ్డి అరెస్ట్ అయ్యి మూడు నెలలు దాటిపోయింది. కానీ అతనికి బెయిల్ దొరకలేదు. రాము అతనికి పరిచయం వున్న లింగారెడ్డిని పిలుచుకొని జిల్లా యస్.పి. వద్దకు వెళ్ళి రఘురామిరెడ్డి నిర్దోషి కనుక, అతనిని కేసు నుండి తప్పించవలసినదిగా కోరాడు. అందుకు జిల్లా యస్.పి.,

"రఘురామిరెడ్డికి ఈ కేసుతో ఏ సమయంలో కూడా ఎటువంటి సంబంధం లేదని మా విచారణలో పూర్తిగా తేలింది. అయినా కూడా కొన్ని సాంకేతిక కారణాల వలన మేము అతనిపై

కేసు ఉపసంహరించలేము” అని జవాబు ఇచ్చాడు.

అందుకు రాము,

“మీ దగ్గర రఘురామిరెడ్డికి సంబంధించిన పూర్తి సమాచారం వున్నప్పుడు, ఎందుకు అతనిని నిర్దోషిగా విడుదల చేయలేరు?” అని అడిగాడు.

అందుకు యస్.పి.,

“మేము ఇప్పుడు రఘురామిరెడ్డి నిర్దోషి అని అతనిని కేసు నుండి తొలగిస్తే మేము పోలీసులమని అనిపించుకోము. ఎందుకంటే, ఆ తరువాత, కేసు నిజమైన నేరస్థులపైన ఏమాత్రం నిలబడలేదు. కనుక మేము, ఈ కేసును యధాతథంగా జిల్లా కోర్టులో చార్జీషీటు ఫైల్ చేస్తాము. ఆ తరువాత రఘురామిరెడ్డికి మేమే పోలీసు పద్ధతిలో సహాయం చేసి కేసు నుండి బయటకు తీసుకొస్తాము” అని అన్నారు.

ఇంకా ఇలా అన్నారు,

“మీరు పెద్దపల్లిలో కేసులన్ని ఎలాగైనా రాజీచేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి జిల్లాలో ఫ్యాక్షన్‌ను నిర్మూలించేటందుకు పోలీసులతో సహకరించండి” అని వీరిరువురుని కోరారు.

రాముకు ఈ వ్యవహారం అంతా న్యాయ వ్యవస్థకు భిన్నంగా అనిపించినా, పోలీసులు చేయు ఈ ప్రయత్నం మొత్తం వ్యవస్థను ప్రక్షాళనం చేసేదిగా తోచింది. ఈవిషయం అంతా విన్న రఘురామిరెడ్డి వకీలు, పోలీసులపై మండిపడి తీవ్రమైన విమర్శలు గుప్పించాడు. అయితే రాము ఈ వ్యవహారన్నంతా సానుకూలంగా మలచుకొనుటకు, వెంటనే వేగంగా పావులు కదిపాడు. ఇరువర్గాలతో పరిచయం వున్న లింగారెడ్డిని కలిసి, ‘ఇరువర్గాలపై వున్న కేసులన్నీ రాజీ చేసుకొని, ఇక మీదట ఎటువంటి ముఠాకక్షలు కట్టకుండా ప్రశాంతంగా వుండాలని’ రాజీ ప్రతిపాదన చేశాడు. పోలీసులు కూడా ఇరువర్గాలను రాజీకమ్మని, లేనిచో పెద్దపల్లిలో ఇరు వర్గాలను ఉక్కుపాదంతో అణిచివేస్తాము, అని బెదిరించారు. ఇరువర్గాల నాయకులైన రఘురామిరెడ్డి మరియు విశ్వనాధరెడ్డిలపై ఖూని కేసులు నడుస్తూ ఉన్నందువల్ల, ఇంకా చాలా మంది వారి అనుయాయులపై కూడా ఖూని కేసులే కాక ఇంకా కొన్ని కేసులు నడుస్తూ ఉన్నందువల్ల, అందరూ రాజీ అయితేనే

మంచిదని భావించారు. కనుక, అందరూ కలిసి రాజీ అయితేనే మంచిదని నిర్ణయించుకొని, అందుకు తమ సమ్మతి తెలిపారు. అనుకొన్న ప్రకారమే కేసులలో సాక్ష్యాలు తప్పు పలికి, పెద్దపల్లి ప్రజలంతా ప్రస్తుతానికి ఈ ముఠాకక్షల నుంచి బయటపడ్డామని సంతోషించారు.

# మూడవ భాగము

రాము, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ నందు 1980 సం॥ అడ్వకేట్‌గా తన పేరును నమోదు చేయించుకొని, కడప పట్టణము నందు గల జిల్లా కోర్టులో పేరొందిన అడ్వకేట్ శ్రీకృష్ణమాచారి గారి వద్ద జూనియర్‌గా ప్రాక్టీసు ప్రారంభించాడు. అప్పటికి ముఠాకక్షలు ఇంకా రాజ్యమేలుతునేవున్నాయి. స్వతహాగా కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండే రాము వృత్తి రీత్యా కక్షీదారులకు న్యాయపరమైన సహాయం అందిస్తూ ఉన్నాడు.

తొందరలోనే రాము మంచి జూనియర్ వకీలుగా చాలా మందికి పరిచయం అయ్యాడు. కానీ, తన కక్షీదారులు తనను వృత్తిపరమైన నియమ, నిబంధనలు అతిక్రమించుటకు ప్రేరేపించినా, రాము అందుకు సమ్మతించేవాడు కాదు. తన మామ రఘురామిరెడ్డి గారి కేసు విషయంలో రెండు, మూడు సార్లు జిల్లా యస్.పి. గారిని కలుసుకొని వున్నాడు, కానీ ఇతర కేసుల విషయంలో తాను అలా చేయుటకు నిరాకరిస్తూ వస్తున్నాడు.

ఇలా వుండగా, తన సొంత ఊరు కొత్తపల్లెలో ఉన్నట్లుండి ఒక హత్య జరిగింది. అయితే, ఆ హత్యతో తన కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదు. తన ఊరిలోని ఇరువర్గాలలో ఒక వర్గం వారు తాను పనిచేస్తున్న శ్రీకృష్ణమాచారి వద్దకు కక్షీదారులుగా వచ్చారు. ఆ రోజు రాము ఆఫీసులోనే ఉన్నాడు. చిన్ననాటి నుండి తనకు పరిచయస్థులైన తన ఊరి వారే ఇరు వర్గాలుగా విడిపోవడం, అందులో ఒక వర్గానికి తాను జూనియర్‌గా వ్యవహరించడం, రాము ఊహించుకొనలేక పోయడు. చిన్ననాడు ఊరిలో తాను అనుభవించిన సిగ్గు, భయం, అనే మానసిక వ్యాకులతలు ఒక్కసారిగ ప్రకోపించాయి. ఇంక రాము ఊరికే ఉండలేక పోయాడు. వెంటనే తన సీనియర్ వద్దకు వెళ్ళి

“సార్, ఈ కేసులో నాకు గానీ, నా కుటుంబానికి గానీ, ఏ విధమైన సంబంధం లేకున్ననూ, ఇరు వర్గాల వారు పరిచయస్థులు కనుక, ఈ కేసులో జూనియర్‌గా వ్యవహరించలేను. ఈ కేసు పరిష్కరింపబడ్డాక నేను మీ వద్దకు తిరిగి వస్తాను. దయచేసి నన్ను మన్నించండి.”

అని విన్నవించుకున్నాడు. దానికి శ్రీకృష్ణమాచారి,

“రామూ! నీవు ఒక వకీలువు, నీకు నేరుగా ప్రమేయం లేని దేని గురించి నీవు భయపడవలసిన పనిలేదు. నీ వృత్తిధర్మం నీవు నెరవేర్చు. మిగతా విషయాలేవి మనసులో పెట్టుకోకుండా నీ పని నీవు చేసుకొంటూ పో,”

అని చెప్పాడు. కానీ రాము ఇందుకు ససేమిరా, అని

“అది నా చేతకాని పని. నా వ్యక్తిత్వం భిన్నమైనది. ఇట్టి పరిస్థితులలో నేను నా వృత్తి ధర్మాన్ని నెరవేర్చలేను. దయచేసి నన్ను క్షమించండి,” అని దీనంగా పలికాడు. అప్పుడు తన సీనియర్ అడ్వకేట్,

“రాము, ఏ వృత్తి అయినా డబ్బు సంపాదించుట కొరకే. కానీ, చేసే వృత్తి పట్ల నిబద్ధత వుండాలి. వృత్తిలో నీతి నియమాలు పాటించాలి. నీ మనస్తత్వము చాలా సున్నితమైనదిగా కనిపిస్తూ వుంది. నీవు ఈ వృత్తిలో మనలేవు. నీవు మంచి పలుకుబడి కలిగిన కుటుంబము నుంచి వచ్చినావు. కనుక, ఏవైనా కొన్ని డీలర్‌షిప్‌లు సంపాదించి వ్యాపారం చేసుకో. నీ మనస్తత్వానికి అది సరిపోతుంది. నీవు నా వద్దకు యింక రావలసిన అవసరము లేదు.” అని నిష్కర్షగా చెప్పాడు.

రాము ఈ మాటలు విని నిరుత్తరుడైనాడు. తన సీనియర్ మీదనే కాక తన మీద తనకే విపరీతమైన కోపం వచ్చింది. తన వ్యక్తిత్వాన్ని నిందించుకున్నాడు. విపరీతమైన మనస్తాపంతో నేరుగా ఇంటికి వచ్చి, బార్ కౌన్సిల్ తనకిచ్చిన అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్‌ను, మరియు తన అడ్వకేట్ గుర్తింపు కార్డును, ముక్కలు ముక్కలుగా చించి కాల్చి వేసినాడు. ఇంటిముందు ఉన్న నేమ్ బోర్డును తునాతునకలు, చేసి వెంటనే పేపరు పెన్ను తీసుకొని బార్ కౌన్సిల్‌కు ఈక్రింది విధంగా లేఖ వ్రాసాడు.

గౌరవనీయులైన బార్ కౌన్సిల్ సెక్రెటరి గారికి,

నేను 1980వ సం॥లో బార్ కౌన్సిల్‌లో నా పేరు నమోదు చేసుకొని కడప పట్టణము నందు వున్న జిల్లా కోర్టులో అడ్వకేట్‌గా ప్రాక్టీసు చేస్తూ ఉన్నాను. ప్రస్తుతం వృత్తిపరంగా నేను ఎదుర్కొంటున్న సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందినాను. నేను న్యాయవాద వృత్తికి పనికిరానని

నిర్ణయించుకొని, నా అంతకు నేనుగా బార్ కౌన్సిల్‌కు రాజీనామా చేస్తున్నాను. నేను ఇక మీదట ఈ వృత్తిలో ఏ మాత్రం కొనసాగలేను. కనుక, నా పేరును బార్ కౌన్సిల్ నుండి తొలగించాలని కోరుచున్నాను.

ఇట్లు,

తమవిధేయుడు,

రాము

అని ఆ ఉత్తరాన్ని ముగించి వెంటనే దాన్ని బార్ కౌన్సిల్ సెక్రటరి గారికి పంపించాడు.

ఈ విషయము తన భార్య నీరజకు తప్ప ఇంకెవరికి చెప్పలేదు. కొద్ది రోజులు ఇంట్లోనే దిగులుగా వుండేవాడు. తన వ్యక్తిత్వాన్ని తానే నిందించుకొనేవాడు. నేనెందుకు అందరిలాగా కఠినంగా, ధైర్యంగా ఉండలేకపోతున్నాను అని బాధపడ్డాడు. ఈ విధంగా ఒక వారం రోజులు తనలో తానే కుమిలిపోతూ గడిపాడు. కొద్ది రోజుల తర్వాత, బార్ కౌన్సిల్ నుంచి రాముకు ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఇలా వ్రాసి వుంది.

"మీరు బార్ కౌన్సిల్ నుండి మీ పేరు ఉపసంహరించుకొనదలచినచో మీరు మీ అడ్వకేట్ ఐడెంటిటి కార్డును మరియు అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్‌ను, వెంటనే మాకు స్వాధీనపరచ వలసినదిగా కోరుచున్నాము. ఆ తర్వాత మిమ్ములను మీ బాధ్యతల నుండి విముక్తులను చేయగలము." అని తెలియబరిచినారు.

రాము భార్య నీరజ తన భర్త పరిస్థితి చూసి, అతనెంతో నిష్టగా చదివిన చదువు వృధా అవుచున్నదే అని చాలా బాధపడింది. తానే తన భర్త రాముకు కర్తవ్యాన్ని బోధించాలని నిర్ణయించుకొని,

"అసలు వృత్తిధర్మం అంటే ఏమిటండీ ! మీరు మీ సీనియర్‌తో నివేదించిన మీ అభిప్రాయం సరైనదే. ఎందుకంటే, ఎవరైనా తనకు పరిచయమున్న వారు గానీ, బంధువులు గానీ, కేసులో వుంటే, న్యాయమూర్తులు కూడా ఆ కేసు నుండి ప్రక్కకు వైదొలుగుతారు. కానీ మీ సీనియర్ మిమ్మల్ని ఎందుకలా అపార్థం చేసుకొని చిన్నబుచ్చారో నాకైతే తెలియదు. కానీ, మీరు మీ వృత్తి

ధర్మాన్ని ఏ మాత్రం అతిక్రమించలేదు. ఇంకా చెప్పాలంటే మీరు చేసిన పనే సరైన వృత్తి ధర్మం. కనుక, మీరు ఏ మాత్రం చింతించక, వెంటనే హైదరాబాదుకు పోయి బార్ కౌన్సిల్ సెక్రెటరీ గారిని కలిసి, ఆవేశంలో మీరు వ్రాసిన ఉత్తరాన్ని ఉపసంహరించుకొంటున్నట్లు తెలిపి, పనికిరాకుండా పోయిన మీ సర్టిఫికెట్ల స్థానంలో నకలు సర్టిఫికెట్లు ఇప్పించుకొని రండి. ఇక మీదట మీరు కడపలో సొంతంగానే ప్రాక్టీసు ప్రారంభించండి."

అని రాముకు తన భార్య నీరజ ఒక గురువులాగా కర్తవ్యాన్ని బోధించింది.

తన భార్యచెప్పిన మాటలు సమంజసంగా వున్నాయని తెలుసుకొని, తన సీనియర్ తప్పిదానికి తాను బాధపడవలసిన అవసరం లేదని భావించి, వెంటనే హైదరాబాద్ వెళ్ళి, అక్కడ బార్ కౌన్సిల్ కార్యదర్శి గారిని కలుసుకొని,

"సార్, నేను ఆవేశంలో వ్రాసిన ఉత్తరానికి క్షమించండి. ఏ కారణం లేకుండానే నేను అడ్వకేటుగా పనికి రానేమో అనుకొని అలా తప్పుగా ఆలోచించి బార్ కౌన్సిల్‌కు రాజీనామా చేస్తున్నట్లు మీకు లేఖ వ్రాసాను. కానీ నిదానంగా ఆలోచించిన మీదట నేను తీసుకొన్న నిర్ణయము తప్పు అని తెలుసుకొని, రాజీనామా చేయాలనుకొన్న నా నిర్ణయాన్ని ఉపసంహరించు కుంటున్నాను. నా పొరపాటు మూలంగా నా సర్టిఫికెట్స్ కూడా పాడైపోయాయి. కనుక దయచేసి నాకు, నా సర్టిఫికెట్ల నకలు కాపీలు తయారు చేసి ఇవ్వండి" అని విన్నవించుకొన్నాడు.

అందుకు బార్ కౌన్సిల్ కార్యదర్శి గారు సానుకూలంగా స్పందించి,

"మిష్టర్ రాము ! మీరు అనాలోచితంగా తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మానుకోండి. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు వస్తూ ఉంటాయి, కానీ మనం తొందరపడకుండా నిదానంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అయినా, ఇప్పుడు మీకు వచ్చిన నష్టం ఏమీ లేదు. మీచే ఇప్పుడే మరలా ప్రమాణ పత్రం చదివించి, మీకు మరలా మీకు మీ సర్టిఫికెట్లు రెండు రోజుల్లో తయారు చేసి ఇప్పించగలను",

అని, ఆ తర్వాత రాము చేత అడ్వకేట్‌గా ప్రమాణం చేపించి, రామును, రెండు రోజుల తర్వాత వచ్చి ఆఫీసులో సర్టిఫికెట్లు తీసుకోవలసినదిగా కోరారు.

రాము బార్ కౌన్సిల్‌లో తన నకలు సర్టిఫికెట్స్‌ను తీసుకొని హైదరాబాద్ నుంచి కడపకు తిరిగి వచ్చి కడప జిల్లా కోర్టులో సొంతంగా ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టాడు. తనకూ, తమ కుటుంబాలకూ వున్న పరిచయాల ద్వారా, ఇంకా, న్యాయాన్ని గెలిపించవలెననే అకుంఠిత దీక్ష వల్ల, త్వరలోనే ఒక మంచి వకీలుగా పేరు గడించాడు. తనకు చిన్నప్పటి నుంచి వున్న మానసిక బలహీనతలకు తగిన చికిత్స తీసుకుంటే స్వస్థత పొందగలనని తెలుసుకొని, ఒక మంచి మానసిక వైద్యున్ని కలిసి, అతనిచే తగిన చికిత్స, సలహాలు పొంది, మరలా మామూలు మనిషై, తనకు తన పల్లెలో చిన్ననాడు ప్రాప్తించిన ఆత్మన్యూనతా భావం నుంచి బయట పడేందుకు తీవ్రంగా ప్రయత్నించి అందులో సఫలీకృతుడైనాడు. ఇప్పుడు రాము దేనికి వెరవకుండా, తన మనస్సాక్షి చెప్పినట్టు తాను మంచిదని నమ్మిన మార్గంలో పయనించసాగాడు.

ఇంతలో సంక్రాంతి పండుగ దగ్గర పండింది. పల్లెలంతా పంటల నూర్పిళ్ళతో కళకళలాడుతూ వున్నాయి. రఘురామిరెడ్డి కూతుర్ని అల్లున్ని పండుగకు తానే వెళ్లి పిలుచుకువచ్చాడు. సంక్రాంతి వేడుకలు భారతదేశమంతట సాంప్రదాయబద్దంగా జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పండుగను పల్లెల్లో చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. ముఖ్యంగా ఈ పండుగను పంటలు నూర్పిళ్ళకు వచ్చిన సందర్భంగా జరుపుకుంటారు. రైతులు ఈ పండగను పెద్ద పండగ అని కూడా పిలుచుకుంటారు.

సంక్రాంతి సందర్భంగా పెద్దపల్లెలోని వాతావరణమంతా మారిపోయింది. పండుగరోజు నీరజ తెల్లవారుజామునే లేచి, తల స్నానం చేసి, ఇంటి ముందు ముగ్గుబెట్టి, గొబ్బెమ్మలను తయారుచేసి, ఆ ముగ్గుల్లో అలంకరించింది. తెలతెలవారుతుండగానే హరిదాసు పాటపాడుకుంటూ తిరుగుతూ బిక్ష స్వీకరిస్తున్నాడు. మరికొద్దిసేపటికి గంగిరెద్దులవాళ్లు ఎద్దులను ముస్తాబుచేసి, మేళము వాయిస్తూ యిల్లిల్లూ తిరుగుతున్నారు. కొన్నిచోట్ల గంగిరెద్దులతో ఆటలు ఆడిస్తున్నారు.

ఊరి వాతావరణమంతా ప్రబంధకావ్యాలలోని కవుల కల్పనలా స్ఫూరిస్తూవుంది. జనవరి నెలలోని చల్లదనము, వయసులో వున్న పల్లె పడుచుల అందచందాలు, అందరి మోముల్లోనూ చిరునవ్వు, పక్షులకిలకిలా రావాలు, అబ్బా! ఈ సంక్రాంతి సోయగాలు నేను వర్ణించలేకున్నాను.

నిన్న మొన్నటి వరకూ, కక్షలతో, పోట్లాటలతో చిన్నబోయిన పల్లె ఈ రోజు గర్వంగా తలెత్తుకుంది. అందరి మనసుల్లోనూ ఆనందమే, అది క్షణికమే అయినా, అది సంక్రాంతి తెచ్చిన సంబరం. రేపెట్లుంటుందో ఎవ్వరూ ఆలోచించడము లేదు. నేటి ఈ ఆనందాన్ని శాశ్వతము చేసుకోవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. అయినా వారి ఆకాంక్ష ఈ రాయలసీమలో ఎప్పుడు నెరవేరుతుందో !

రాము ఓ స్వాప్నికునిలాగా, రాయలసీమలో ఏదో ఒకరోజు శాంతి చిగురిస్తుందని పూర్తిగానమ్ముతున్నాడు. ఆడవారు వంటల్లో మునిగిపోయారు. అందరు తమశక్తికొద్దీ పిండి వంటలు చేసుకుంటున్నారు. మామూలుగా ఈ ప్రాంతములో, సంక్రాంతిరోజు, చిత్రాన్నము, పాయసము, పొంగలి, చాపట్లు, దోశలు, వడలు, పప్పు, చారు, మొదలగు పదార్థాలన్ని చేస్తారు.

మామూలుగా సంక్రాంతి మూడురోజుల పండుగ. మొదటిరోజు–భోగి, చాలా చోట్ల తెల్లవారుజామునే భోగిమంటలు వేస్తారు. ఈ రోజు చిన్నపిల్లలను గడపపై కూర్చుండపెట్టి రేగిపండ్లు తలపైపోస్తారు.

మరి మూడవదినాన్ని కనుమ అని, పార్న అని పిలుస్తారు. ఈ రోజు, పల్లెల్లో చాలా హడావుడి వుంటుంది. చాలాచోట్ల ఈ రోజు మాంసాహారము చేసుకుంటారు. కోడిపందాలు జరుపుకుంటారు. (కోడిపందాలను ప్రభుత్వము నిషేదించింది) చాలాచోట్ల పశువులను నిప్పుల్లో త్రొక్కించుతారు. ఈ ప్రాంతములో చాలాచోట్ల పారువేట జరుపుతారు. పారువేట అంటే, ఒక గొర్రెనుకాని, పొట్టేలునుకాని, బయలు ప్రదేశములో బెదిరించి వదలిపెడతారు. ఉత్సాహవంతులైన యువకులు దాని వెంటాడి పట్టుకొనవలెను. అది ఎవరు పట్టుకుంటే వారికి అందులో భాగాన్ని ఇస్తారు. ఈ ప్రాంతములో ఇది చాలా ప్రాచుర్యములో ఉంది.

రాము మూడురోజులు మామగారింట్లో ఆనందంగా గడిపి 'పల్లెలు ఎప్పుడూ ఇలావుంటే ఎంతబావుంటుంది?' అని అనుకున్నాడు. పండుగ అయిపోయిన వెంటనే సతీసమేతంగా రాము కడపకు తిరిగి వచ్చాడు.

పండుగ అయిపోయింది. మళ్లీ అందరూ వారి, వారి దైనందిక కార్యక్రమాల్లో మునిగిపోయారు.

అయితే రేనాట పెద్దపల్లిలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా వుంది. అందరూ ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళన చెందుతూవున్నారు. ఈ మధ్య జరిగిన పరిణామాల వల్ల ఇటు రఘురామిరెడ్డి వర్గం, అటు విశ్వనాధ రెడ్డి వర్గం, రెండూ ఆర్థికంగా చితికిపోయినాయి. రఘురామిరెడ్డికి అంగబలం బాగున్నా , ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదు కనుక, తన వియ్యంకుడైన గంగిరెడ్డిని, ఆర్థికంగా తనకు అండగా నిలవాలని వేడుకున్నాడు. గంగిరెడ్డి ఆలోచించి, అవసరం అయినప్పుడు ఆదుకొంటానని మాట ఇచ్చాడే కానీ, నిజానికి అతనెప్పుడూ అంత పెద్ద సహాయమేమి చేయలేదు. అయినా కూడా రఘురామిరెడ్డికి తన వియ్యంకుడు కొండలాగా అండ ఉండాడని అందరూ భావించేటట్లు చేశాడు. విశ్వనాథరెడ్డి వర్గీయులు ఎలాగైనా ఊరిలో రఘురామిరెడ్డి ఆధిపత్యం కూలద్రోసి తాము ఆ ఆధిపత్యాన్ని చేజిక్కించుకోవాలని ఉవ్విలూరుతూవున్నారు. తరతరాలుగా తమ మీద రఘురామిరెడ్డి వర్గము చేసిన దౌర్జన్యాలు తలుచుకొని అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఆలోచిస్తూ, తమ బలాన్ని పెంచుకుంటున్నారు. అందులో భాగంగా ముందు ఆయుధాలను సేకరించడానికి పూనుకొన్నారు. రెండు డబుల్ బ్యారల్ తుపాకులు, మూడు పిస్టల్‌లు, సమకూర్చుకున్నారు. మారుమూల కళ్ళంలో 100 నాటు బాంబులు తయారు చేయించారు. అయిదారు మంది యువకులను ఎన్నుకొని వారికి ఆయుధాలు ఉపయోగించడంలో మెలకువలు నేర్పించారు. ఇంకా నాటుబాంబులు ఎలా విసరాలో తర్ఫీదు ఇచ్చారు.

ఈ వ్యవహారం అంతా రఘురామిరెడ్డికి తెలుస్తూనే ఉన్నది. కానీ అవతలివారు ఎన్నటికీ తమపై పట్టు సాధించలేరనే విశ్వాసంతో ఉన్నాడు. కానీ ఊరిలో అందరి అంతరంగాలు కల్లోల భరితంగానే ఉన్నాయి. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఎప్పుడేమి జరుగుతుందో అని భయపడుతున్నారు. ముఖ్యమైన నాయకులు కూడా విపరీతమైన మానసిక ఆందోళనతో సరైన తిండి, సరైన నిద్ర లేకుండా గడుపుతున్నారు. ఊరిలో ఉన్న చాలా మంది, ఏదైనా ఘర్షణ వల్ల గాయాలు తగిలితే ఆ బాధ భరించడానికి భయపడటం లేదు, కానీ, వీరంతా వారికి చిన్నపాటి అవమానం జరిగినా

భరించే స్థితిలో లేరు. ఒకవేల అలా జరిగితే వారు తప్పక ప్రతీకారం తీర్చుకోవాలని ఆలోచిస్తూవున్నారు. రఘురామిరెడ్డికి, విశ్వనాథరెడ్డికి మధ్య అసలైన సమస్యలు ఏమి లేవు. వారిరువురి మధ్య అసలైన సమస్య కేవలం ఆధిపత్య పోరు మాత్రమే. ఈ పోరులో వారు ఒకరి ప్రాణాల్ని ఒకరు తీసుకొనడానికి వెనుదీయడము లేదు. ఒకరికొకరు విపరీతమయిన నష్టాన్ని కలుగజేసుకుంటూ వున్నారు.

ఇలా వుండగా, ఒక రోజు రాము వద్దకు తనతో పరిచయమున్న పెద్దపల్లె వ్యక్తి ఒకరు ఆందోళనగా ఒక జాబు తీసుకొని వచ్చి రాముకు ఇచ్చాడు. అది తన మామ, రఘురామిరెడ్డి వ్రాసినది. అందులోని సారాంశం ఏమిటంటే, విశ్వనాథరెడ్డి వర్గీయులు ఆ రోజు ఉదయం నుంచి ఊరినంతా దిగ్భందనం చేసినారని, వారు చాలా ఊర్ల నుంచి, బంధువులను పిలిపించుకొని చాలా రకములైన ఆయుధాలతో ఇంకా చాలా నాటు బాంబులతో తమ మీద దాడిచేసేందుకు కృతనిశ్చయులై ఉదయం నుంచి తమ వారినందరిని కవ్విస్తూ ఉన్నారని, వారి లక్ష్యం తనను హతమార్చడమే అయ్యుంటుందని, ఇప్పుడు తాను వారికి ఎదురు నిల్వలేనని, తనకు పోలీసుల రక్షణ అత్యవసరమని, ఎలాగైనా జిల్లా ఎస్పీని కలిసి వీలైనంత త్వరగా తనకు రక్షణ కల్పించవలసిందిగా అందులో వేడుకొన్నాడు.

రాముకు, ఉత్తరం చదవగానే పెద్దపల్లెలోని పరిస్థితి అర్థం అయ్యింది. అయినా, రాము చిన్ననాటి లాగా బెంబేలు పడకుండా, నిబ్బరంగా కర్తవ్యం ఆలోచించుకొని, వెంటనే తన బైక్‌పై తనకు ఉత్తరం తెచ్చి ఇచ్చిన వ్యక్తిని కూడా ఎక్కించుకొని జిల్లా యస్.పి., వద్దకు వేగంగా వెళ్ళాడు. అక్కడ అప్పుడు యస్.పి., తన ఆఫీసులోని, కాన్ఫరెన్స్‌హాలులో ముఖ్యమైన పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై ఉన్నారు. తలుపు వద్ద ఉన్న సెంట్రీతో, రాము ఈవిధంగా చెప్పాడు,

"నేను రాము అనే వకీలును. అత్యవసరమైన పనిమీద యస్.పి., గారిని కలవడానికి వచ్చాను".

అని చెప్పగానే సెంట్రీ,

“సార్, ఇప్పుడు లోపల క్రైం మీటింగ్ జరుగుతున్నది. జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులంతా వున్నారు. మీరు మీటింగు అయిపోయేటంతవరకు వేచి వుండండి”. అని చెప్పాడు.

దానికి రాము,

“నేను వచ్చిన పని చాలా ముఖ్యమైనది, ఇది కొందరి చావు బ్రతుకుల సమస్య. దయచేసి ఈ ఉత్తరాన్ని ఎస్పీ గారికి ఇచ్చి, రాము అనే వకీలు మీతో మాట్లాడుటకు బయట వేచి ఉన్నాడని చెప్పు, ఆ తర్వాత ఎస్పీ గారి ఇష్టము.”

అని ఉత్తరాన్ని ఇచ్చి పంపాడు. క్రైమ్ మీటింగ్‌లో వున్న ఎస్పీ, ఆ లేఖ చూసిన వెంటనే రామును లోపలికి రమ్మని చెప్పాడు. రాము లోనికి వెళ్ళి ఎస్పీ, గారికి నమస్కారం చేసి నిలబడ్డాడు. అప్పుడు ఎస్పీ ప్రక్కనే వున్న కుర్చీ చూపించి,

“మీరు కూర్చోండి! ఈ లేఖలోని సమాచారం నమ్మదగినదేనా ? మీరు ఏ హోదాలో నా దగ్గరికి వచ్చారు ? ఒక అడ్వకేట్ గానా? లేక ఒక ఫ్యాక్షనిస్ట్‌గానా ? అని అడిగాడు”

దానికి రాము తొట్రు పాటుపడకుండా,

“సార్ ! నేను 3 సం॥ల నుండి జిల్లా కోర్టులో అడ్వకేట్‌గా పనిచేస్తున్నాను. ఈ ఉత్తరం వ్రాసి పంపిన రఘురామిరెడ్డి గారు తన కూతుర్ని నాకిచ్చి వివాహం జరిపించిన మామగారు. నాకు ఏ ఫ్యాక్షన్‌తోనూ సంబంధం లేదు. ఇంతకు ముందు కూడా పెద్దపల్లిలోని ముఠాతగాదాలను అంతమొందించడానికి నా వంతు కృషి చేసి వున్నాను. ముఖ్యంగా రఘురామిరెడ్డి గారి ప్రాణాలకు ప్రమాదముందని ఈ ఉత్తరం ద్వారా తెలుస్తూ వుంది. మీరు వెంటనే తగిన చర్య తీసుకొనకుంటే, అక్కడ హింస చెలరేగే ప్రమాదం ఉంది. కనుక మీరు మీ అధికారాన్ని ఉపయోగించి అక్కడ గుమికూడిన అసాంఘీక శక్తులను అదుపులోనికి తీసుకొని అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరుచున్నాను,” అని విన్నవించుకున్నాడు.

వెంటనే ఎస్పీ గారు అక్కడే వున్న ఏ.యస్.పి. గారిని, ఇంకా జమ్మలమడుగు డివిజన్‌కు సంబంధించిన ఇద్దరు డి.యస్.పి.లను, తగినంత పోలీసు ఫోర్స్ తీసుకొని, వెంటనే పెద్దపల్లిని

చుట్టుముట్టి, అక్కడ గుమికూడిన నేరస్థులందరిని అదుపులోనికి తీసుకొమ్మన్నాడు. వెంటనే అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేసి, అన్ని విషయాలు తనకు రిపోర్ట్ చేయాలని ఆదేశించినారు. రాముకు తర్వాతి సమాచారము, వార్తా పత్రికలు చూసిన తర్వాత గానీ తెలియలేదు. మరుసటి రోజు అన్ని వార్తా పత్రికలలోనూ మొదటి పేజీలోనే,

"రేనాట మరలా పడగ విప్పిన ఫ్యాక్షన్" అని ప్రముఖంగా ప్రచురించారు.

పోలీసులు అంతా పెద్దపల్లిని చుట్టుముట్టి, చాలా మంది నేరస్థులను అదుపులోనికి తీసుకొన్నారు. చాలా పేలుడు పదార్థాలు, రెండు నాటు తుపాకులు, మూడు పిస్టల్లు, ఇంకా చాలా ఈటెలు, వేట కొడవళ్ళు స్వాధీనపరచు కొన్నారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి ఇంటిని, అతని అనుచరుల ఇళ్ళను కూడా సోదా చేశారు. అయితే అక్కడ పోలీసులకు కొన్ని ఈటెలు, వేటకొడవళ్ళు తప్ప ఇంకేమి దొరకలేదు.

అయినా కూడా రఘురామిరెడ్డి వర్గీయులను కొందరిని అదుపులోనికి తీసుకొని, రఘురామిరెడ్డిని తమ వెంట యస్.పి. గారి వద్దకు రమ్మని పిలుచుకొని పోయారు. రఘురామిరెడ్డి యస్.పి. ఆఫీసుకు చేరుకుంటూనే, రాముకు, తాను అక్కడికి వచ్చినట్లు సమాచారం అందించాడు. వెంటనే రాము రఘురామిరెడ్డిని కలుసుకొని, ఆ తర్వాత యస్.పి. గారితో, రఘురామిరెడ్డి, ముఠా కక్షలను ప్రోత్సహించకూడదని ఎంత అనుకున్నా ఇతరులు అతన్ని ఆ రొంపిలోనికి లాగుతున్నారని, అతనికి పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వకుంటే అతని పరిస్థితి చాలా దారుణంగా వుంటుందని, యస్.పి. గారికి విన్నవించుకున్నాడు. యస్.పి. గారు వీరి విన్నపాలను తప్పక పరిశీలిస్తానని చెప్పి, రఘురామిరెడ్డిని ఇంటికి వెళ్ళి పొమ్మని చెప్పాడు. రఘురామిరెడ్డి, రాము ఇంటికి వెళ్ళి రెండు రోజులు అక్కడే ఉన్నాడు. ఈ లోపల యస్.పి., గారు ఒక స్పెషల్ రిజర్వ్డ్ కానిస్టేబుల్‌ను రఘురామిరెడ్డికి రక్షణగా నియమించారు. అతను తన ఎస్కార్ట్ కానిస్టేబుల్‌తో కలిసి పెద్దపల్లికి తిరిగి వెళ్ళాడు.

పెద్దపల్లిలో అప్పుడప్పుడు ఘర్షణలు జరుగుతూనే వున్నాయి. ఎవరికీ ప్రశాంతత లేదు. రఘురామిరెడ్డికి ఏమి చేయాలో పాలుపోలేదు. తాను బలహీనుడై ఇతరులకు అణగి మణగి ఆ

ఊరిలో నిసించలేదు. అలాగని తాను ఆధిపత్యం చలాయించాలంటే మునుపటిలాగా ముఠాకక్షలు పెంచి పోషించాలి. ఈ మధ్యకాలంలో రఘురామిరెడ్డికే కాక అతని వైరి వర్గీయుడైన విశ్వనాథరెడ్డికి కూడా నిద్ర కరువైంది. ఇరుపక్షాలలో చాలా ఆస్థి నష్టం జరిగింది. ఊరంతా రెండు వర్గాలుగా నిలువునా చీలింది. వాటిని ఏకం చేయడం, ఆ ఊరిలో శాంతి సాధించడము, అంత సులువైన పనేమి కాదు. రఘురామిరెడ్డి, తాను మెత్తబడితే తన ఉనికికే ప్రమాదమని తలచి, తన భూములలో కొన్ని పొలాలలను విక్రయించి, ఇంకా ఇతరుల నుండి కొంత డబ్బు అప్పుగా సమకూర్చుకొని, మందుగుండు సామాగ్రి కొనడం మొదలు పెట్టాడు. ఎందుకంటే తనకు అంగబలం ఎక్కువగా వున్నా ఆయుధ సంపత్తి లేదు.

'తనకు లేనిది, అవతలి వారికి బాగా వున్నది ఈ ఆయుధాలు మాత్రమే. కనుక తాను ఆయుధాలు సమకూర్చుకుంటే తప్పక తమదే పైచేయి అవుతుంది,' అని భావించాడు.

రఘురామిరెడ్డి పైవిధంగా ఆలోచించి తన రక్షణకు ఒక పోలీసు ఎస్కార్ట్ వున్నా, తనంతకు తానుగా, తనను రక్షించుకొనుటకు ఒక మంచి పిస్టల్ అవసరమని భావించి, ఎక్కడో కర్నూలు జిల్లాలోని ఒక ముఠా నాయకుని వద్ద ఒక మంచి 9 యం.యం. పిస్టల్ అమ్మకానికి వుందని తెలుసుకొని తన మేనల్లుడయిన సురేష్‌కు ఇంకా కొంతమంది మనుషులను తోడిచ్చి, ఎలాగైనా ఆ వస్తువు చేజిక్కించుకొని రమ్మని పంపాడు. వారు జమ్మలమడుగుకు వెళ్ళి, అక్కడ ఒక జీపు బాడుగకు తీసుకొని, కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డ తాలూకాలోని ఒక మారుమూల పల్లెలో వున్న ముఠా నాయకుడి ఇంటికి వెళ్ళారు. వీరితో కూడా వెళ్ళిన ఆ ముఠానాయకుని బంధువు, సురేష్‌ను అతనికి పరిచయం చేసి, తాము వచ్చిన పనిని తెలియజేశాడు. అప్పటికి చీకటి పడవస్తున్నది కనుక, ఆ ముఠా నాయకుడు వీరందరికి భోజనాలు ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఆయుధాన్ని చూపించి,

"ఇటువంటిది ఈ జిల్లాలో ఎక్కడా లేదు. చాలా కాలం నుండి ఇది నా వద్దనే వుంది. దీనితో నా పార్టీలన్నీ నెరవేర్చుకున్నాను. దీని ఖరీదు ప్రస్తుతం లక్షరూపాయలు పైనే ఉంటుంది. కానీ మీరు తెలిసిన వారు కనుక 50,000 రూపాయలకైతే ఇస్తాను. అంతకు తక్కువకు ఇవ్వను"

అని చెప్పాడు.

అది అమ్మటకు ఆ ముఠా నాయకుని కొడుకు ససేమిరా, అని

“మేము, మీరు ఎంత డబ్బు ఇచ్చినా ఇది ఇవ్వము. మీరు వెంటనే ఇక్కడ నుండి వెళ్ళిపోండి” అని నిష్కర్షగా చెప్పాడు.

అప్పుడు సురేష్ చాలా చాకచక్యంగా,

“మాకెందుకు ఈ వస్తువు, మా పని అయిపోగానే మీది మీకు చేరుస్తాము. ఇప్పుడు మీకు కూడా దీని అవసరం ఏమి లేదు కదా ! మా నాయకుని ఆత్మరక్షణ కోసమే దీనిని కొంటున్నాము.” అని చెప్పగా,

ఆ ముఠానాయకుడు, తన కొడుకుతో,

“నీవు ఈ వ్యవహారంలో తలదూర్చకు. మనకు దీనితో ఇప్పుడు పనేమి లేదు. దీనిని పోలీసుల కళ్ళబడకుండా రక్షించుకోవాలంటే తల ప్రాణం తోకకు వస్తున్నది. ఈ మధ్యకాలంలో పోలీసుల దాడులు కూడా ఎక్కువగా వున్నాయి. ఇప్పుడు వున్న యస్.పి., కి ఈ యారముట్టు మనదగ్గర వున్నట్లు తెలిస్తే మన ప్రాణం తీస్తాడు. తెలివి తక్కువగా మాట్లాడద్దు. అవసరం అయినప్పుడు ఇటువంటివి ఎన్నైనా దొరుకుతాయి.” అని మందలించి,

“మీరు దీనిని తీసుకొనిపోవాలనుకుంటే, వెంటనే డబ్బు ఇచ్చి తీసుకుపొండి, ఇక్కడ ఎక్కువ సేపు వుండటం మంచిది కాదు.” అని చెప్పగానే,

సురేష్ ఇంక ఆలస్యం చేయడమెందుకని డబ్బు లెక్కపెట్టి, రూ॥ 50,000 ఇచ్చి, అతని వద్ద నుండి 9 యం.యం. పిస్టల్, దానికి సరిపోయే బుల్లెట్స్ 50 ఒక బ్యాగులో సర్దుకొని, బయలుదేరాడు. వీరంతా జీపు ఎక్కగానే, ఆ ముఠా నాయకుడు,

“మీరు జమ్మలమడుగుకు పోయే దారిలో రెండు పోలీసు చెక్‌పోస్టులు వున్నాయి. అక్కడ జాగ్రత్తగా వెళ్ళండి. ఒకవేళ ఆయుధంతో కూడా పోలీసులకు పట్టుబడితే, ఎట్టి పరిస్థితులలో కూడా మా పేరు బయటపెట్టవద్దు.” అని మాట తీసుకొని పంపించాడు.

జీపు వేగంగా జమ్మలమడుగు వైపు పరుగుతీసింది. అప్పుడు సమయం రాత్రి 8 గం॥ దాటింది. జమ్మలమడుగుకు 20 కి.మీ. దూరంలో కర్నూలు – కడప జిల్లాల బార్డర్ వుంది. అక్కడ ఒక పోలీసు చెక్‌పోస్టు ఉంది. అక్కడ సెంట్రీలు ప్రతి ఒక్క వాహనాన్ని జాగ్రత్తగా గమనించి అనుమానం వస్తే దానిని క్షుణ్ణంగా సోదా చేస్తూ వుంటారు. సురేష్ ముందు సీట్లో డ్రైవర్ ప్రక్కన కూర్చొని ఉన్నాడు. అతని వెంట వెళ్ళిన మిగతా నలుగురు జీపు వెనుక భాగంలో కూర్చొని వున్నారు. ఆయుధం వున్న బ్యాగ్ వెనుక వైపు సీటు క్రింద దాచి పెట్టి వుంది.

పోలీస్ చెక్‌పోస్టు కనుచూపు మేరలోకి రాగానే, సురేష్, డ్రైవర్‌తో

"చెక్‌పోస్టు దగ్గరికి రాగానే జీపు బాగా వేగం తగ్గించి పూర్తిగా నిలిపివేయకుండా మెల్లగా పోతూవుండు. నీవు ఏ మాత్రం గాబరా పడకుండా ఉండు, మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అని చెప్పాడు.

వీరు ఊహించినట్లే చెక్‌పోస్టు వద్ద ఇద్దరు పోలీసులు టార్చ్‌లైట్స్ వేస్తూ వాహనాన్ని నిలపమని సంజ్ఞ చేస్తూ ఉన్నారు. జీపు డ్రైవర్, సురేష్ చెప్పినట్లు బండి బాగా వేగం తగ్గించి మెల్లగా కదలికలోనే పెట్టి పోనిస్తున్నాడు. సురేష్ తల బాగా బయట పెట్టి, "మేము 'వేటగాడు' సినిమా సెకెండ్‌షోకు జమ్మలమడుగుకు పోతున్నాము. మీరు ఎవరైనా వస్తారా?" అని ఏమాత్రం తొట్రుపడకుండా అడిగాడు. దానికి ఆ కానిస్టేబుల్స్ ఇద్దరు, వీరు ఏమాత్రం అనుమానించదగిన వ్యక్తులు కాదని నమ్మి వెంటనే అలాగే వెళ్ళిపొమ్మని చెప్పారు.

జీపులోని వారు ఎవరూ ఒక కి.మీ. దూరం దాటేవరకు ఏమి మాట్లాడలేదు. జీపు స్పీడు కూడా పెద్దగా పెంచలేదు. తర్వాత డ్రైవర్ బాష జీపు స్పీడు బాగా పెంచి,

"ఏమిటి సార్ ! మీరు చేసిన పని ? నా ప్రాణం మీదికి తెచ్చేటట్లు ఉన్నారే ! ముందుగానే నాతో చెప్పి వుంటే, ఆ బ్రహ్మ దేవుడు కూడా కనిపెట్టలేనట్లు జీపులోపలే దాన్ని దాచిపెట్టి వుందును కదా!! అయినా మీరు నాకు ఏమాట చెప్పకుండా, ఇట్లా చేసేది ఏమి బాగాలేదు సార్!!!" అని తన ఆక్రోశం వెళ్ళగక్కాడు. దానికి సురేష్,

"ఏం బాషా ! ఇదంతా ముందే చెపితే నీవు మాతో వచ్చేవాడివా ఏమి ? చెప్పేదైతే ముందుగానే ఎందుకు చెప్పము!! నీ మామూలు ఏదో నీకు ముట్ట చెప్పుతాములే!!!" అని చెప్పాడు.

జమ్మలమడుగుకు 10 కి.మీ., దూరంలో, తర్వాత రాబోవు రెండవ చెక్‌పోస్టును తప్పించి, చేలల్లో అడ్డము బండ్లదారిలో 3 కి.మీ., దూరంలో ఉండే పెద్దపల్లికి దారి మళ్ళించారు. రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత రఘురామిరెడ్డి ఇంటికి చేరుకున్నారు. మొత్తం వ్యవహారం అంతా ఎంత రహస్యంగా చేసినా, రఘురామిరెడ్డి రాత్రికి రాత్రే చాలా ఆయుధాలు సేకరించడనే పుకారు గుప్పుమంది. రఘురామిరెడ్డి ఇంకా కొన్ని శక్తివంతమైన ఆయుధాలు కూడా సేకరించాడు. గంపల కొద్ది నాటుబాంబులు కూడా తయారు చేయించినాడు. ఈవిధంగా ఇరువర్గాలు, వారి వారి బలాన్ని, ఆయుధ సంపత్తిని పెంచుకొని మోటింపుకు దిగాయి. నువ్వా ! నేనా !! అనేటట్లు ఇరువర్గాలు తయారయినాయి.

ఊరిలోని వాతావరణమంతా చాలా గంభీరంగా తయారైంది. ఎప్పుడేమి జరుగుతుందో అని అందరూ ఆందోళనగా వున్నారు. ఆ రోజు రాత్రి రఘురామిరెడ్డికి చెందిన, ఏపుగా పెరిగి, బాగా గెలలు తీసిన, ఏడు ఎకరాల అరటి తోటను విశ్వనాథరెడ్డి వర్గీయులు నరికి వేశారు.

దీనితో రఘురామిరెడ్డి హతాశుడైపోయాడు. జరిగిన నష్టం కంటే,

'తాను వారికి ఏమి ద్రోహం చేశానని పచ్చని పంటను నాశనం చేశారాని' వాపోయాడు.

తానెంతగా ఈ ముఠా కక్షలు వద్దనుకున్నా, అవతలివారు తనను ఈ రొంపిలోనికి లాగుచున్నారే, అని బాధపడ్డాడు. జరిగిన నష్టం ఏదో జరిగింది, దీనితో నైనా వారి కళ్లు చల్లబడ్డాయోమోనని, జరిగిన నష్టం గురించి కేసు కూడా పెట్టలేదు.

రఘురామిరెడ్డి మంచితనాన్ని అవతలివారు చేతగాని తనంగా భావించి, పెట్రేగిపోయారు. వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. దీంతో రఘురామిరెడ్డి వర్గీయులలో ముఖ్యులైన రామిరెడ్డి, బాబయ్య, కొండన్న, నాగిరెడ్డి, పెద్దిరెడ్డి మొ॥లగు వారు తమలో తాము కూడబలుక్కొని, ఆ రోజు రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత బండలు పగలగొట్టే సమ్మెటలు తలా ఒకటి తీసుకొని

అవతలివారి తోటల వద్దకు వెళ్లారు. అక్కడ ఎవరు కావలి కూడా లేరు. వారు ఒక్కక్కరి తోట వద్దకు వెళ్ళి అక్కడ వున్న ఎలక్ట్రిక్ మోటార్లను పగలగొట్టడం మొదలు పెట్టారు. దాదాపు 20 మోటార్లు పగులగొట్టి తిరిగి ఇంటికి చేరుకొన్నారు.

దీనితో పెద్దపల్లిలో పరిస్థితి కణకణ మండే అగ్నిగుండంలాగా తయారైంది. వీధి పోరాటాలు కూడా మొదలయ్యాయి. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు బనాయించుకున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ముఠా తగాదాలను రూపుమాపాలని, ముఠా నాయకులపై ఉక్కుపాదం మోపుతున్న సమయంలో, పెద్దపల్లిలోని ఈ పరిణామాలన్నీ అటు పోలీసు వర్గాలలో, ఇటు జిల్లాలోని ఇతర ముఠా నాయకుల్లో, చర్చనీయాంశాలయ్యాయి. పర్యవసానంగా రఘురామిరెడ్డికున్న పోలీసు ఎస్కార్ట్ తొలగించారు. అంత అవసరం అనుకుంటే, అప్పట్లో వారి జీతభత్యాలు నెలకు దాదాపు 4 వేల రూపాయలు, ప్రభుత్వానికి చెల్లించి పోలీస్ ఎస్కార్ట్‌ను పెట్టుకోవచ్చు అని తెలిపారు. కానీ రఘురామిరెడ్డి ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అయినందున పోలీస్ ఎస్కార్ట్‌కు జీతభత్యాలు ఇచ్చి పెట్టుకోలేక పోయాడు.

పెద్దపల్లిలో పరిస్థితి ఇలా వుండగా రాము సొంత ఊరు కొత్తపల్లిలో అతని తండ్రి గంగిరెడ్డి ఆరోగ్యం క్షీణించింది. ఇన్నాళ్ళు గంగిరెడ్డికి భయపడి అణగిమణగి వున్న తన ఊరిలోని అన్ని వర్గాలవారు ఎదురు తిరిగారు. మునుపు దౌర్జన్యంగా గంగిరెడ్డి ఆక్రమించుకున్న స్థలాలను, భూములను వాటి నిజమైన హక్కుదారులు తిరిగి స్వాధీనపరచు కుంటుంటే గంగిరెడ్డి చూస్తూ ఊరుకున్నాడు. ఎందుకంటే తాను వృద్ధాప్యం వల్ల శక్తిహీనుడనైనానని, ఇప్పుడు తనకు ప్రతిఘటించే శక్తి లేదని, తన తర్వాత తన కుమారుడు తనంతటి వాడై వుంటే ఈ సమస్యలన్నీ ఉత్పన్నం అయ్యేవి కావని తలచాడు. అయినా కూడా గంగిరెడ్డి రామును ఈ ఎదురుదాడిని అడ్డుకోమని కోరాడు. కానీ, రాము వారినే సమర్థించి,

"మునుపు నీవు చేసిన అన్యాయాన్ని సరిదిద్దుకో" అని సూచించాడు.

దీనితో గంగిరెడ్డి పశ్చాత్తాపానికి బదులు రాము అంటే ద్వేషం పెంచుకున్నాడు. చిన్ననాటి నుండి తననెంతో అపురూపంగా చూసుకొన్న తల్లిదండ్రులు ఈవిధంగా ద్వేషంగా చూడడం

రాముకు ఖేదాన్ని కలిగించింది. కానీ, తాను న్యాయం వైపే నిలిచి తండ్రి కోపానికి గురి అయ్యాడు.

గంగిరెడ్డి స్వతహాగా మంచి లోకజ్ఞానం కలిగిన వాడగుటచే

"అనువుగాని చోట అధికులమనరాదు, కొంచెముండుటెల్ల కొదవకాదు" అనుకొని ప్రజలంతా చేసిన ఈ తిరుగుబాటును మౌనంగా భరించాడు. ఈవిధంగా, గంగిరెడ్డి ఎవ్వరికీ భయపడక ఊరంతా కలిసినా, ఎదురొడ్డి పోరాడినాడో, ఇప్పుడు శారీరక శక్తి క్షీణించిన తర్వాత, మానసికంగా భయపడక పోయినా, తన ఓటిమిని అంగీకరించి పరిస్థితులకు తలవంచాడు.

గంగిరెడ్డి మానసిక ప్రశాంతత కొరకు దైవధ్యానము చేస్తూ గడిపాడే కానీ, అవసానదశలో కూడా తన తప్పు ఒప్పుకొని పశ్చాత్తాపపడలేదు. గంగిరెడ్డి చివరి దశలో, రాము, అతనికి అన్నివిధాల సేవలందించి తన పుత్ర ధర్మాన్ని నెరవేర్చుకొన్నాడు. ఈవిధంగా గంగిరెడ్డి చిన్ననాటి నుంచి డబ్బు మీద విపరీతమైన వ్యామోహంతో ఎంతో కష్టపడ్డాడు. ఎంతో కఠినంగా వ్యవహరించి ఎంతో మందికి శత్రువయ్యాడు. చివరకు ఏమి వెంట బెట్టుకొని పోకుండానే పరలోకగతుడయ్యాడు. తన తండ్రి వ్యవహారశైలిని అడుగడుగున నిరసించిన రాము, అతను తన మీద చూపిన ప్రేమను ఎన్నటికీ మరచిపోలేదు.

ఇది ఇలా వుండగా, మూర్ఖులైన కొందరు రఘురామిరెడ్డి వర్గీయులు ప్రతీకారేక్షతో పొలంలో సేద్యం చేసుకొంటున్న విశ్వనాథరెడ్డి వర్గీయులైన తిరుపాల్‌రెడ్డిని, గంగన్నను, పెద్ద నాగిరెడ్డిని అక్కడికక్కడే చంపి పరారైపోయారు. ఉన్నట్లుండి జరిగిన ఈ హత్యలతో మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగమంతా ఉళిక్కి పడింది. తామెంత ప్రయత్నించినా పెద్దపల్లిలో శాంతిని నెలకొల్పలేక పోవడానికి గల కారణాల్ని అన్వేషించసాగింది. మూర్ఖులైన ఇరువర్గాలలోని కరుడుగట్టిన నేరస్తులను ఉక్కుపాదంతో అనిచివేయాలని నిర్ణయించింది. హత్యలు చేసిన వెంటనే, రఘురామిరెడ్డితో సహా అతని వర్గీయులంతా పరారై పోయారు. వారు పోలీసుల చేతికి చిక్కితే ఎంతటి వేధింపులకు గురి కావలసి వస్తుందో ఊహించుకొని, ఎవరికి సంబంధములేని, జిల్లాలోని మారుమూల ప్రాంతానికి పోయి దాక్కున్నారు. హత్యలు జరిగి వారం రోజులు అయినా, పోలీసులు ఎవ్వరిని

అరెస్ట్ చేయలేకపోవడంతో మొత్తము మీడియా అంతా గగ్గోలు పెట్టింది. వెంటనే జమ్మలమడుగు డి.యస్.పి., అడ్వకేట్ రాము సహాయం కోరాడు. రామును తన ఆఫీసుకు పిలిపించుకొని,

"పెద్దపల్లి హత్యకేసులో వున్న నిందితులందరిని వెంటనే మాకు లొంగిపొమ్మని చెప్పండి. లేకపోతే చాలా తీవ్ర పరిణామాలు తప్పవు. దయచేసి, మీరు పోలీసులతో సహకరించండి." అని కోరాడు.

దానికి రాము, డి.యస్.పి. గారితో,

"ఈ హత్యల్లో రఘురామిరెడ్డి పాత్ర ఏమి లేదు. అతనికి సంబంధం లేకుండానే కొందరు కరుడుగట్టిన నేరస్తులు ఈ హత్యలకు పాల్పడ్డారు. రఘురామిరెడ్డి నిర్దోషి." అని తెలిపి,

"నేను నా శాయశక్తుల ముద్దాయిలందరిని కలిసే దానికి ప్రయత్నించి, వారిని వెంటనే పోలీసులకు లొంగిపొమ్మని చెప్తాను" అని చెప్పాడు.

రాముకు కూడా వారెక్కడ దాగి వున్నారో తెలియదు. కానీ తన శాయశక్తులు ప్రయత్నించి చివరకు వారి స్థావరం కనుక్కొని, ఎవరికి చెప్పకుండా తానొక్కడే ఆ మారుమూల ప్రాంతానికి వెళ్ళి, తన మామ రఘురామిరెడ్డిని కలుసుకొని,

"మీరు వెంటనే పోలీసులకు లొంగిపోండి, లేకపోతే చాలా తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుంది." అని హెచ్చరించాడు. రఘురామిరెడ్డి అందుకు

"మాకు రెండ్రోజుల గడువు కావాలి, మూడవ రోజు మేమంతా తప్పక పోలీసులకు లొంగిపోతాము," అని చెప్పాడు.

రాము అందుకు సరేనని, డి.యస్.పి. గారిని కలిసి రెండ్రోజుల గడువు అడుగుదామని కడపకు వచ్చాడు. రాము ఎంత తెలివైన వాడైనా పోలీసుల నైజం పసిగట్టలేక పోయాడు. తనను షాడో పార్టీ వెన్నంటే వున్నది రాముకు తెలియనే తెలియదు. రాము సాయంత్రం 4 గం॥ల సమయంలో రఘురామిరెడ్డిని అతని వర్గీయులను కలుసుకున్నాడు. అదే రోజు రాత్రి 9 గం॥లకు రఘురామిరెడ్డి, అతని వర్గీయులు దాగుకొని వున్న ఊరిని దాదాపు 75 మంది రిజర్వ్‌డ్ కానిస్టేబుల్స్, ఐదుగురు ఎస్సైలు, ముగ్గురు సి.ఐ.లు, ఇద్దరు డి.యస్.పి.లు ఒక్కసారిగా అన్నివైపుల నుండి

చుట్టుముట్టి లౌడ్ స్పీకర్స్ ద్వారా వీరందరిని లొంగిపొమ్మని, లేనిచో, తీవ్ర పరిణామాలను ఎదుర్కొన వలసి వస్తుందని పదే పదే హెచ్చరించారు.

రఘురామిరెడ్డి తన వర్గీయులందరిని లొంగిపొమ్మని మూర్ఖంగా పారిపోవుటకు ప్రయత్నించవద్దని ఎంతగా చెప్పినా, కొందరు మూర్ఖంగా ఊరి ప్రక్కనే వున్న అడవి లోనికి పారిపోయారు. రఘురామిరెడ్డితో సహా చాలా మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి పోలీసు కస్టడీకి తరలించారు. పారిపోయిన ఆ నలుగురిని సర్చ్ పార్టీలు వెంటాడి, వారిని పట్టుకొని బాగా కోటింగ్ ఇచ్చారు.

ఇది ఇలా వుండగా, ఊరిలో విశ్వనాధరెడ్డి వర్గీయులు రెచ్చిపోయారు. ఆడవారిని, పిల్లలను, వృద్ధులను ఏమి అనలేదు, కానీ, వైరి వర్గీయుల ఆస్తులను ధ్వంసం చేసేదానికి పూనుకొన్నారు. రఘురామిరెడ్డి వర్గానికి చెందిన పంట పొలాలనంతా పశువులతో తొక్కించి పంటలను అంతా నాశనం చేశారు. వారికి చెందిన 4 ట్రాక్టర్లను కాల్చివేశారు. కొందరి ఇళ్ళు పీకి వేశారు. పెద్దపల్లిలో పరిస్థితులు ఇలా రగులుతూ వుండగా, అరెస్ట్ అయిన రఘురామిరెడ్డి, జ్యుడిషియల్ కస్టడీకి తరలించబడ్డాడు. ఊరిలో జరుగుతున్న విధ్వంసాన్ని పోలీసులు నివారించారు. పెద్దపల్లి ఇప్పుడు పోలీస్ పహారాలో ఉంది. ఇప్పుడు, అక్కడ ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగటం లేదు. ఈవిధంగా 3 నెలలు గడిచిపోయాయి.

రఘురామిరెడ్డికి అతని వర్గీయులకు బెయిల్ లభించింది. రఘురామిరెడ్డి పెద్దపల్లెకు తిరిగివచ్చాడు. తనకు మునుపు వున్న పోలీస్ ఎస్కార్ట్ తీసివేసినందు వల్ల ఎక్కడికి పోయినా ఏడు, ఎనిమిది మందిని తనకు రక్షణగా తోడు పిలుచుకు వెళ్ళేవాడు. వారు, పిడిబాకులు, వేటకొడవళ్ళు ఆయుధాలుగా ధరించేవారు. రఘురామిరెడ్డి మాత్రం తాను ముందే కొని వున్న 9 యం.యం. పిస్టల్ ఎప్పుడూ పూర్తిగా లోడు చేసి హ్యాండ్ బ్యాగులో పెట్టుకొని ఏమరుపాటు లేకుండా వెంట తీసుకొని వెళ్ళేవాడు. ఆ రోజు రఘురామిరెడ్డి ఏదో పనిమీద జీపులో తనకు తోడుగా ఎనిమిది మంది అనుచరులతో కడపకు బయలు దేరాడు.

పోలీసులు ఫ్యాక్షనిస్ట్‌లు ఎక్కడ కనిపించినా అక్రమ ఆయుధాల కొరకు సోదా చేసేవారు. రఘురామిరెడ్డి జీపులో జమ్మలమడుగుకు వచ్చిన తరువాత, అక్కడి నుంచి కడపకు, 'ప్రొద్దుటూరు మీద పోతే బాగుంటుందా ? లేక ముద్దనూరు మీద పోతే బాగుంటుందా?' అని ఆలోచించి, చివరకు ముద్దనూరు మీద అయితే పోలీసుల బెడద తక్కువ అని ముద్దనూరు వైపు బయలుదేరారు. సరిగ్గా ముద్దనూరు నాలుగు రోడ్ల కూడలి దగ్గరిగా వచ్చే సరికి, అక్కడ పోలీసులు అన్ని వాహనాలను సోదా చేస్తుండేది గమనించారు. కానీ అప్పటికే ఆలస్యమయ్యింది. పోలీసులు వీళ్ళ వాహనాన్ని చూడనే చూశారు. ఇప్పుడు వెనక్కి తిప్పితే వారికి తప్పక అనుమానం వస్తుందని, ప్రమాదాన్ని గ్రహించి, రఘురామిరెడ్డి తన వద్ద గల ఆయుధం వున్న బ్యాగును వెంటనే వెనకల కూర్చున్న వారికి ఇచ్చి, సీటు క్రింద పెట్టమని చెప్పాడు. వారు అలాగే చేశారు. జీపు పోలీసు చెక్‌పోస్ట్ సమీపించగానే అక్కడ వున్న ఇన్స్‌పెక్టర్ రఘురామిరెడ్డిని గమనించి,

"ఓహో! పెద్దపల్లి రఘురామిరెడ్డి గారా !! మీ వద్ద తప్పక ఏదో ఒక ఆయుధం వుండాలే!!!"

అన్న వెంటనే, పోలీసులు అంతా జీపు చుట్టు ముట్టారు. ఇన్స్‌పెక్టర్, "మీరంతా కిందకు దిగండి" అని హుంకరించారు. జీపు డ్రైవర్‌తో కూడా కలిపి అంతా 9 మంది ఉన్నారు. వారందరిని వరుసగా నిలబడమని అందరిని సోదా చేశారు. రఘురామిరెడ్డి వద్ద తప్ప అందరి వద్ద పిడిబాకులు దొరికాయి. అప్పుడు ఇన్స్‌పెక్టర్ గట్టిగా,

"ఏమిటి? మీరంతా ఏదైనా నేరం చేసేదానికి బయలు దేరారా ?"

అని అడిగాడు. అందుకు రఘురామిరెడ్డి

"లేదు సార్! ఇవన్నీ మా ఆత్మరక్షణ కొరకు వుంచుకున్నాము!! అంతేకానీ మేము ఏ నేరం చేసేదానికి పోవడం లేదు!!!" అని అన్నాడు.

"సరే! మీ జీపులో ఇంకా ఎన్ని ఆయుధాలు దొరుకుతాయో చూస్తాము!!"

అని, ముగ్గురు కానిస్టేబుల్స్‌ను జీపును క్షుణ్ణంగా సోదా చేయమని కోరాడు. వారికి నాలుగు వేట కొడవళ్ళు కనిపించాయి. అవి తెచ్చి ఇన్స్‌పెక్టర్ వద్ద పెట్టారు. అప్పుడు ఇన్స్‌పెక్టర్,

"వీరి వద్ద తప్పక ఫైర్ ఆర్మ్స్ వుంటాయి. సీట్ల క్రింద ఇంకా మ్యాట్ క్రింద బాగా వెతకండి,"

అని అన్నాడు. ఆ మాట వినగానే రఘురామిరెడ్డితో సహా మిగతా వారంతా హోతాషులై పోయారు. మరికొద్ది సేపటికి ఒక పి.సి. "సార్ ఇక్కడ సీటు కింద ఈ బ్యాగ్ ఉంది. ఇందులో ఏదో ఆయుధం వున్నట్లుంది"

అని బ్యాగ్ తెచ్చి ఇన్స్పెక్టర్‌కి ఇచ్చాడు. ఇన్స్పెక్టర్ బ్యాగ్ తెరచి అందులోని వస్తువును చూసి తన కళ్ళను తానే నమ్మలేక అశ్చర్యానికి గురి అయ్యాడు. ఎందుకంటే అందులో వున్నది నిషిద్ధ బోర్ కలిగిన 9 యం.యం. పిస్టల్. అప్పుడు ఇన్స్పెక్టర్,

"వీరందరిని వెంటనే అరెస్ట్ చేయండి,"

అని గట్టిగా అరిచాడు. అందరిని స్టేషన్‌కు తీసుకెళ్ళి పోలీసు పద్ధతిలో ఇంటరాగేట్ చేసారు. అయినా తమకేమి తెలియదని, అది సీటు క్రిందికి ఎలా వచ్చిందో తెలియనే తెలియదని, బహుశా, తమను ఇరికించేదానికి వేరెవరైనా దాన్ని రాత్రే సీటుక్రింద చేర్చారేమోనని చెప్పారు. ఈ సంజాయిషి పోలీసు వారు నమ్మకపోయినా, ఇంక చేసేది లేక యఫ్.ఐ.ఆర్.లో సెక్షన్ 3(1), సెక్షన్ 25 (1ఎ) (1బి), మరియు సెక్షన్ 7(1) ఆఫ్ ది ఫైర్ ఆర్మ్ యాక్ట్ 1959, రెడ్‌విత్ ఫైర్ ఆర్మ్ రూల్స్ 1962, సెక్షన్‌ల క్రింద నిషేధించబడిన 9 యం.యం. పిస్టల్ కలిగినందుకు అందరిమీదా నాన్ బెయిల్ కేసు ఫైల్ చేసి, 24 గం॥లలోపు వారిని మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరచారు. అక్కడ ముద్దాయిల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తమ వద్ద పిడిబాకులు మాత్రమే ఉన్నాయని అవి తమ ఆత్మ రక్షణ కొరకు మాత్రమే ఉంచుకున్నామని, 9 యం.యం. పిస్టల్ గురించి తామెరికి ఏమీ తెలియదని చెప్పారు. మేజిస్ట్రేట్ అందరికి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసు 15 రోజులకు వాయిదా వేశారు.

రాము వెళ్ళి తన మామ రఘురామిరెడ్డిని కలుసుకున్నాడు. తామెందుకు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడవలసి వచ్చిందో, నిషేధించబడిన ఆయుధాన్ని ఎందుకు కలిగి వున్నారో చెప్పాలని అడిగాడు. అందుకు రఘురామిరెడ్డి తమ వ్యతిరేక వర్గీయులు తనను హతమార్చడానికి వ్యూహం

పన్నుతున్నారని, తనకు పోలీస్ ఎస్కార్ట్ కూడా తీసివేసినారని, ఇట్టి పరిస్థితులలో తాను ఆత్మరక్షణకు మాత్రమే ఆ ఆయుధాన్ని వుంచుకున్నానని, తనకు ఏ నేరమూ చేసే ఉద్దేశం లేదని చెప్పాడు.

తన మామ రఘురామిరెడ్డి కోర్కె మేరకు ప్రతాప్‌రెడ్డి అనే సీనియర్ వకీలు ద్వారా బెయిల్ పిటిషన్ ఫైల్ చేశారు. విచారణలో రఘురామిరెడ్డి వకీలు ముద్దాయి లెవ్వరికి ఆ పిస్టల్ గురించి ఏ మాత్రం తెలియదని పిడిబాకులు మాత్రం తమ ఆత్మరక్షణ కొరకు తమ వద్ద ఉంచుకున్నారని తమ కక్షీదారులను కేసులో ఇరికించుటకు ఎవరో ముందుగానే ఇంటివద్ద వున్న జీపులో ఈ ఆయుధాన్ని వుంచారని తన కక్షీదారులంతా నిర్దోషులని రఘురామిరెడ్డి కడపలో వున్న తన కుమార్తె వద్దకు ఏదో పని మీద బయలుదేరి వెళ్తున్నాడని, అతనికి ఎక్కడా, ఎవరిపైనా నేరం చేసే ఉద్దేశం లేదని, కనుక తన కక్షీదారులంతా నిర్దోషులని వారిని బెయిల్‌పై విడుదల చేయవచ్చునని వాదించాడు.

దానికి ప్రభుత్వ న్యాయవాది వీరు కలిగి వున్నది నిషేధిత 9 యం.యం. బోర్ పిస్టల్ అని, దీని ఉపయోగించడం వల్ల ఎదుటి వాని ప్రాణాలు సులభంగా తీయవచ్చునని, వీరికి పెద్దపల్లిలో ముఠాకక్షలు వున్నాయని, కొన్ని నెలల క్రితమే అక్కడ మూడు హత్యలు కూడా జరిగాయని, ఈ ముద్దాయిలలో చాలా మంది ఆ కేసులలో నిందితులని, వీరిని విడుదల చేస్తే, వీరు సాక్ష్యాలను తారుమారుచేస్తారని, కనుక, ఎట్టి పరిస్థితులలో బెయిల్ మంజూరు చేయకూడదని వాదించాడు. ఈ వాదన విన్న న్యాయమూర్తి, ప్రభుత్వ న్యాయవాదితో ఏకీభవిస్తూ బెయిల్ పిటిషన్ కొట్టి వేశారు.

కొద్దిరోజుల తర్వాత ఈ కేసులో పోలీస్ ఇన్‌వెస్టిగేషన్ పూర్తి అయినందువల్ల పోలీసులు చార్జ్‌షీటు ఫైల్ చేశారు. అప్పుడు కేసు విచారణకు వచ్చింది. ఈసారి కూడా రఘురామిరెడ్డి వర్గీయుల తరపున ప్రతాప్‌రెడ్డి అనే సీనియర్ న్యాయవాది వాదిస్తున్నాడు. రఘురామిరెడ్డి ఇంకా ఇతర ముద్దాయిలు బెయిల్ లభించకుండానే విచారణను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ న్యాయవాది సాక్షులను వరుసగా విచారించారు. ముద్దునూరు నాలుగురోడ్ల కూడలిలో సోదా చేసిన పోలీసులనందరినీ విచారించారు. ఆ తర్వాత పంచనామా నిర్వహించిన సాక్షులను కూడా

విచారించారు. అందరూ ప్రాసిక్యూషన్‌కు అనుకూలంగా సాక్ష్యం చెప్పినారు. రఘురామిరెడ్డి వద్ద తప్ప మిగిలిన వారందరి వద్ద పిడిబాకులు దొరికాయని, తర్వాత వెతకగా జీపు వెనుకభాగంలో ఉన్న సీటు క్రింద నిషిద్ద ఆయుధం వున్న బ్యాగ్ దొరికిందని చెప్పారు. తర్వాత డిఫెన్స్ న్యాయవాది సాక్షులందరిని క్రాస్ ఎగ్జామిన్ చేశారు. అందరూ ప్రాసిక్యూషన్‌లో చెప్పినట్లే చెప్పినారు.

తరువాత, ప్రభుత్వ న్యాయవాది ఈవిధంగా తన వాదనను వినిపించాడు. ప్రస్తుతము రాయలసీమలో నెలకొన్న ముఠాకక్షల సంస్కృతి వల్ల ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయని, ఇట్టి పరిస్థితులలో నిషిద్ధ 9యం.యం. బోర్ పిస్టల్ కలిగివుండడం తీవ్రమైన నేరమని, ఈ ఆయుధాన్ని అందరూ కలిసి సీటు క్రింద దాచారని, అందరూ కలిసి, ఆయుధాన్ని అక్కడ పెట్టారు కనుక, అందరూ నేరస్థులేనని, కావున అందరూ శిక్షార్హులేనని, నిషిద్ధ ఆయుధాన్ని కలిగి వున్నందుకు విధించే శిక్ష అందరికీ సమానంగా విధించాలని తన వాదనను ముగించాడు.

దీనికి డిఫెన్సు న్యాయవాది ఈ విధంగా తన వాదనను వినిపించాడు, నిషిద్ధ ఆయుధం 9 యం.యం. పిస్టల్ వీరిలో ఏ ఒక్కరి వద్ద దొరకలేదని అది పోలీసులు జీపులో సీటు క్రింద మాత్రమే కనుగొన్నారని, కనుక వీరిలో ఏ ఒక్కరిని దోషులుగా పరిగణించలేమని ముద్దాయిలు చెప్పినట్లు ముందు రోజు రాత్రే, వేరెవరైనా ఆ ఆయుధాన్ని జీపులో సీటు క్రింద పెట్టి ఉండవచ్చునని, కనుక, తమ కక్షీదారులు నిర్దోషులని, వెంటనే వారిని విడుదల చేయాలని ప్రార్థించాడు.

ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి, ప్రభుత్వ న్యాయవాది వాదనతో ఏకీభవించి, వీరికి ఏదైనా నేరం చేసే వుద్దేశ్యం లేకపోయినా, ప్రమాదకరమైన నిషిద్ధ ఆయుధము 9 యం.యం. పిస్టల్ కలిగి వున్నందుకు వీరందరికీ 5 సం॥ల కఠిన కారాగార శిక్ష విధించారు.

రఘురామిరెడ్డితో సహా నేరస్థులందరినీ సికింద్రాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈవిధంగా రఘురామిరెడ్డికి జైలు జీవితం ప్రారంభమయింది. ఖైదీలందరూ జైలు యూనిఫాం ధరించాలి. ఒక్కొక్కరికి, రెండుజతల తెల్లని బనియన్లు,నిక్కర్లు యిచ్చారు. వీరందరూ వ్యవసాయంలో అనుభవమున్న వారు కావున, వీరికి జైలు లోపలే పొలం పనులు అప్పగించారు. ప్రతిరోజూ

వీరు జైలు లోపలే వ్యవసాయం చేయాలి.

ప్రతి రోజూ ఉదయమే లేచి, 6 గంటల కంతా టీ త్రాగి, ఎవరి పనులలోకి వారు పోవాలి. తిరిగి 11 గంటలకు లంచ్‌బ్రేక్, భోజనము అందరూ క్యూలో నిలబడి వారికిచ్చిన ప్లేట్‌లలో పెట్టించుకొనవలెను. ఆహారము పరిమితంగా ఉంటుంది. మరలా 12:30 నిముషములకు టీ త్రాగి పనిలోకి వెళ్ళాలి. సాయంత్రము 4 గంటల వరకు పనిచేయాలి. సాయంత్రము 4 గంటలకే అందరికీ భోజనము పెడతారు. వెంటనే అందరినీ బారెక్స్‌లలో ఉంచి తాళాలు వేస్తారు. తరువాత ఉదయం వరకూ తాళాలు తీయరు. టాయిలెట్స్ లోపలే ఉంటాయి. లోపలి ఖైదీల కదలికలను 24 గం|| సెంట్రీలు గమనిస్తూ ఉంటారు. ఎవరైనా జైలు అధికారులమీదికి తిరగబడినా లేదా తమకంటే బలహీనులైన ఖైదీలమీద దౌర్జన్యం చేసినా వారిని వంటరిగా నిర్భందిస్తారు. ఆవిధంగా నిర్భందించిన వారికి ఇంకెవరితోనూ సంబంధం ఉండదు. కేవలం ఆహారం మాత్రమే ఇస్తారు. దీనినే సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్ అంటారు. ఈ ఏకాంతం భరించరానిదిగా ఉంటుంది. ఎంతసేపున్నా నిముషాలు కూడా గడువవు. ఆవిధంగా ఒకరోజు గడపాలంటే ఒక యుగం గడిపినట్లు ఉంటుంది. ఈ శిక్ష పడినవారు తరువాత జైలులో తప్పు చేయాలంటే ఒకటికి రెండుమార్లు ఆలోచిస్తారు.

అంతవరకూ ఎంతో గొప్పగా బతికిన రఘురామిరెడ్డికి జైలు జీవితం అలవాటు కావడానికి చాలా సమయమే పట్టింది. మానసికంగా చాలా కృంగిపోయాడు. ఎందుకొచ్చిన ఆధిపత్యపోరు? జీవితంలో ఒక్కక్షణం కూడా మనశ్శాంతి లేదు. జీవితానికి భద్రతా లేదు. ఎందుకు ఇలాంటి బ్రతుకు? అని వ్యధ చెందాడు. అందరూ అండగా ఉంటే దౌర్జన్యము చేస్తూ నా అంతటి వాడు లేడని విర్రవీగడం వెనుక, ఇంతటి వేదన ఉంటుందని తెలియక చాలా మంది ఈ ముఠా కక్షలలో ఇరుక్కుపోతుంటారు. కోర్టులు, శిక్షలను ప్రతీకారం కోసము ఇవ్వవు. ఆ శిక్ష వలన జైలు జీవితం గడుపుతున్న నేరస్థుడు, ఎప్పుడో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకొని, తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి పరివర్తన చెందుతాడనే ఈ శిక్షలను విధిస్తారు.

ఒక నిషేధింపబడిన ఆయుధము కలిగి ఉండుట నేరమని ముఠా నాయకులు

భావింపకున్ననూ, ఆ ఆయుధముచే నేరము చేయుటకు అవకాశమున్నది కనుక అది ఖచ్చితంగా శిక్షార్హమే. ఇంకా ఈ ఆయుధాలు ఇవన్నీ ఎందుకు? ఈ ముఠాకక్షల వలననే కదా ! దీనివలన ఎవరికైనా ఇసుమంతైనా లాభముందా ? అంతా నష్టమే ! కనుక రఘురామిరెడ్డి ఈ ముఠా కక్షలకు స్వస్థి చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

ఇలా మూడు నెలలు గడిచిపోయాయి. ఒకరోజు నీరజ, రాముతో "ఈ రోజు హైదరాబాదుకు పోయి మా నాన్నను చూసి వద్దాము, అలాగే ఆయనకు జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేద్దాము" అని చెప్పింది. దానికి రాము 'సరే' అని చెప్పి, అవసరమైన కేసు ఫైల్స్ అన్నీ తీసుకొని హైదరాబాదు బయలుదేరి వెళ్ళారు. రాము హైదరాబాదులో తన స్నేహితుడైన హైకోర్టు వకీలు అరవింద్ ను కలిసి రఘురామిరెడ్డి గారి కేసు గురించి చర్చించి, ఆ కేసు ఫైలు అతనికి ఇచ్చి, ఎలాగైనా ఈ కేసు సాల్వ్ చేయమని చెప్పాడు. అరవింద్ హైకోర్టులో అప్పీలు చేసి కేసంతా క్షుణ్ణంగా పరిశీలించాడు. యఫ్.ఐ.ఆర్.లో నిషేధింపబడిన ఆయుధము జీపు వెనుకసీటులో దొరికిందని వ్రాశారు. ప్రత్యేకంగా ఫలానా వారి వద్ద దొరికిందని ఏమీ సాక్ష్యము లేదు, అయినా అందరిమీదా చార్జస్ మోపారు. అందరికీ శిక్ష పడింది. అరవింద్ ఈ పాయింట్స్ అన్నీ నోట్ చేసుకున్నాడు.

హైకోర్టులో కేసు విచారణకు వచ్చింది. విచారణలో అరవింద్ ప్రొహిబిటెడ్ బోర్ పిస్టల్ ఎవరి వద్ద నుండి స్వాధీనము చేసుకొనలేదనీ, దానిని జీపు వెనుక సీటు కింద నుండి స్వాధీన పరచుకున్నారనీ, కనుక, అది ఫలానా వారు అక్కడ ఉంచారనటానికి ఆధారమేమీ లేదని, కనుక, వీరందరినీ శిక్షించుట అసమంజసమని వాదించాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, అందరూ కలిసి దానిని అక్కడ ఉంచారని, అందరికీ అది అక్కడ ఉందన్న సంగతి తెలుసునని, కనుక అందరూ శిక్షార్హులేనని, ఆ విధంగా క్రింది కోర్టు ఇచ్చిన తీర్పు సరైనదేనని వాదించాడు. అయితే హైకోర్టు న్యాయమూర్తి, ప్రభుత్వ న్యాయవాది వాదనతో ఏకీభవించక ఎవరి వద్దా లేని నిషిద్ధ ఆయుధాన్ని జీపులో కనుగొన్నారు. అది అక్కడ ఎవరు పెట్టారో సరైన ఆధారము లేదు. కనుక, బెనిఫిట్ ఆఫ్ డౌట్ క్రింద అందరినీ నిర్దోషులుగా భావించవచ్చునని, కింది కోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేశారు.

మూడు నెలల జైలు జీవితము తరువాత రఘురామిరెడ్డి ఇంకా అతని అనుచరులు ఎనిమిది మంది నిర్దోషులుగా బయటికి వచ్చారు. రఘురామిరెడ్డి పరివర్తన చెందిన వ్యక్తిగా ఇంక ముఠా కక్షలజోలికి వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాడు.

మరికొన్ని రోజుల తరువాత పెద్దపల్లిలోని మూడు హత్యల కేసు విచారణకు వచ్చింది. అయితే, ఆ కేసులో నేరముతో సంబంధము లేని రఘురామిరెడ్డిని, ఇంకా కొందరిని అన్యాయంగా ముద్దాయిలుగా చేర్చినందువలన, పోలీసుల విచారణలో ఈ విషయాలన్నీ స్పష్టమయినందువలన, పోలీసులు, ఇరువర్గాలతో బాంధవ్యము ఉన్న ప్రముఖులను పిలిపించి, 'ఈ ముఠాకక్షలు అనాగకరికమైన వ్యవస్థలో వేళ్ళూనుకొన్న సంప్రదాయమని, అభివృద్ధి చెందిన నేటి తరంలో వాటినింకా కొనసాగించడం మూర్ఖత్వమని, కనుక ఇరువర్గాలను వెంటనే రాజీచేయమని' చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, రాము, ఇంకా కొందరి చొరవతో ఇరువర్గాలకూ ముఖ్యులైన వారందరినీ ఒకచోట చేర్చి, ఈ ముఠాకక్షల వలన ఎంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారో, ఎంతమంది ఎంతటి నరకయాతన అనుభవించారో, ఇంకెంతమంది తమ జీవితాలను జైలు గోడల మధ్య మగ్గబెట్టుకున్నారో, అందరికీ వివరించారు. ఆ తరువాత ఊరిలో ముఠాకక్షలతో సంబంధమున్న వారందరికీ ఒకచోట చేర్చి, వారితో 'ఫ్యాక్షన్ సంస్కృతి', విడనాడుతామని, ఇక మీదట ముఠాలు కట్టమని' ప్రతిజ్ఞ చేయించారు. ఈవిధంగా పెద్దపల్లిలోని క్రిమినల్ కేసులన్నీ మాఫీ అయినవి. ప్రభుత్వము చొరవతో మైలవరం ప్రాజెక్టు నుండి, పెద్దపల్లి భూములకు నీటి సదుపాయం సమకూరింది. ముందుగానే సారవంతమయిన నేల, దానికి తోడు కావలసినంత నీరు, రైతులంతా కష్టపడి పనిచేసి ఇప్పుడు ఇరుకార్లు పంటలు పండిస్తున్నారు. ఈవిధంగా పది సంవత్సరాలు గడిచిపోయాయి. నేడు రేనాట పెద్దపల్లి రూపురేఖలే మారిపోయాయి. ఇప్పుడు పెద్దపల్లి ఎటువంటి కక్షలూ లేని ఆదర్శ గ్రామము. పిల్లలంతా విద్యావంతులై, ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారు. రైతులంతా మంచి పంటలు పండిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుచున్నారు.

పెద్దపల్లిలోని ఈ ముఠాకక్షలతో ప్రభావితుడైన అడ్వకేట్ రాము, రాయలసీమ జిల్లాలో

నెలకొన్న ఈ సంస్కృతిని రూపుమాపేందుకు తనవంతు కృషిగా "రాయలసీమ శాంతి సంఘం" అనే ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. ఈ సంఘములో రాయలసీమ జిల్లాల్లోని ఔత్సాహికులు సభ్యులుగా చేరారు. వీరంతా చాలామటుకు విద్యావంతులే. వీరు నిర్ణయించుకున్న కార్యక్రమాలలో ముఖ్యంగా ముఠాకక్షలతో సతమతమయ్యే గ్రామాలను ఎన్నుకోవాలి. అక్కడ ఇరువర్గాలను సంప్రదించి, ఆయా గ్రామాలలో శాంతి స్థాపనకు కృషిచేయడం అన్నిటికన్నా ముఖ్యమైన కార్యక్రమం.

ఇందులో భాగంగా గ్రామానికంతా కలిపి కౌన్సిలింగ్ ఇవ్వడం, అందులో గ్రామ కక్షల వలన వచ్చే కష్టనష్టాలు అందులో జరిగే హింస, దౌర్జన్యము వాటి వలన కలిగే పరిణామాలు ప్రాణనష్టము, అవమానము, అభద్రత, జైలు జీవితం, ఆర్థికంగా చితికి పోవడం, వీటన్నిటి గురించి వివరంగా విశదీకరిస్తారు. పిల్లలు విద్యాపరంగా ఎలా నష్టపోతారో, వ్యవసాయ పరంగా రైతులు పంటలు పండించుకోలేక పొలాలలను ఎలా బీళ్ళు పెట్టుకుంటారో వివరిస్తారు.

ఇంత ప్రయాసపడి జీవితాన్నే ఫణంగా పెట్టి ముఠా కక్షలలో చేయు పోరాటాల ద్వారా ఎవరికైనా ఇసుమంతైనా లాభం ఉందా ? లేదనేదే అందరి సమాధానం. మరి నష్టమో అపారం. కనుక ఎవరు కూడా క్షణికమైన ఆవేశాలకు పోయి, ఈ ముఠాకక్షలను కట్టవద్దని, ఆ కక్షలలో సమిధలు కావద్దని, గ్రామస్తులందరికీ సందేశమిస్తారు. వారిని ఒప్పించి అందరిచే 'ఈ ముఠా కక్షలు కట్టము' అని వారిచే ప్రతిజ్ఞ చేయిస్తారు.ఇంకొందరికి వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇవ్వడం వీరి కార్యక్రమములో ఒక భాగం. ఇందులో ముఠా కక్షలలో గాయపడిన, లేదా ఆర్థికంగా నష్టపోయినా, లేదా తమవారిని పోగొట్టుకున్నవారిని పరామర్శించి, వారికి తగిన న్యాయం చేకూరుతుందని భరోసా యిచ్చి, తాము ఎట్టి పరిస్థితులలోనూ చట్టాన్ని తమ చేతులలోనికి తీసుకోవద్దని, ప్రతీకారదాడులకు పాల్పడవద్దని ఉద్బోధిస్తారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పక న్యాయ జరుగుతుందని, అందుకొరకు నిరీక్షించి చూడమని, సలహా యిస్తారు.

ఈవిధంగా, ఈ శాంతి సంఘము రాయలసీమలోని ముఠాకక్షలున్న అన్ని ప్రాంతాలు పర్యటించి పోలీసులకు సహకరిస్తూ, ముఠాకక్షలను రూపుమాపి, రాయలసీమలో శాశ్వత శాంతికి

బాటలు వేస్తూవుంది.

## ముగింపు

1990వ సం॥ ప్రాంతం నుండి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో వున్న ప్రభుత్వాలు రాయలసీమ వెనుకబాటు తనమునకు ముఖ్య కారణం ఇక్కడి ముఠాకక్షలే అని భావించి, వీటిని సమూలంగా రూపుమాపాలని నిర్ణయించారు. అందుకుగాను ఈ జిల్లాల్లో నిజాయితీ గల, సమర్ధులైన ఐ.పి.యస్. అధికారులను యస్.పి.లుగా నియమించారు. వీరు అధికారం చేపట్టగానే, మొదట ఇక్కడి పోలీసు వ్యవస్థను ప్రక్షాళనం చేశారు. తర్వాత ముఠా నాయకులపై, వారి అనుయాయులపై ఉక్కుపాదం మోపారు. ఇది ఒక విధంగా రాజ్యాంగానికి కొంత విరుద్ధమైనా, కొంతైనా కఠినంగా వ్యవహరించకపోతే, సమూలంగా రూపుమాపడం సాధ్యం కాదు, కనుక, కొందరు న్యాయవాదుల నుండి, సామాజిక కార్యకర్తల నుండి విమర్శలు వచ్చినా పోలీసులు కఠినంగా వ్యవహరించి ఈ ముఠాకక్షలను అణచి వేయడంలో విజయం సాధించారనే చెప్పవచ్చు.

ఇప్పుడు, అంటే, 2015వ సం॥ నాటికి, రాయలసీమ జిల్లాల్లో ముఠాకక్షలు దాదాపుగా అంతమైనట్లే చెప్పవచ్చు. ఈ సందర్భంగా రాయలసీమలోని మేధావులంతా కడపలో సమావేశమై "రాయలసీమ సమస్యలు – పరిష్కార మార్గాలు" అనే అంశంపై చర్చావేదిక ఏర్పాటు చేశారు. వక్తలలో న్యాయవ్యాదుల తరపున రాము కూడా పాల్గొంటున్నాడు.

వక్తలంతా రాయలసీమకు జరిగిన అన్యాయం గురించి వాటి పరిష్కారం గురించి ఆవేశంగా మాట్లాడుతున్నారు. ప్రసంగించే వారిలో రాము వంతు రాగానే నిండైన ఆత్మవిశ్వాసంతో నిబ్బరంగా వేదిక మీదకు వచ్చి సభను ఉద్దేశించి గంభీరంగా తన ప్రసంగాన్ని ఇలా మొదలు పెట్టాడు.

అధ్యక్షా ! వేదిక మీద ఆశీనులైన పెద్దలారా !! రాయలసీమ సోదర సోదరీమణులారా !!!

గడచిన రాయలసీమ చరిత్రను చూస్తే రక్తసిక్తమైన నేర చరిత్రే మనకు కనిపిస్తుంది. నిత్యం కరువు కాటకాలకు నిలయమైన రాళ్ళసీమగా కూడా గోచరిస్తుంది. కానీ దీన్ని ఒక శాంతి సీమగా, ప్రగతి పథంలోకి దూసుకుపోయే అలనాటి రాయలేలిన రతనాల సీమగా పూర్వ వైభవం

సాధించుటకు మనమంతా కలసికట్టుగా పోరాడాలి. ముఖ్యంగా రాయలసీమలో అభివృద్ధి, శాంతి సాధించాలంటే నీరు అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశం. నీరే రాయలసీమకు జీవనాధారమైనది. దురదృష్టవశాత్తు మనకు ఆ నీరే ఎక్కడ కనిపించకుండా అదృశ్యం అయిపోవుచున్నది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే త్వరలోనే రాయలసీమ రాబందులు ఎగిరే ఎడారిగా మారుతుంది. కనుక, మనమంతా వెంటనే మేల్కొని మనకు జీవనాధారమైన నీటిని సాధించుకోవాలి.

మొదటగా మనకు న్యాయంగా రావలసిన నదీజలాలను సాధించుకోవాలి.

"అడగందే అమ్మైనా అన్నం పెట్టదు"

అనేది తెలుగు నానుడి. కనుక మనం మనకు రావలసిన వాటానే కాకుండా క్రైసిస్ మేనేజ్‌మెంట్ క్రింద అటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇతోధికంగా ధనాన్ని రాబట్టుకోవాలి. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు అన్ని పూర్తి చేసుకోవాలి. నిన్న, మొన్న జరిగిన రాష్ట్ర విభజనలో, రాయలసీమకు జరిగిన అన్యాయం దేశంలో మరియే ఇతర ప్రాంతానికీ జరిగి వుండదు. చూస్తుండగానే శ్రీభాగ్, పెద్దమనుషుల ఒప్పందం, అంతా కలిసి తుంగలో తొక్కారు. ఇప్పుడు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాష్ట్రానికి రావలసిన మిగులు జలాలకూ యెసరు పెట్టారు. ఈ మిగులు జలాలలో దామాషా ప్రకారం రాయలసీమకు రావలసిన వాటా సాధించి తీరవలసిందే. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, గండికోట ప్రాజెక్టులు ఏ మాత్రం ప్రయోజనం లేని స్మారక చిహ్నాలుగా ఎట్టి పరిస్థితులలోను మిగిలి పోకూడదు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, రాయలసీమ వెనకబాటుతనాన్ని, ఇక్కడి జలవనరులు అంతరించిపోవుట, పగబట్టిన ప్రకృతి వల్ల ఇక్కడ నెలకొన్న పూర్తి వర్షాభావ పరిస్థితులు, వరుస కరువులతో త్రాగునీటికి కూడా కటకటలాడుచున్న ప్రస్తుత పరిస్థితులను గుర్తించి ఈ ప్రాంతానికి ప్రత్యేక హోదా ఇచ్చి అభివృద్ధి చేయవలసి ఉంది.

అలాకాక ఈ ప్రాంతాన్ని ఇంకా వివక్షకు గురి చేస్తే, మనమంతా కలిసికట్టుగా ఉద్యమించి మన హక్కులు సాధించుకొనేందుకు పోరాడాలి. ఏమిటి ? మనం భారతీయులం కాదా ? మనకెందుకు ఈ శిక్ష ? రాయలసీమ భారతదేశంలో అంతర్భాగం కాదా ? మనమీద

ఎంతకింత వివక్ష ? ఈ ప్రాంతం చూస్తుండగానే ఎడారిగా మారిపోతుంటే మిగిలిన భారతీయులకు దీన్ని రక్షించాల్సిన బాధ్యత లేదా ? దేశంలో ఒక ప్రాంతం దుర్భిక్షం అయిపోతుంటే, దాన్ని ఫణంగా పెట్టి ఇంకొక ప్రాంతాన్ని సుభిక్షం చేస్తారా ? ఇదెక్కడి న్యాయం ?

నీ శరీరంలో ఒక భాగానికి వ్యాధి సోకి క్షీణిస్తుంటే, అది అంత అవసరం లేని భాగమని, దానికి చికిత్స చేయకుండా పనికి వచ్చే మిగతా శరీరాన్ని కాపాడుకోవాలని చూస్తారా ? అది సాధ్యమేనా ? వ్యాధి పీడిత భాగం క్షీణిస్తుంటే ఆ వ్యాధి శరీరానికి అంతటికి వ్యాపిస్తుందని, తర్వాత శరీరమంతా క్షీణిస్తుందని, తెలియదా ఈ న్యాయకోవిదులకు? ప్రస్తుతం వున్న పరిస్థితులలో రాయలసీమకు ప్రత్యేక హోదా ఇచ్చి ఇక్కడి సాగునీటి, త్రాగునీటి, అవసరాలను తీర్చవలసిన బాధ్యత భారతీయులందరి మీద ఉంది, అని రాము తన ప్రసంగాన్ని ముగించాడు.

– సమాప్తము –